అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

www.navatelangana.com

శుక్రవారం 10-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 80 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50




రాష్ట్రపతి నుంచి పద్మవిభూషణ్ అందుకుంటున్న చిరంజీవి

## వికసిత్ భారత్ లేదు.. అచ్ఛేదిన్ రాలేదు..

బీజేపీ ఎజెండాలో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్స్, అబద్ధాలే

- ఇప్పటికే తేలిపోయిన 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పని: కరీంనగర్ రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్ 2లో..





# వచ్చేది కాంగ్రెస్ సర్కారే...

## రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

## పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం

- ప్రతి పేద మహిళ ఖాతాలో ఏడాదికి రూ.లక్ష జమ
- రైతు రుణమాఫీ
- అన్ని పంటలకూ ఎమ్ఎస్‌పీ
- 'అగ్నివీర్'కు కొత్త విధానం
- నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ ద్వారా ఉపాధి కల్పన : సరూర్‌నగర్ జనజాతర సభలో రాహుల్‌గాంధీ హామీ
- రాష్ట్రం నుంచి ఇండియా కూటమికి భారీ బహుమతి ఇవ్వాలని పిలుపు
- రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని హెచ్చరిక

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

దేశంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని చెప్పారు. ప్రతీ పేద మహిళ బ్యాంక్ అకౌంట్లో ఏడాదికి రూ.లక్ష జమ చేస్తామని వాగ్దానం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ అభ్యర్థులు పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగమనేది పుస్తకం కాదు, అది పేద ప్రజల గుండె చప్పుడని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంతోనే పేదలకు బలమైన శక్తి వచ్చిందన్నారు. అంతటి మహోన్నతమైన రాజ్యాంగ రూపకల్పన కోసం అంబేద్కర్, గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి మహానుభావులు తమ చెమటను, రక్తాన్ని ధారపోశారని తెలిపారు. ఇప్పుడు దాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని హెచ్చరించారు. ఆ పార్టీ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి శాయశక్తులా పోరాడుతున్నదని చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, తాను, రేవంత్‌రెడ్డి కృషి చేస్తామని భరోసానిచ్చారు. పదేండ్ల బీజేపీ హయాంలో దేశంలోని సంపదంతా కేవలం రెండు శాతంగా ఉన్న బిలియనీర్ల చేతుల్లోకి పోయిందని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీ లాంటి 22 మంది వ్యాపారుల కోసమే మోడీ పని చేశారని విమర్శించారు. రూ.లక్షల కోట్ల ప్రజల సొమ్మును వారికి పంచారని ఆరోపించారు. కాషాయ పార్టీ ఇన్ని రోజులు దేశ సంపదను ...11లో



### అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న మోడీ

అధికారమిస్తే రాజ్యాంగ పరిరక్షకులుగా ఉంటాం

- జూన్ 7న ఇండియా బ్లాక్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నర్సాపూర్ సభలో రాహుల్ గాంధీ 3లో..





# రివర్స్ గేమ్

## కాంగ్రెస్‌పై మోడీ అభాండాలు

### అదానీ, అంబానీలతో ఒప్పందం కుదుర్చుకున్నదంటూ ఆరోపణలు

- వారిద్దరి సంపద పెంచింది కాషాయ ప్రభుత్వమే
- అవకతవకలు జరిగినా చర్యలు తీసుకోలేదు

రాజన్న సాక్షిగా ప్రధాని అబద్ధాలు

**న్యూఢిల్లీ :** తెలంగాణలోని కరీంనగర్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచారసభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ ఓ కొత్త అస్త్రాన్ని బయటికి తీశారు. గుజరాత్‌కు చెందిన వ్యాపారవేత్తలు గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీలతో కాంగ్రెస్ ఒప్పందం కుదుర్చుకున్నదని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఈ ఇద్దరు వ్యాపార దిగ్గజాలకూ అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ ప్రతిపక్షాలు ఎప్పటి నుండో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోడీ వీరిద్దరికీ దేశాన్ని అమ్మేశారని అవి మండిపడుతున్నాయి. కానీ మోడీ మాత్రం రివర్స్‌గేర్‌లో ప్రతిపక్షాలనే నిందించడం ప్రారంభించారు. అదానీ, అంబానీల నుండి ఎంత సొమ్ము తీసుకున్నారో, వారి నుండి ఎంత బ్లాక్‌మనీ పొందారో చెప్పాలంటూ మోడీ ఆ సభలో రాహుల్‌ను ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన వెలువడే వరకూ అదానీ, అంబానీ నామస్మరణ చేసిన రాహుల్, కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత వారి ఊసే ఎత్తడం లేదని చెప్పారు. అయితే ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదు. 'ఇప్పుడు దేశంలో ఏం జరుగుతోందంటే ఇద్దరు అమ్మకందారులు, ఇద్దరు కొనుగోలుదారులు ఉన్నారు. అమ్మకందారులేమో మోడీ, అమిత్ షా. కొనుగోలుదారులు అదానీ, అంబానీ' అని గత 24న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. గత నెల 12న కోయంబత్తూరులో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ 'నరేంద్ర మోడీ, అదానీ విధానాలు రెండు భారతదేశాలను సృష్టించాయి. ఒకటేమో బిలియనీర్ల ...10లో

### మోడీ కుర్చీ కదులుతున్నది

అందుకే ఆయన 'మిత్రుల' పేర్లు తీస్తున్నారు

అదానీ, అంబానీల మీద ప్రధాని ఆరోపణలపై కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటమిని పసిగట్టి పారిశ్రామికవేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీలను ఉద్దేశించి ప్రధాని మోడీ 'తన స్నేహితులపై' దాడి చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. తెలంగాణలో జరిగిన ర్యాలీలో.. అంబానీ, అదానీలను కాంగ్రెస్ రాత్రికి రాత్రే విమర్శించటం మానేసిందనీ, దానికి ప్రతిఫలంగా పార్టీకి వారి నుంచి "నల్లధనం" వచ్చిందా? అని ...10లో



# ఇండియా జీతేగా..

## కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం ఏర్పాటు

ఎన్నికల తరువాత దేశంలో పెనుమార్పులు

మోడీకి ఓటమి కనిపిస్తోంది : సీతారాం ఏచూరి

**అమరావతి :** దేశంలో ఇండియా వేదిక పార్టీలదే గెలుపని, కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వం ఏర్పాటవుతుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. గురువారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల తరువాత దేశంలో పెనుమార్పులు జరుగుతాయని అన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంటున్నా ప్రజలు మాత్రం పేదరికంలో ఉన్నారని వివరించారు. ద్రవ్యోల్బణం, ఉపాధిలేమి పెరుగుతున్నాయని, అదే సమయంలో ఒకశాతం వ్యాపారవేత్తల చేతుల్లో పోగుపడిన సొమ్ము 70 శాతం మంది ప్రజల ఆదాయాలతో సమానమని తెలిపారు. బీజేపీ మరోసారి అధికారంలోకొస్తే దేశంలో రాజ్యాంగాన్ని ప్రస్తుతం ఉన్న చట్టాలను సమూలంగా ...11లో

## దలాల్ స్ట్రీట్‌లో ఎన్డీఏపై భయాలు

మెజారిటీపై అనుమానాలు..

ఇన్వెస్టర్లలో ఆందోళన

బేర్ పంజాతో సెన్సెక్స్ 1060 పాయింట్ల పతనం

రూ.7.3 లక్షల కోట్ల సంపద ఆవిరి 11లో..

## తెలంగాణలో 10 మావే

ఈ ఎన్నికలు రాహుల్ వర్సెస్ మోడీ మధ్యే..

భువనగిరి సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**నవతెలంగాణ-భువనగిరి రూరల్**

తెలంగాణలో 10 ఎంపీ స్థానాల్లో పాగా వేయబోతున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయగిరిలో బీజేపీ ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడారు. 2024 ఎన్నికలు రాహుల్ వర్సెస్ మోడీ ...11లో



## 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?

### రైతులను కాల్చి చంపిన వాళ్లు ఓట్లు ఎలా అడుగుతున్నారు?

- ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించాలి
- మోడీ మళ్లీ గెలిస్తే ఎన్నికలనేవే ఉండవు
- భువనగిరిలో సీపీఐ(ఎం)ను గెలిపించాలి : పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- జనగామలో అభ్యర్థి జహంగీర్‌తో కలిసి రోడ్ షో

**నవతెలంగాణ జనగామ**

మతోన్మాద, కార్పొరేట్ విధానాలతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా పట్టణంలో భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌తో కలిసి.. తమ్మినేని రోడ్డు షో నిర్వహించారు. అంబేద్కర్ నగర్‌లోని గురుద్వార్ వద్ద ప్రారంభమైన రోడ్డు షో.. ఇండస్ట్రియల్ ఏరియా, మైనార్టీ కాలనీ, సంజయ్ నగర్, అమాలిగడ్డ చమన్ (పెద్దనల్ల), ధర్మకంచ, వెంకన్నకుంట, జుబ్లీగార్డెన్, బస్టాండ్ మెయిన్ రోడ్, బాలాజీ ...11లో

# దొంగ ఓట్లు వేస్తూ దొరికారు

## గుజరాత్‌లో బీజేపీ కార్యకర్తల అరెస్ట్

**గాంధీనగర్ :** అసలే కోతి...ఆపై కల్లు తాగింది...అన్న చందంగా దొంగ ఓట్లు వేసిందే చాలక ఆ ఘనకార్యాన్ని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ఇద్దరు బీజేపీ కార్యకర్తలను గుజరాత్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మహిసాగర్ జిల్లా దాహోద్ లోక్‌సభ స్థానానికి చెందిన బీజేపీ కార్యకర్తలు విజయ్ భభోర్, మనోజ్ మాగన్‌లను ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఐపీసీ సెక్షన్ల కింద అరెస్ట్ చేశామని పోలీస్ సూపరింటెండెంట్ జేదీప్‌సింగ్ జడేజా తెలిపారు. ప్రథంపురాలోని 220 నెంబర్ పోలింగ్ కేంద్రంలో వీరు బోగస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని ఆయన చెప్పారు. భభోర్ తండ్రి రమేష్ భభోర్ గతంలో సంత్రామ్‌పూర్ తాలూకా అధ్యక్షుడిగా పనిచేశారు.

ఐపీసీలోని 171, 188 సెక్షన్ల కింద వీరిని అరెస్ట్ చేశారు. కాగా దొంగ ఓట్ల ఉదంతం నేపథ్యంలో ఆ కేంద్రంలో జరిగిన పోలింగ్‌ను రద్దు చేసినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ నెల 11న అక్కడ రీపోలింగ్ జరగనుంది. భభోర్ ఫేస్‌బుక్ ఖాతాలో దొంగ ఓట్ల బాగోతం



ప్రత్యక్షప్రసారం జరిగింది. భభోర్ మరో వ్యక్తితో కలిసి పోలింగ్ కేంద్రంలో ప్రవేశించాడు. ఈవీఎంను అనేకసార్లు చేతిలోకి తీసుకున్నాడు. ఎన్నికల అధికారుల హెచ్చరికలను కూడా పెడచెవిన పెట్టాడు. 'మాకు పది నిమిషాల సమయం ఇవ్వండి. ఇక్కడే కూర్చుంటాం. ఉదయం నుండి పోలింగ్ కొనసాగుతోంది' అని భభోర్ అంటున్నట్టు వీడియోలో కన్పించింది. బీజేపీ మాత్రమే గెలవాలని, ఈ ఈవీఎం తన తండ్రిదని కూడా అతను చెప్పాడు. బీజేపీ ...11లో

## రేపు సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్

### 48 గంటలపాటు మూసివేత

- జూన్ 4న కూడా అమ్మకాలు నిలిపివేత
- ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఆదేశం
- తగిన చర్యలు చేపట్టిన ఆబ్కారీశాఖ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



లోకసభ ఎన్నికల నేపథ్యంలో మూడ్రోజుల పాటు రాష్ట్రంలో మద్యం అమ్మకాలు నిలిపేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అందుకనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆబ్కారీ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. మే 13న పోలింగ్ సందర్భంగా రెండు రోజులు, జూన్ 4న కౌంటింగ్ పూర్తయ్యే వరకు లిక్కర్ షాపులు మూసేయాలని ఉత్తర్వుల్లో ...11లో

# దేశాన్ని వీడుతున్న సంపన్నులు

భారీగా పెరుగుతున్న వలసలు | 2017-22 మధ్య ఇతరదేశాలకు..

### భారీ మొత్తంలో తరలి వెళ్తున్న దేశ సంపద

ఉత్పత్తి, సంపద సృష్టి, ఉపాధిపై ప్రభావం : ఆర్థిక నిపుణులు



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని మోడీ పాలనలో గుప్పెడు మంది సంపన్నులు తీవ్రంగా లాభపడ్డారు. వారి ఆస్తులు భారీగా పెరిగాయి. దేశ సంపదలో అధిక భాగం వారి చేతిలోనే ఉన్నది. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేటు అనుకూల విధానాలతో సంపన్నులు ఇంకా అభివృద్ధి చెందుతున్నారని మేధావులు అంటున్నారు. దీంతో దేశంలో సంపన్నుల సంఖ్య పెరుగుతున్నదని చెప్తున్నారు. అంతేకాక, గత కొంత కాలంగా భారత్ నుంచి పెద్ద సంఖ్యలో సుసంపన్న భారతీయులు దేశాన్ని విడిచిపెట్టి వెళ్తున్నారని అంటున్నారు. ఒక మిలియన్ డాలర్, అంతకంటే ఎక్కువ నికర ఆస్తులను కలిగి ఉన్నవారిని అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ఐ)గా పిలుస్తారు. 2017-2022 మధ్య హెచ్ఎన్ఐలు 30,000 నుంచి 35,000 మంది దేశాన్ని విడిచి వెళ్లారు. ఒక్క 2022లోనే 8,000 హెచ్ఎన్ఐలు దేశాన్ని వీడారు. 2023లో ఈ సంఖ్య 6,500 మందిగా ఉన్నది. హెచ్ఎన్ఐలు మాత్రమే భారత్‌ను విడిచిపెట్టారు. ఇటీవల సంవత్సరాలలో ఇంత పెద్ద సంఖ్యలో హెచ్ఎన్ఐలు దేశం విడిచి వేరే చోట పౌరసత్వం తీసుకోవడం దురదృష్టకరమని మేధావులు అంటున్నారు. ఈ పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ.. భారత్‌లో హెచ్ఎన్ఐల సంఖ్య నిరంతరం పెరుగుతున్నదని గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా, ...11లో

# వికలాంగుల సంక్షేమాన్ని పట్టించుకోని బీజేపీని ఓడించాలి

- భువనగిరి నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు మద్దతు

మిగతా 16 నియోజకవర్గాల్లో ఇండియా బ్లాక్ (కాంగ్రెస్)ని గెలిపించాలి : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల సంక్షేమాన్ని పట్టించుకోని బీజేపీ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ అధికారంలోకొచ్చిన తర్వాత వికలాంగులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేసేందుకు కుట్రలు పన్నారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వికలాంగులపై దాడులు, మహిళలపై లైంగిక వేధింపులు, పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ రూ.5వేలకు పెంచాలన్న డిమాండ్‌ను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 2016 ఆర్‌పీడీ చట్టానికి కమిషనర్‌ను నియమించలేదని తెలిపారు. నేషనల్ ట్రస్ట్‌కు చైర్మెన్ నియమించలేదనీ, తొమ్మిది జాతీయ సంస్థలను నాలుగు సంస్థలుగా విలీనం చేసేందుకు నిర్ణయించారని తెలిపారు. ఆయా సంస్థల్లో కొత్త నియామకాలు చేపట్టలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగులను మినహాయించేందుకు నిర్ణయించి, కోర్ట్ తీర్పుతో వెనక్కి తగ్గిందని తెలిపారు. ఎంపీ నిధుల్లో వికలాంగులకు కేటాయించిన వాటిని ఖర్చు చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# నర్సింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

- టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నర్సింగ్ విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలున్నాయని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. సుశిక్షితులైన నర్సులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందనీ, నైపుణ్యాలను పెంచుకుని వృత్తిలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. గురువారం హైదరాబాద్ తార్నాకలోని టీఎస్‌ఆర్టీసీ నర్సింగ్ కళాశాలలో 2023-24 బ్యాచ్‌కి చెందిన 40 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో రాణించాలంటే.. ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ వృత్తికి సంబంధించి శ్రమించే తత్వం, సహనం, వృత్తి నైపుణ్యం ఉన్నవారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. విసుగు, విరామం లేకుండా నర్సులు పనిచేస్తుంటారనీ, అలాంటి అంకితభావంతోనే అత్యున్నత సేవలు అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. జీవితంలో షార్ట్‌కట్స్ ఉండవనీ, కష్టపడితేనే ఏ వృత్తిలోనైనా ఉన్నతస్థాయికి చేరుకుంటారని వివరించారు. ఆర్టీసీ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఆ ఆస్పత్రికి అనుసంధానంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 128 మంది విద్యార్థులున్నారనీ, తక్కువ సమయంలోనే అత్యుత్తమ కళాశాలగా అది నిలిచిందని చెప్పారు. ఇక్కడి నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన 50 మంది విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కృష్ణకాంత్, ఓఎస్డీ సైదిరెడ్డి, తార్నాక ఆస్పత్రి సీఎంవో డాక్టర్ శైలజామూర్తి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్) రామ్మోహన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర తులసి, వైస్ ప్రిన్సిపాల్ సోని, తదితరులు పాల్గొన్నారు.



# రూ.2 కోట్ల విలువైన స్పిరిట్ పట్టివేత

- కెమికల్స్ కంపెనీపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఓ కెమికల్స్ కంపెనీపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి.. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.2 కోట్లా 31 లక్షల విలువ గల స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలో జగదాంబ కెమికల్స్ కంపెనీపై గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడ 105 బ్యారెల్స్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 21 వేల లీటర్ల రా రెక్టిఫైడ్ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హనుమాన్ రామ్, శ్రావణ్ కుమార్‌ను అరెస్టు చేసి వారిపై 31 ఏ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# వికసిత్ భారత్ లేదు.. అచ్ఛేదిన్ రాలేదు..

- డాలర్‌తో పోల్చితే రూ.84కు పడిపోయిన రూపాయి విలువ
- బీజేపీ ఎజెండాలో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్, అబద్ధాలే!
- రూపాయి పని చేయని బండి సంజయ్ మాట్లాడే భాషేందో తెల్వదు..
- ఇప్పటికే తేలిపోయిన 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పని : కరీంనగర్ రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్





నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ అని చెప్పిన నరేంద్ర మోడీ తన పదేండ్ల పాలనలో సబ్‌కా సత్యనాశ్, దేశ్‌కా సత్యనాశ్ చేశారని, డాలర్‌తో పోల్చితే రూ.84కు మన రూపాయి విలువ పడేసి దేశాన్ని అధోగతిపాలు చేశారని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. మోడీ చెప్పిన వికసిత్ భారత్, అచ్ఛేదిన్ రాలేదని, ఇంకోవైపు 420 హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ కరువును తెచ్చిందని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీం'నగరం'లోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం సాయంత్రం కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికలకు ముందు 150 హామీలతో గెలిచిన ప్రధాని నరేంద్ర మోడీ 'బేటీ పడావో బేటీ బచావో, అమృత్‌కాల్, అచ్ఛేదిన్, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్ అంటూ గొప్పగొప్ప మాటలు చెప్పి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శిం చారు. మోడీకంటే ముందు పని చేసిన 15మంది ప్రధానులు రూ.55 లక్షల కోట్ల అప్పు చేస్తే.. ఈయనొక్కడే రూ.105లక్షల కోట్ల అప్పులు చేశారని వివరించారు. ఇంత అప్పులు చేసినా దేశం నుంచి ఎగుమతులు నిలిచిపోయాయని, విదేశీమారక నిల్వలు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం దేశంలోని దళితులకో, గిరిజనులకో, మైనారిటీలకో.. ఒక్క మంచి పని అయినా చేసిండా అంటూ ప్రశ్నిస్తూ.. కార్పొరేట్లకు మాత్రం రూ.15లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిండని తెలిపారు. ఆయన వ్యవసాయ వ్యతిరేక చట్టాలు తెస్తే వాటి రద్దు కోసం పోరాడిన 750 మంది రైతులను ఢిల్లీ గడ్డ మీద పొట్టన బెట్టుకున్నారని, తీరా పంజాబ్ ఎన్నికలు రాగానే క్షమాపణలు చెప్పి దొంగలా ఓట్లు అడుక్కున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచారని, వాళ్ల నాలుగు రూపాయల పని కూడా చేయలేదని అన్నారు. ఇక్కడ గెలిచిన బండి సంజయ్ పైసా పని చేయకపోగా ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. ఎంతసేపు మతవిద్వేషపు మాటలు తప్ప.. ఆయన భాష ఏదో కూడా అర్థం కాదని అన్నారు. గటువంటి వ్యక్తిని మళ్లీ గెలిపిద్దామా? అంటూ ప్రశ్నించారు. కరీంనగర్ చైతన్యవంతమైన గడ్డ అని, ఇక్కడి మేధావులు, విద్యావంతులు, యువకులు ఆలోచన చేయాలని, మంచి చేసే పార్టీని, నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు.

**కాంగ్రెస్ పనేందో తేలిపోయింది..**

మొన్నటి ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు కలిపి మరో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పనితీరు ఏందో ఈ ఐదు నెలల కాలంలోనే తేలిపోయిం దని కేసీఆర్ అన్నారు. నోటికెన్ని వస్తే అన్ని వాగ్దానాలిచ్చి మోసం చేసిందన్నారు. కండ్లెదుటే కరెంటు పోతోందని, 365 రోజులూ సజీవ జలధారగా ఉన్న 200కిలోమీటర్ల గోదావరి ఎండిపోవడం, మిషన్‌భగీరథ నీళ్ల రాకపోవడం చూస్తుంటే ప్రజల కోపానికి ఈ పార్లమెంట్ ఎన్నికల తరువాత ఈ గవర్నమెంట్ ఉంటుందా? ఊడుతుందా? తేల్వకుండా ఉన్నదన్నారు. మహిళలకు ఆర్టీసీ ఫ్రీ స్కీమ్ చూస్తుంటే సర్కస్ ఆటలా మారిందని, మహిళలు జుట్టుపట్టుకుని కొట్లాడుకునే స్థితికి తెచ్చారని అన్నారు. రైతులకు ఏనాడూ కష్టం రాకుండా కంటికి రెప్పలా తాము కాపాడుకుంటూ వస్తే.. రేవంత్‌రెడ్డి సర్కారు వాళ్లను అష్టకష్టాలు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ సభలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ మహిళలకు రూ.2500 ఇస్తున్నామని చెప్పారని, ఎవరికైనా ఆ డబ్బులు అందాయా? అని ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలు గమనించాలని కోరారు. ఇప్పటికే తన సర్వేలో కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ 8శాతం ముందంజలో ఉన్నారని, ఈనెల 13న ఇదే ఉత్సాహాన్ని చూపి బీఆర్‌ఎస్‌కు మంచి మెజార్టీ ఇచ్చి వినోద్‌ను పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ఈ రోడ్‌షోలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రహరీ కూలిన ఘటనలో ఆరుగురి అరెస్ట్

నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ జిల్లా బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలో భారీ వర్షానికి ప్రహరీ కూలి ఏడుగురు మృతిచెందిన ఘటనలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. భవన నిర్మాణదారుడు అరవింద్ రెడ్డి, సైట్ ఇంజినీర్ సతీష్, ప్రాజెక్ట్ మేనేజర్ ఫ్రాన్సిస్, గుత్తేదారు రాజేష్ సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

# మతోన్మాద బీజేపీని ఓడించాలి

- భువనగిరి ఎంపీగా ఎండీ జహంగీర్‌ను గెలిపించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు

నవతెలంగాణ-మంచాల


ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశవాద రాజకీయాలు చేసే మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు పిలుపునిచ్చారు. సుత్తి-కొడవలి-నక్షత్రం గుర్తుకు ఓటేసి భువనగిరి ఎంపీగా సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండీ జహంగీర్ 35 ఏండ్లుగా ప్రజా సేవలో ఉంటూ పార్టీలో పని చేస్తున్నారని అన్నారు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. మిగతా పార్టీల అభ్యర్థులు నోట్ల కట్టలతో రాజకీయం చేయడం తప్పా చేసిందేమీ లేదన్నారు. బీజేపీ దేశంలో మత రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో దేశ ప్రజలను అన్నింట్లో ఆగం చేసిందన్నారు.

# వెస్ట్‌జోన్ డీసీపీపై చర్యలు తీసుకోండి

- ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీ విజయకుమార్, బోరబండ ఎస్‌ఎహెచ్‌వో భూపాల్ గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎలక్షన్ కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం.శశిధర్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బోరబండలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తమ పార్టీ నేత వెంకటేష్ తదితరులపై పోలీసులు అకారణంగా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.



# ముస్లింల కోటాపై మోడీ వాదనలు నిరాధారం

వెనుకబాటుతనం ఆధారంగానే రిజర్వేషన్లు

- పలు కమిటీలు, కమిషన్లు ప్రతిపాదనలూ చేశాయి
- ముస్లింలకు రిజర్వేషన్ల అంశంపై చంద్రబాబు, దేవెగౌడ చర్యల మీద స్పందించరా?
- మోడీని ప్రశ్నిస్తున్న మేధావులు, విశ్లేషకులు

**న్యూఢిల్లీ :** ముస్లింలకు రిజర్వేషన్ల అంశంపై ప్రతి ఎన్నికల ప్రచారాల్లో ప్రధాని మోడీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ అధ్యక్షుడు జేపీ. నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మొదలుకొని కింది స్థాయి నాయకులు, కార్యకర్తల వరకు దీనిపై పెద్ద దుష్ప్రచారం చేస్తూ విషం కక్కుతున్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లను ఒప్పుకునేది లేదనీ, ముస్లింలకు కోటాను కల్పించేది లేదనీ తెగేసి చెప్తున్నది బీజేపీ పరివారం. అయితే, బీజేపీ చెప్తున్నట్టుగా ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్ అనేది ఆ వర్గంలోని వెనకబడినవారికేననీ, వెనకబాటుతనం ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించబడ్డాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

కర్నాటకలో ముస్లింలను ఓబీసీలో చేర్చటంపై బీజేపీ తీవ్ర వ్యతిరేకతను తెలియజేస్తున్నది. అయితే, బీజేపీ ప్రస్తుత మిత్ర పక్షం జేడీ(ఎస్)1994లోనే ముస్లిలంకు రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఆ సమయంలో కర్నాటక సీఎంగా ఉన్న దేవెగౌడ ఈ రిజర్వేషన్లను తీసుకొచ్చారు. అంతేకాదు, తెలుగు రాష్ట్రం ఏపీలోని బీజేపీ మిత్రపక్షం టీడీపీ కూడా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్తున్నది. ఇతరులపై వేలెత్తి చూపే ముందు ఒక విషయంలో ఉన్న హేతుబద్ధత గురించి ఆలోచించాలనీ, ఎన్నికల కోసం రాజకీయాలు చేస్తే.. దేశంలోని ఒక వర్గాన్ని విస్మరించినట్టవుతుందనీ, ఇది ప్రజాస్వామ్య దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని మేధావులు చెప్తున్నారు.

కొన్ని రోజుల క్రితం రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో మోడీ కాంగ్రెస్‌పై దాడి చేస్తూ ఒక వర్గం భారతీయులు ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారంటూ సంభోదించారు. మరొక సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హిందువుల సంపదను వేరే వర్గం వారికి పంచిపెడుతుందని ఆరోపించారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తీసేసి దానిని వేరే వర్గం వారికి కేటాయిస్తున్నారని ప్రజల్లో విభజన తీసుకొచ్చి విష బీజాలు నాటే ప్రయత్నం చేశారని మేధావులు చెప్తున్నారు. చాలా ఎన్నికలలో ఏదో ఒక అంశంపై ఆ ఒక్క వర్గాన్నే టార్గెట్ చేసుకోవటం, ఇతర వర్గాల్లో ఆందోళనను రేకెత్తించి గంపగుత్తగా ఓట్లు పొందటమే బీజేపీ, ప్రధాని ఉద్దేశమని విమర్శకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూనే ఒక వర్గంపై బీజేపీ తీవ్ర దుష్ప్రచారాన్ని చేసిందని అంటున్నారు.

> ముస్లింలకు రిజర్వేషన్ అంశంపై చంద్రబాబు మాట్లాడితే.. దానికి మిత్రపక్షంగా ఉన్న బీజేపీ లాలూను వ్యతిరేకించిన విధంగా ఎందుకు చేయలేదనీ, ఇది కాషాయపార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని విమర్శకులు అంటున్నారు. ఏపీలో ఎన్డీయేయే కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు నాలుగు శాతం కోటా ఇస్తామని చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

### లాలూకు వ్యతిరేకం.. చంద్రబాబుపై మౌనం

ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ బీహార్‌లోని విపక్ష రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన ప్రకటనపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ అనుకూల మీడియా కూడా ఎప్పటిలాగే బీజేపీకి ప్రచారం కల్పిస్తూ ముస్లింలకు రిజర్వేషన్ల అంశంపై విషాన్ని కక్కింది. అయితే, ఇదే విధంగా స్పందించిన బీజేపీ మిత్రపక్షం విషయంలో మాత్రం బీజేపీ, మోడీలు మౌనం వహించారు. మీడియా కూడా ఈ విషయంపై పెద్దగా ఆసక్తి చూపలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

> కర్నాటక, ఏపీ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలలో 1990వ దశకంలో వరుస కమిటీలు, సామాజిక న్యాయ కమిషన్‌లు వారి కోసం నిశ్చయాత్మక చర్యలను సిఫారసు చేసిన తర్వాత కొన్ని ముస్లిం సమూహాలకు ఓబీసీలలో రిజర్వేషన్‌లో చిన్న వాటా దక్కిందని మేధావులు గుర్తు చేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్లు అమలు చేయాలన్న తన మిత్ర పక్షాలైన చంద్రబాబు నాయుడు, దేవెగౌడ డిమాండ్లపై ఇప్పుడు ప్రధాని స్పందించాల్సిన అవసరం ఉన్నదని వారు అంటున్నారు.

### ముస్లింలలో వెనుకబాటుతనం

2006 సచార్ కమిటీ నివేదిక ముస్లిం భారతీయులలో బహుళస్థాయి వెనుకబాటుతనాన్ని లేవనెత్తింది. ముస్లింలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా హిందువుల కంటే వెనుకబడి ఉన్నారనీ, సామాజికంగా అణగదొక్కబడ్డారనీ, పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ, చారిత్రకంగా భూమి యాజమాన్యంలో అసమానతలు వంటి కారణాలతో వెనకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారన్న నివేదిక సమాచారాన్ని మేధావులు గుర్తు చేశారు. వీరి బాగు కోసం కీలక హామీలను చేస్తే.. బీజేపీ వంటి హిందూత్వ పార్టీలు, సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయనీ, దీంతో ముస్లింల జీవితాలు ఇప్పటికీ బాగుపడటం లేదని అంటున్నారు.

# మళ్లీ తప్పుడు సమాచారం

- ఈసీఐ నుంచి నోటీసు
- సోషల్ మీడియా పోస్ట్‌ను తొలగించిన కర్నాటక బీజేపీ



**న్యూఢిల్లీ :** తప్పుడు వార్తలు, కథనాలు, సమాచారంతో ప్రజలను వర్గాలుగా విభజించి రాజకీయాలు చేయటం ఈ ఎన్నికల్లో బీజేపీ చేస్తున్న పని. ఒక అజెండా అంటూ లేకుండా కేవలం విషం చిమ్మే ప్రచారాన్ని మాత్రమే ఆ పార్టీ నమ్ముకున్నది. ముఖ్యంగా, ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుంటూ.. ప్రజలను తప్పుదారి పట్టించే వివాదాస్పద వీడియోలను తయారు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నది. ఇప్పటికే ఇలాంటి వీడియోలు, ఫోటోలు, కథనాలను ఆ పార్టీ తన సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేసి విమర్శల పాలైంది. అయినప్పటికీ.. ఆ పార్టీ తీరులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించటం లేదు. ఒక మైనారిటీ వర్గాన్ని టార్గెట్ చేసుకుంటూ తప్పుదారి పట్టించే, వివాదాస్పద పోస్ట్‌పై ఎన్నికల సంఘం (ఈసీఐ) నుంచి నోటీసులు రావటంతో.. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలోని దాని అధికారిక ఖాతాల నుంచి బీజేపీ కర్నాటక యూనిట్ ఒక వీడియోను తొలగించాల్సి వచ్చింది.

కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయ కమిటీకి సభ్యుల నియామకంపై బీజేపీ చేసిన తప్పుడు సమాచారాన్ని లేవనెత్తిన తర్వాత బీజేపీ సోషల్ మీడియా ఖాతాల నుంచి పోస్ట్ తొలగించబడటం గమనార్హం. హొసకోట్‌లోని అవిముక్తేశ్వర స్వామి దేవాలయంలోని బ్రహ్మరథోత్సవ (రథోత్సవం) కమిటీలో ముస్లిం వర్గానికి చెందిన సభ్యుడిని నియమించటాన్ని అభ్యంతరం వ్యక్తం చేసిన కర్నాటక బీజేపీ.. రాష్ట్రంలోని సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను దోచుకుని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది.

దీనిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి రామలింగారెడ్డి కర్నాటక బీజేపీని నిలదీశారు. రథోత్సవ కమిటీలో ముస్లిం వర్గానికి చెందిన సభ్యుడిని నియమించటం కొన్నేండ్లుగా అనుసరిస్తున్న ఆచారమనీ, రాష్ట్రంలో బీజేపీ హయాంలోనూ అమలు చేశారని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 2020, 2021లో కూడా హిందూయేతరుడిని ప్యానెల్‌లో నియమించారని మంత్రి వివరించారు. అప్పటి మంత్రి ఎం.టి.బి నాగరాజ్ సూచన మేరకే నియామకాలు జరిగాయని తెలిపారు. "హొసకోట్‌లోని శ్రీ అవిముక్తేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవం కార్యక్రమాన్ని పర్యవేక్షించ డానికి కాంగ్రెస్ 'నవాజ్'ని నియమిం చింది. మన దేవాలయాలను దోచుకోవ టానికి ప్రయత్నించిన తర్వాత, హిందు వులను ద్వేషించే సీఎం సిద్ధ రామయ్య ఇప్పుడు హిందువేతరులను నియమిం చడం ద్వారా దేవాలయాలను, వాటి వనరులను నియంత్రించాలని చూస్తు న్నారు" అని బీజేపీ కర్నాటక యూనిట్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నది.

కర్నాటక బీజేపీ తన అధికారిక హ్యాండిల్‌లో ఈ తప్పుదోవ పట్టించే పోస్ట్‌ను పెట్టిన తర్వాత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.టి రవితో సహా పలువురు బీజేపీ నాయకులు తమ అధికారిక ఖాతాలలో పోస్ట్‌లను పంచు కున్నారు. కాగా, ఈ తప్పుడు సమాచారంపై ఈసీఐ నోటీసు అందించిన తర్వాత.. కర్నాటక బీజేపీ తన అన్ని అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న పోస్ట్‌ను తీసివేసింది.

# కళ్లుండీ చూడలేదు... చెవులుండీ వినలేదు

- కోడ్ ఉల్లంఘనలపై గప్‌చుప్
- పాలకపక్షంపై ఈగ వాలనివ్వదు
- ఈసీ పనితీరుపై ప్రజల్లో సడలుతున్న విశ్వాసం
- యాప్ పనిచేయదు... చేసినా సమాధానం రాదు
- ఈ-మెయిల్‌కూ స్పందనుండదు
- ఎన్‌జీఆర్‌ఎస్ పనితీరూ డిటో డిటో

**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి పాలక పక్షానికి వ్యతిరేకంగా ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. కళ్లుండీ చూడనట్లు, చెవులుండీ విననట్లు ప్రవర్తిస్తోంది. ఈసీ అట్టహాసంగా ప్రారంభించిన సీవిజిల్ యాప్ పనితీరు దారుణంగా ఉంది. అందులో ఫిర్యాదులే నమోదు కావడం లేదు. ఒకవేళ అదృష్టం బాగుండి నమోదైనా సమాధానం రాదు. ఫిర్యాదుల నమోదు కోసం ఉద్దేశించిన ఎన్‌జీఆర్‌ఎస్ పనితీరు కూడా సేమ్ టు సేమ్. పోనీ ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేద్దామంటే దానికీ జవాబు ఇవ్వరు. మరి కోడ్ ఉల్లంఘనల గురించి ఎవరికి చెప్పుకోవాలి?

కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తూ, ముస్లిం మైనారిటీలను కించపరుస్తూ ప్రధాని నరేంద్ర మోడీ గత నెల 21న రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో చేసిన ఎన్నికల ప్రసంగానికి సంబంధించిన వీడియోను పూనేకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంకిత్ శుక్లా చూశారు. ఆయన గతంలో ఎన్నడూ ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాయలేదు. కానీ మోడీ ప్రసంగాన్ని విన్న రోజు రాత్రే ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఆయన ఈ-మెయిల్ పంపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన మోడీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 'భారతీయులకు వ్యతిరేకంగా విద్వేషం, మతోన్మాదం అనే విషంతో మనసును నింపుకున్న వ్యక్తిని ఎన్నికల్లో పాలుపంచుకునేందుకు అనుమతించకూడదు' అని అందులో సూచించారు. అయితే శుక్లాకు ఇప్పటి వరకూ ఈసీ నుండి సమాధానమే రాలేదు.

### హద్దులు దాటినా చర్యలు లేవు

ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ అన్ని హద్దులూ దాటి ప్రతిపక్షాలపై నిందారోపణలు చేస్తున్నారు. ముస్లిం మైనారిటీలపై విషం చిమ్ముతున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేసి వాటిని ముస్లింలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. మరోవైపు ముస్లింలను కించపరిచే వీడియోలను సామాజిక మాధ్యమాలలో బీజేపీ ప్రచారంలో పెడుతోంది. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్ కంటికి ఇవేమీ కన్పించడం లేదు. విద్వేష ప్రసంగాలు చెవులకు విన్పించడం లేదు. హిందూత్వ పార్టీ బాహాటంగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నా మౌనం వహిస్తోంది.

### స్పందన లేదు

విద్వేష ప్రసంగాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలతో విసిగి వేసారిపోయిన సాధారణ పౌరులు తగిన చర్యలు తీసుకోవాలని ఈసీని వేడుకుంటూనే ఉన్నారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్, నేషనల్ గ్రీవెన్స్ రెడ్‌రెసల్ సిస్టమ్ (ఎన్‌జీఆర్‌ఎస్) ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని ఈసీ పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇస్తోంది. కానీ ఈ రెండూ పని చేస్తున్న దాఖలాలు లేవని 'స్క్రోల్' పోర్టల్ తేల్చింది. ఒకవేళ ఫిర్యాదును స్వీకరించినా స్పందన పేలవంగా ఉంటోందని తెలిపింది.

### పనిచేయని సీ విజిల్

సీవిజిల్ యాప్‌ను ఎన్నికల కమిషన్ 2018లో ప్రారంభించింది. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి పౌరులు అందులో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపింది. ఈ యాప్‌లో పౌరులు చిత్రాలు, ఆడియోలు, వీడియోల ద్వారా ఫిర్యాదును నమోదు చేయవచ్చు. అయితే ఈ యాప్ ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ ఫోన్లలో పనిచేయడం లేదు. ఆండ్రాయిడ్‌లో అయితే స్క్రీన్ ఓపెన్ చేసినప్పుడే సమస్య ఎదురవుతోంది. లాగిన్ పేజీలో ఫిర్యాదును నమోదు చేయడం సాధ్యం కావడం లేదు. బన్స్‌వారాలో మోడీ ప్రసంగం విన్న తర్వాత సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించానని ప్రముఖ బిజినెస్ జర్నలిజం వెబ్‌సైట్ సంపాదకుడు ఉజ్వల్ నానావతి తెలిపారు. అయితే అది పనిచేయడం లేదని, స్క్రీన్ ఓపెన్ చేయగానే హ్యాంగ్ అయిందని చెప్పారు.

యాపిల్ యాప్ స్టోర్ వెబ్‌సైట్‌లో సీ విజిల్ యాప్‌కు 1.9/5 రేటింగ్ వచ్చింది. 140 మంది యూజర్లు తమ అభిప్రాయాలు తెలియజేశారు. దాని పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ యాప్ హఠాత్తుగా షట్‌డౌన్ అవుతోందని ఓ యూజర్ చెప్పారు. మూడు దశల పోలింగ్ పూర్తయిన తర్వాత కూడా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని 'స్క్రోల్' తెలిపింది. ఒకవేళ ఫిర్యాదును యాప్‌లో నమోదు చేసినా సమాధానం వస్తుందన్న నమ్మకం లేదు. దీంతో కొందరు అసలు ఆ యాప్ వైపు చూడడమే మానేశారు.




> **పుణ్యకాలం గడిచిన తర్వాత...**
>
> బన్స్వారాలో మోడీ చేసిన ప్రసంగంపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఎన్నికల కమిషన్ నోటీసు పంపింది. అందులో ఎక్కడా మోడీ పేరు లేదు. ముస్లింలను పరాన్నజీవి అయిన కోడిగా చూపుతూ కర్నాటక రాష్ట్ర బీజేపీ హ్యాండిల్ ఈ నెల 3న ఒక కారికేచర్ వీడియోను పోస్ట్ చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుండి 'నిధుల' దాణా అందుకున్న తర్వాత ఆ కోడి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలను గూడు నుండి బయటకు తరిమేసినట్టు అందులో చిత్రించారు. ఈ కారికేచర్‌పై ఎన్ని ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఈసీ పట్టించుకోలేదు. కర్నాటకలో పోలింగ్ పూర్తయ్యే వరకూ వేచి ఉండి, ఆ తర్వాత వీడియోను తొలగించాలని ట్విటర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అంతే తప్ప బీజేపీపై ఎలాంటి చర్యలు లేవు.

ఏప్రిల్ 21న మోడీ ప్రసంగం తర్వాత చాలా మంది ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్ ద్వారా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఈ-మెయిల్స్ పంపారు. అయితే వేటికీ జవాబు రాలేదు.

### ఈ-మెయిల్‌కూ సమాధానం రాదు

కోడ్ ఉల్లంఘనలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లనే ఈసీ దృష్టికి తేవాల్సి వస్తోందని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపక సభ్యుడు జగదీప్ చోకర్ చెప్పారు. అయితే దాని స్పందన కూడా అంతంత మాత్రంగానే ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ-మెయిల్స్ ద్వారా ఫిర్యాదు చేస్తుంటే పట్టించుకున్న పాపాన పోవడం లేదని, దీంతో కొందరు పట్టువదలని విక్రమార్కుల్లా సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ ప్రక్రియ నెల రోజుల సమయం తీసుకుంటుందని, ఫలితంగా ఎన్నికలపై ప్రభావం ఏమీ కన్పించదని అన్నారు. 2022లో జరిగిన గుజరాత్ శాసనసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై చోకర్, మరికొందరు ఈసీకి ఫిర్యాదు చేశారు. కానీ ఫలితం శూన్యం. ఎన్నికలు ముగిసిన నెల రోజుల తర్వాత ఈసీ నుండి వారికి సమాధానం వచ్చింది. అమిత్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని దాని సారాంశం.

### ఎన్‌జీఆర్‌ఎస్ తీరూ అంతే...

సీ విజిల్ యాప్ పని చేయకపోవడంతో చాలా మంది ఎన్‌జీఆర్‌ఎస్‌ను ఆశ్రయించారు. అయితే అందులో ఫిర్యాదుతో పాటు ఫోన్ నెంబర్, జిల్లా, రాష్ట్రం, అసెంబ్లీ నియోజకవర్గం వంటి వివరాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీని పని తీరును తెలుసుకోవడానికి 'స్క్రోల్' పోర్టల్ రిపోర్టర్ ఓ ఫిర్యాదు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో కర్నాటక బీజేపీ షేర్ చేసిన ఓ వీడియోపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిర్యాదును పరిష్కరించామంటూ ఆ మరునాడే సమాధానం వచ్చింది. తీరా దానిని పరిశీలిస్తే కర్నాటక రాష్ట్ర వెబ్‌సైటులో ఫిర్యాదు నమోదు చేయాలని సలహా ఇచ్చారు. కర్నాటక రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో ఫిర్యాదుల నమోదుకు ఓ ఆప్షన్ ఉంది. అయితే అందులో నమోదైన ఫిర్యాదులను అది నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్‌కే పంపుతుంది.

ఏదేమైనా ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో నమ్మకం క్రమేపీ సడలిపోతోంది. గత ఐదు సంవత్సరాల్లో ఎన్నికల కమిషన్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసం 51 శాతం నుండి 28 శాతానికి పడిపోయిందని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ గత నెలలో విడుదల చేసిన ప్రీ-పోల్ సర్వేలో తేలింది.

# కాంగ్రెస్‌లో చేరిన శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ

## తగిన ప్రాధాన్యత ఇస్తామన్న మంత్రి ఉత్తమ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ సమక్షంలో ఆమె హస్తం గూటికి చేరారు. వారు శంకరమ్మకు కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ శంకరమ్మకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆమె కుటుంబం రాష్ట్రానికి చేసిన త్యాగాన్ని పార్టీ మరవబోదని తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన వందలాది మంది బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఉత్సాహవంతులైన నేతలను పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని వివరించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అబద్ధాల ప్రచారంతో విజయం సాధించాలని చూస్తున్నాయన్నారు. ప్రధాని మోడీ దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అదానీ కాంగ్రెస్ మనిషి అన్నట్టు మోడీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్న సమాచారంతో ఆయన భయంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని ఎంఎస్‌పీ ధరకు ప్రభుత్వమే కొంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తవగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఆయన ప్రకటించారు.

# నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నేటితో ముగియనుంది. మొత్తం 2,64,043 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 2,29,072 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే15,970 మంది సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.301.03 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఆభరణాలు, డ్రగ్స్, నార్కొటిక్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని, 8,481 మందిపై కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.


# అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న మోడీ

- అధికారమిస్తే రాజ్యాంగ పరిరక్షకులుగా ఉంటాం
- రైతుల రుణాలు మాఫీచేస్తాం..
- కుటుంబంలో మహిళ పేర అకౌంట్‌లో రూ.లక్ష డిపాజిట్
- జూన్ 7న ఇండియా బ్లాక్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం : మెదక్ పార్లమెంట్ నియోజక వర్గం నర్సాపూర్ సభలో.. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ
- దేశ చరిత్రలో మెదక్ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో.. పేదల భూములు గుంజుకుంది
- లక్ష మెజారిటీతో నీలం మధును గెలిపించాలి : సీఎం రేవంత్‌రెడ్డి

**నవతెలంగాణ-నర్సాపూర్**

బీజేపీ అగ్ర నేతలు రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. నరేంద్ర మోడీ దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టారే తప్ప దేశ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. దేశంలో కోట్లాది మంది యువకులను నిరుద్యోగులుగా మార్చిన ఘనత ప్రధానమంత్రికే దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీకి దేశంలో 25 మంది మాత్రమే ముఖ్యమని, దేశ ప్రజలు ముఖ్యం కాదన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. పెద్దల అప్పులను మాఫీ చేసిన మోడీ.. రైతుల అప్పులు మాత్రం మాఫీ చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే మొదట రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన మద్దతు ధరను అందిస్తామన్నారు. ఆశ, అంగన్వాడీలకు వేతనాలు రెట్టింపు చేస్తామని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. ప్రపంచంలో ఏ ప్రభుత్వమూ చేయని పనిని తాము చేయబోతున్నామని, ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళను ఎంపిక చేసుకొని ఆ కుటుంబంలో విద్యా వైద్యానికి ఆటంకం కలగకుండా వారి అకౌంట్‌లో లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తామని తెలిపారు. దేశంలో పేదరికం అనేదే ఉండకుండా తమ ప్రభుత్వం పనిచేయబోతుందని గుర్తు చేశారు. జూన్ 7వ తేదీన ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో మీ కోసం సైనికుడిగా పహారా కాస్తానని రాహుల్ గాంధీ ప్రజలకు హామీ ఇచ్చారు.





**దేశ చరిత్రలో మెదక్ జిల్లాకు ప్రాముఖ్యత : సీఎం రేవంత్‌రెడ్డి**

దేశ చరిత్రలో మెదక్ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మెదక్ పార్లమెంటు స్థానం నుంచి 1980లో మొట్ట మొదటిసారిగా ఇందిరాగాంధీ ఎంపీగా ఎన్నికై ప్రధానమంత్రి అయ్యారని గుర్తు చేశారు. మెదక్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పదేండ్ల పాలనలో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రాజెక్టుల పేరుతో పేద ప్రజల భూములను గుంజుకుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మెదక్ జిల్లాలో మొనగాడు దొరకలేదా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం రాముని పేరు మీద రాజకీయం చేస్తుందని దేవుడు గుడిలో ఉండాలని, భక్తి గుండెల్లో ఉండాలంటూ బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, హరీశ్‌రావుకు దిమ్మతిరిగేలా కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును లక్ష మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, ఏఐసీసీ నాయకులు కుసుంకుమార్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, చిలుముల మదన్‌రెడ్డి, జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# ఇజ్రాయిల్, అమెరికా రెండూ దోషులే!



ఆవతలివైపు ఈజిప్టు, ఇవతల వైపు పాలస్తీనా సరిహద్దులో రాఫా వద్ద ఉన్న నడవాను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయిల్ మిలిటరీ పాలస్తీనా వైపు ప్రాంతాన్ని ఒక అమెరికా కిరాయి సాయుధ సంస్థకు అప్పగించింది. వారికి అవసరమైనపుడు సాయం చేసేందుకు ఇజ్రాయిల్-అమెరికా-ఈజిప్టు మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ చర్య తమ భూభాగాన్ని దురాక్రమణ చేయటమేనని, అందువలన దురాక్రమణదారులను ఎదుర్కొనేందుకు సాయుధ దాడులతో సహా తమకు అన్ని హక్కులూ ఉన్నాయని పాలస్తీనా విముక్తికోసం పోరాడుతున్న పలు సంస్థలు బుధవారం నాడు స్పష్టం చేశాయి. మూడు దేశాల ఒప్పందం ఏ విధంగా చూసినా అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాల ఉల్లంఘన తప్ప మరొకటి కాదు. ఒక వైపు కాల్పుల విరమణ గురించి కైరోలో చర్చలకు సిద్ధమంటూనే గాజా పౌరులపై మారణకాండను మరింత తీవ్రం గావించేందుకు, ఆకలి, రోగాలతో మాడ్చి చంపేందుకు పూనుకున్న ఇజ్రాయిల్‌కు అమెరికా, ఇతర పశ్చిమదేశాలు పూర్తి మద్దతు ఇస్తున్నాయి. మధ్యవర్తిగా ఉన్న ఈజిప్టు కూడా పరోక్షంగా వంతపాడుతున్నది. ఇదంతా కొరకరాని కొయ్యగా ఉన్న హమాస్‌ను లొంగదీసుకొనేందుకు తప్ప మరొకటి కాదు.

మరోవైపు మానవత్వం, మానవహక్కుల గురించి ప్రపంచానికి సుద్దులు చెప్పే అమెరికా, పశ్చిమ దేశాలకు గాజాలో అల్లాడుతున్న జనం కనిపించటం లేదు. ఇజ్రాయిల్‌కు బాంబులు, ఇతర మారణాయుధాలను పంపటం తక్షణావసరంగా చెబుతున్నాయి. తమ చర్యలను సమర్థించుకొనేందుకు ఆడుతున్న నాటకాలెన్నో. రాఫాపై దాడులకు తాము వ్యతిరేకమంటూ అమెరికా ఉత్తుత్తి ప్రకటనలు చేసింది. తమ మాట వినలేదు గనుక పంపదలచిన బాంబుల అందచేత నిలిపివేసినట్లు మరోడ్రామాకు తెరతీసింది.


గాజా సరిహద్దులో ఉన్న ఇజ్రాయిల్ ప్రాంతంపై హమాస్ జరిపిన దాడిని సాకుగా చేసుకొని గతేడాది అక్టోబరు ఏడు నుంచి సాగిస్తున్న మారణకాండ నివారణలో ఐరాస ఘోరంగా విఫలమైంది. అమెరికా ఒత్తిడి కారణంగా ప్రపంచ న్యాయస్థానం కూడా చేతులెత్తేసింది. దక్షిణాఫ్రికా, నికరాగువా దాఖలు చేసిన కేసుల విచారణను సాగదీస్తున్నది. ఈ పూర్వరంగంలో తమనెవరూ అడ్డుకోలేరన్న తెగింపుతో దారుణాలను కానసాగించేందుకు పూనుకున్నారు. ఇది ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారితీస్తుందో అనూహ్యం. అనేక దేశాల మీద దురాక్రమణ, దాడులకు పూనుకున్నపుడు అమెరికన్ సైనికులు మరణిస్తే తలెత్తుతున్న స్వజన ఆగ్రహాన్ని తట్టుకోలేని అమెరికా పాలకులు ప్రపంచమంతటా అమెరికా మాజీ సైనికులు, ఇతరులతో కూడిన కిరాయి మూకలను రంగంలోకి దించుతున్నది. తమ చేతులకు మట్టి అంటకుండా అలాంటి కిరాయి సంస్థనే రాఫా క్రాస్‌లో కూడా నియమించి ఇజ్రాయిల్, అమెరికా ఇప్పుడు అదే చేస్తున్నాయి. రాఫా క్రాస్‌ను ఆక్రమించుకొనేందుకు, నగరంపై దాడి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకుంటూనే కైరో చర్చలను సాగదీశాయని స్పష్టమైంది. కాల్పుల విరమణ ప్రతిపాదన లకు అంగీకరిం చదనే అమెరికా అంచనాలను వమ్ము చేస్తూ హమాస్ అంగీకారం తెలిపింది. దాంతో ప్లేటు మార్చి దానిలో ఉన్న అంశాలు తామనుకున్నట్లుగా లేవని ఇజ్రాయిల్ పరక్షోంగా తిరస్కరించింది. కాల్పుల విరమణకు హమసే ఆటంకంగా ఉందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ముందుగానే ఆరోపించాడు. ఇజ్రాయిల్ దాడుల ప్రారంభం నుంచి నెపాన్ని హమాస్ మీద నెట్టేందుకే చూస్తున్నది. ఇజ్రాయిల్‌ను దోషిగా చూపుతూ ఐరాసలో ప్రవేశ పెడుతున్న తీర్మానాలన్నిం టినీ అమెరికా వ్యతిరేకిస్తున్నది, భద్రతామండలిలో వీటో చేస్తున్నది.

మరోవైపు మానవత్వం, మానవహక్కుల గురించి ప్రపంచానికి సుద్దులు చెప్పే అమెరికా, పశ్చిమ దేశాలకు గాజాలో అల్లాడుతున్న జనం కనిపించటం లేదు. ఇజ్రాయిల్‌కు బాంబులు, ఇతర మారణాయుధాలను పంపటం తక్షణావసరంగా చెబుతున్నాయి. తమ చర్యలను సమర్థించుకొనేందుకు ఆడుతున్న నాటకాలెన్నో. రాఫాపై దాడులకు తాము వ్యతిరేకమంటూ అమెరికా ఉత్తుత్తి ప్రకటనలు చేసింది. తమ మాట వినలేదు గనుక పంపదలచిన బాంబుల అందచేత నిలిపివేసినట్లు మరోడ్రామాకు తెరతీసింది. ఇదంతా ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకే అన్నది స్పష్టం. వాటిని దొడ్డిదారిన పంపదని కూడా చెప్పలేము. ఆ బాంబులు ఎంత పెద్దవంటే ఒక్కొక్కటి 900 కిలోలున్నవి 1,800లు, 225 కిలోల బరువున్నవి 1,700లు పంపాలని నిర్ణయించింది. వాటిని ప్రయోగించిన చోట భవనాలు నేలమట్టం, జనాల ప్రాణాలు గాలిలో కలసిపోతాయి. ఇప్పటికే అమెరికా నుంచి వచ్చిన బాంబులు యూదు దుర హంకారుల దగ్గర గుట్టలుగా పడి ఉన్నాయి. గాజాను సర్వనాశనం చేశాయి. నిజానికి కొత్త వాటి అవసరం లేదు. రాఫా నగరం, పరిసరాలపై దాడి జరిగితే అక్కడున్న ఆరులక్షల మంది పిల్లలతో సహా పన్నెండు లక్షల మంది నిస్సహాయ పౌరుల భవిష్యత్‌కు ముప్పు అని ఐరాస ప్రధాన కార్యదర్శితో సహా ఎందరు చెప్పినా వినకుండా ముందుకు పోతున్న దుష్టశక్తులు, వాటికి మద్దతు ఇస్తున్న సామ్రాజ్యవాదులను శాంతిశక్తులే అడ్డుకో గలవు, ఇప్పటికే అమెరికాలో విద్యార్థులు ఆ ప్రక్రియలో ముందున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచమంతా కదలాలి, మారణకాండను ఆపేందుకు పూనుకోవాలి.

# మోడీ ఆశలు అడియాశలవుతున్న వేళ...



జూలకంటి రంగారెడ్డి
9490098349




ఇపుడు జరుగుతున్న పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికలు భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో కీలక మైనవి. రాజ్యాంగ వ్యవస్థకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నవి. భారతీయ వ్యవస్థ విభిన్న మతాలు, కులాలతో పరిఢవిల్లుతున్నది. బీజేపీ నేడు మతం పేరుతో ప్రజలను వేరుచేసి చూస్తున్నది. ఈ దేశం లోని మైనారిటీలను దేశ ప్రజలుగానే భావించడం లేదని ప్రధాని వ్యాఖ్యలలో ప్రస్ఫుటమవుతున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటి బ్రిటీష్ వారి విభజించు, పాలించు విధానాన్ని కొనసాగిస్తున్నది. ఇపుడు జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోడీ గత పదేండ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు ఏమీలేక, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసం గాల్ని మొదలుపెట్టారు. ఇండియా కూటమిని గెలిపిస్తే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా హిందువుల ఆస్తులను, స్త్రీలపై ఉన్న పుస్తెలతో సహా ముస్లింలకు కట్టబెడతారని ఒక గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంతవరకు నిజమో ప్రజలే జాగ్రత్తగా ఆలోచించాలి. అంతేకాకుండా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోపై దాడిచేస్తూ, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం భారతదేశ ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి ఏమాత్రం తగనిది. దీనిని మెజార్టీ ప్రజానీకం హర్షించదు.

## అధికారమే పరమావధిగా...

అధికారమే పరమావధిగా బీజేపీ పరివారం ప్రయత్నిస్తున్న సంగతి దేశ ప్రజలకు అర్థమ వుతున్నది. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికలలో ఈ దేశానికి ఛాయ్‌వాలా వస్తే దేశంలో కోట్లాది మంది పేద ప్రజల పేదరికం రూపుమాపి పోతుందని, అందరూ లక్షాధికారులు కావచ్చని చెప్పిన కాకమ్మ కథలు నమ్మి మోసపోయినట్టు ప్రజలు గ్రహిస్తున్నారు. మొదటిసారి జరిగిన ఎన్నిక సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు మోడీ తుంగలో తొక్కారు. అధికారంలోకి వచ్చిన వందరోజులలో నల్లధనాన్ని బయటకుతీసి ప్రతీ కుటుంబానికి రూ.15 లక్షలు వారి ఖాతాలలో జమచేస్తామని ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ప్రతి యేటా రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు పోయే విధానాలు చేపట్టారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ వారికి అనుకూలమైన విధానాలు చేపడతామని ఏకపక్షంగా రైతు వ్యతిరేక నల్లచట్టాలు తీసుకొచ్చారు. వీటిని వెనక్కి తీసుకోవాలని జరిగిన పోరాటంలో సుమారు ఎనిమిది వందల మంది రైతులు బలైపోయారు. నేటికీ మద్దతు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతు ఉద్యమం కొనసాగుతున్నది.

## నిత్యం అంబానీ,అదానీ సేవలోనే

పొద్దున్న లేస్తే హిందువుల పక్షపాతి అని మాట్లాడే మోడీ, నూటికి 80శాతం పైగా దేశంలో ఉన్న హిందువులకు గత పదేండ్ల తన పాలనలో ఏ విధమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించపోగా, వారి సంపదను కొల్లగొట్టి అంబానీ, ఆదానీల వంటి బడా కార్పొరేట్ శక్తులకు దేశప్రజలదరిపై మోయలేని భారం వేశారు. నిత్యావసర ధరలు తగ్గిస్తామని చెప్పి తగ్గించకపోగా అడ్డూఅదుపూ లేని ధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో సామా న్యుల్ని మరింత ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టేసింది. కార్మికులకు మేలు చేస్తామంటూ కార్పొరేట్లకు మేలు చేసే చట్టాలు తెచ్చారు. 2019లో రెండవ దఫా జరిగిన ఎన్నికలలో పుల్వామా దాడిని చూపించి, హిందూ ముస్లింల భావోద్వేగాలను రెచ్చగొట్టారు. పాకిస్థాన్ మన దేశంపైకి దండెత్తి వస్తున్నదని, కాశ్మీర్‌ను, కైవసం చేసుకుంటుందని దేశాన్ని రక్షించుకోవలసిన అవసరం ఉందని, సైనికులకు అండగా నిలవాలని పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఆనాడు పుల్వామా ఘటనలతో ప్రజల్లో ఒక్కసారిగా భావోద్వేగాలను రెచ్చగొట్టి 300కు పైగా సీట్లను గెలుచుకొని అధికారాన్ని రెండవ దఫా చేజిక్కించు కున్నారు. పార్లమెంట్‌లో మందబలంతో అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను ఆమోదించుకున్నారు. ఇప్పుడు మూడో సారి ఎలాగైనా అధికారంలోకి రావడం కోసం ఎత్తులకుపై ఎత్తులు వేస్తునన్నారు.

## అప్రకటిత ఎమర్జెన్సీ

ఎలాగైనా మరోసారి గద్దెనెక్కాలని దేశ ప్రజలను, సమైక్యతను, లౌకికవాదాన్ని సౌభ్రాతృత్వాన్ని విధ్వంసం చేసే పథకాన్ని రచిస్తున్నారు. అందులో భాగంగానే అయోధ్యలోని బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం హడావుడిగా చేపట్టారు. దేశసమైక్యతకు, సమగ్రతకు భంగం కలిగించే విధానాల అమ లుకు పూనుకున్నారు. తమ మనువాద సిద్ధాంతాలను ప్రజల్లో తీసుకెళ్లి సమైక్యంగా జీవిస్తున్న ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతచిచ్చును రగిలిస్తున్నారు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని నిఘావ్యవస్థలను తమ చెప్పుచేతుల్లోకి తీసుకొని వాటిని దుర్వినియోగపరుస్తున్నారు. బీజేపీకి వ్యతి రేకంగా ఉన్న ప్రతిపక్షాలపె, వారిని విభేదించే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తూ, భయభ్రా ంతులకు గురిచేస్తున్నారు. ప్రజాపౌర హక్కులను ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు. ఎన్నికల ముందు అవినీతికి పాల్పడ్డారనే నెపంతో ఇద్దరు ముఖ్యమంత్రులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. వారినే కాకుండా ఇంకా అనేక మంది ప్రతిపక్ష నాయకులపై, పాత్రికేయులపై, ప్రజాస్వామ్యవాదులపై తప్పుడు కేసులు పెట్టి జైలులో నిర్బంధించారు. దేశంలో నేడు గమనిస్తే దేశవ్యాప్తంగా అప్రకటిత ఎమ ర్జెన్సీ కొనసాగుతున్నది. 1975 నాటి అత్యవసర పరిస్థితిని మించి తలపిస్తున్నది.

ఎలాగైనా మరోసారి గద్దెనెక్కాలని దేశ ప్రజలను, సమైక్యతను, లౌకికవాదాన్ని సౌభ్రాతృత్వాన్ని విధ్వంసం చేసే పథకాన్ని రచిస్తున్నారు. అందులో భాగంగానే అయోధ్యలోని బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం హడావుడిగా చేపట్టారు. దేశసమైక్యతకు, సమగ్రతకు భంగం కలిగించే విధానాల అమ లుకు పూనుకున్నారు. తమ మనువాద సిద్ధాంతాలను ప్రజల్లో తీసుకెళ్లి సమైక్యంగా జీవిస్తున్న ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతచిచ్చును రగిలిస్తున్నారు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని నిఘావ్యవస్థలను తమ చెప్పుచేతుల్లోకి తీసుకొని వాటిని దుర్వినియోగపరుస్తున్నారు.

## రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే రక్షణ

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా దేశ మంతా ఒకే నినాదం, ఒకే గొంతుక వినిపించింది. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటాం! హక్కులను కాపాడుకుంటాం! అంబేద్కర్ ఆశయాల పట్ల పునరంకితులమవుతాం. మహాత్మా జ్యోతిరావుఫూలే స్ఫూర్తిని కొనసాగిస్తాం! అనే నినాదాలు దిక్కులు పిక్కటిల్లే విధంగా మారుమోగాయి. గతంలో ఏనాడు రాజ్యాంగాన్ని పరిరక్షించు కుంటామనే నినాదం ఇంతగా ముందుకు రాలేదు. దానికి కారణం బీజేపీ పాలనలో రాజ్యాంగం ధ్వంసమవ్వడం. అందుకే ప్రస్తుత వర్తమాన కాలంలో రాజ్యాం గాన్ని రక్షించుకోవాలనే ఈ నినాదం బలంగా ముందుకు వస్తున్నది. పార్లమెంటుకు ముసాయిదాను అందించే ముందు భవిష్యత్‌ను దర్శనం చేస్తూ ఆనాడు అంబేద్కర్ ఒకమాట అన్నారు. రాజకీయ సమానత్వం హక్కును రాజ్యాంగపరంగా ఓటుహక్కు ద్వారా కల్పించిన ఇది రాజకీయ సమానత్వాన్ని అందిస్తున్నది తప్ప సమాజంలో ఆర్థిక, సామాజిక, అసమానతలను తక్షణం నిర్మూలించే మంత్ర దండం కాదన్నారు. రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చే పాలకులు అనుసరించే విధానాలను బట్టి ప్రజల మధ్య ఉన్న అసమానతలు దూరమవుతాయన్నారు. అంబేద్కర్ ఇలాంటి ప్రమాదాన్ని ఊహించి ఒక మాట అంటారు. "నాశరీరం మరణించినా భారత రాజ్యాంగం రూపంలో నేను సజీవంగానే ఉంటాను. రాజ్యాంగాన్ని సమూలంగా హత్య చేసిన రోజు నేను మరణిస్తారు". అంటాడు. ఆయన ఏ సందర్భంలో అన్నాడో గానీ ఇప్పుడది చర్చగా మారింది. మరో సందర్భంలో ఆయన మరోమాట అన్నారు. 'ఆ దేశంలో నోరులేని మేకల్ని బలిస్తారు. కానీ పులులను బలివ్వరు! కాబట్టి పులిలా బతకండి' అని ఒక సందేశ మిచ్చారు. ఇప్పు డు పులిలా బతకాల్సిన సమయం ఆసన్నమైంది.

ఇప్పటివరకు మూడు విడతలుగా జరిగిన పోలింగ్‌లో బీజేపీ ఆశించిన విధంగా తమ పార్టీకి ప్రజలు ఓట్లు వేయలేదనే అనుమానంతో మోడీ, అమిత్‌షా, నడ్డా బరితెగించి మరింత రెచ్చగొట్టే ప్రసం గాలను మొదలు పెట్టారు. అధికారంపై ఆశలు పెట్టుకున్న బీజేపీ ఆశలు, అడియాశలవుతున్న సంద ర్భంగా ఎంతకైనా తెగించి మాట్లాడుతున్నారు. మే చివరి వరకు వివిధ దశలలో జరిగే ఎన్నికలలో ప్రజలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎటువంటి మత విద్వేషాలకు లోను కాకుండా ప్రజల సమైక్యతను, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం 140 కోట్ల ప్రజానీకంపై ఉన్నది. అందుకు మెలకువతో మన రాజ్యాంగాన్ని హక్కులను కాపాడుకోటానికి ప్రజలందరూ చైతన్య యుతంగా ఆలోచించాల్సిన తరుణమిది.

## 'ఇండియా'కూటమినే మార్గం

రాజ్యాంగం ద్వారానే భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కులు కల్పించబడ్డాయి. రాజ్యాంగమే సమూలంగా మార్పుచెందిన నాడు, మౌలిక స్వరూపం మారిన నాడు ఈ హక్కులన్నీ హరించుకుపోతే పోరాడేశక్తి కూడా ఉండదన్న సత్యాన్ని ప్రజలు గ్రహించాలి. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మారుస్తామంటున్నది బీజేపీ. రాజ్యాంగంలోని హక్కులకే కాదు బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజన కరమైన రిజర్వేషన్ల రద్దునకు కుట్రలు చేస్తున్నది. భారత రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలు గోల్వార్ మొదలుకొని అనేకమంది స్వయంసేవకుల ఆలోచనలను అమలుపరిచే క్రమంలో నేడు బీజేపీ పరివారం ఉవ్విళ్లూరుతున్నది. పాలకుల విధానాలను కుల పరంగాను, మతపరంగాను ఎదుర్కోవడం కాదు సమిష్టిగా వర్గపరంగా ఎదుర్కోవాల్సినటు వంటి పరిస్థితి నేడు కనిపిస్తున్నది.

ఇప్పటివరకు మూడు విడతలుగా జరిగిన పోలింగ్‌లో బీజేపీ ఆశించిన విధంగా తమ పార్టీకి ప్రజలు ఓట్లు వేయలేదనే అనుమానంతో మోడీ, అమిత్‌షా, నడ్డా బరితెగించి మరింత రెచ్చ గొట్టే ప్రసంగాలను మొదలుపెట్టారు. అధికారంపై ఆశలు పెట్టుకున్న బీజేపీ ఆశలు, అడియాశలవుతున్న సంద ర్భంగా ఎంతకైనా తెగించి మాట్లాడుతున్నారు. మే చివరి వరకు వివిధ దశలలో జరిగే ఎన్నికలలో ప్రజలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎటువంటి మత విద్వేషాలకు లోను కాకుండా ప్రజల సమైక్యతను, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం 140 కోట్ల ప్రజానీకంపై ఉన్నది. అందుకు మెలకువతో మన రాజ్యాంగాన్ని హక్కులను కాపాడుకోటానికి ప్రజలందరూ చైతన్య యుతంగా ఆలోచించాల్సిన తరుణమిది. బీజేపీ, మోడీ మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి 'ఇండియా' కూటమికి అన్ని విధాలుగా మద్దతివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ■

## ఎలక్షన్ రిపోర్ట్!

రాజకీయ పొగమంచులో
అంతా అస్పష్టంగా ఉంది.
రాజ్యం, మతం భుజాల మీద తుపాకి పెట్టి,
సామాన్యుల్ని కాల్చేస్తూఉంది!.
సామాన్యులు మరో స్వాతంత్ర్య
సమరంలోకి దూకారు-
యువత రాజ్యాంగాన్ని
తమ గుండెల్లో దాచుకుని,
నిరసనే-నిజమైన దేశభక్తని చాటుతోంది
కళ్లూ, ముక్కూ, చెవులు ఉన్నవారెవరూ
దేశం స్థితిగతుల్ని తెలుసుకోకుండా ఉండరు-
పాలకుల అబద్ధాల తూటాలకు జనం
సుడులు తిరిగి పడిపోతున్నారు - అయినా,
లేచి, ఊపిర్లను నినాదాలుగా చేస్తున్నారు
ఈ ప్రభుత్వం కోతలదే తప్ప,
చేతలది కాదని తీర్మానించారు.
సమైక్యత కోసం విద్యార్థుల శాంతి ప్రదర్శనలు
ప్రశాంతమైన సముద్రాల్ని తలపిస్తున్నాయి
ప్రతీకార నిరంకుశ చర్యల్ని సైతం,
తమలో ఇముడ్చుకుని గంభీరమౌతున్నాయి-
జనం ఎండలకు కాదు,
పౌరసత్వ చట్టానికి రగిలిపోతున్నారు
అవివేకపు చట్టాలు కాలిపోతున్నట్టు,
దేశమంతా మండిపోతోంది.
అణిచివేసే అధికార బలమెపుడూ
ప్రజాబలం ముందు దిగదుడుపే-
చరిత్రలో ఫెయిల్
అయిన వారు గ్రహించుకోలేరు-
ఈ దేశ పౌరులకు పౌరసత్వమే
లేకపోతే - వీరు పాలకులెలా అయ్యేవారూ?
జ్ఞానవనేది తర్వాత, ముందు కాస్త
ఇంగిత మనేది ఉండాలి కదా?
పాలకులే ముందు తమ పౌరసత్వం
నిరూపించుకోవాలి!
పాలకులే ముందు తమ డిగ్రీలు
చూపించుకోవాలి!!
చదువుకున్న వారెవరూ విశ్వవిద్యాలయాల్ని
ధ్వంసం చేయరు?
నా దేశంలో మనుషులంతా బతికే ఉన్నారు-
మూఢత్వాన్ని ఛేదించుకుని,
మనుషులంతా ఒక్కటేనంటున్నారు!
దేశంలో విభజనల్ని,
పాలకుల కుట్రల్ని దుయ్యబడుతున్నారు!!
సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తున్నారు.
కాలాన్ని పదేండ్లు వెనక్కి నెట్టి-మళ్ళీ...
కొత్త ఊపిర్లు పీల్చుకుందామంటున్నారు.

- డాక్టర్ దేవరాజు మహారాజు

# హిందూ మతమనేదే లేదు, ఉన్నది బ్రాహ్మణవాదమే!



డాక్టర్ దేవరాజు
మహారాజు



**ఆలోచన, ముఖ్యంగా స్వంత ఆలోచన ఒక విప్లవాత్మకమైన గుణం. అంతేకాదు, తప్పనిసరిగా ఉండాల్సిన గుణం నేను ఒక మానవుణ్ణి మానవుడే కేంద్రంగా మానవత్వం కోసమే పని చేస్తాను.**

**-షహీద్ భగత్‌సింగ్**

ఒక దర్జీ చొక్కా కుట్టడానికి ఒక కొత్త కత్తెర తెచ్చుకున్నాడు. కొత్త గుడ్డను కావల్సిన రీతిలో ముక్కలు కత్తిరించాడు. కత్తెరను కాళ్ళ దగ్గర పెట్టుకుని, సూదితో గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టడం ప్రారంభించాడు టైలర్.

కూతురు వచ్చి అడిగింది- "నాన్నా కత్తెర కొత్తది కదా! దాన్ని అలా కాళ్ళ దగ్గర పడేశావు విలువ లేని ఆ పాత సూదిని మాత్రం తల మీద తలపాగాకు గుచ్చుకున్నావు"- అని అడిగింది. దర్జీ లోలోన నవ్వుకున్నాడు-

"నిజమేనమ్మా! కత్తెర కొత్తదే కానీ అది గుడ్డను ముక్కలు చేసింది. ఆ గుడ్డ ముక్కలకు విలువ లేదు. పాతదైనా సరే, ఖరీదైంది కాకపోయినా సరే-సూది ఏం చేసింది. ఆ గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టి ఒక మంచి చొక్కా తయారు చేసింది. అప్పుడే కదా చొక్కాకు విలువ పెరిగేదీ? చొక్కా కుట్టకముందు గుడ్డ ముక్కలకు విలువలేదు. వస్తువు కొత్తదా? పాతదా? అని కాదు.-అది చేసే పనిని బట్టి మనం దాన్ని ఉపయోగించు కోవాలి! కత్తెర ఎక్కడ వేసినా ఉంటుంది. గుడ్డ ముక్కల్ని కలిపికుట్టే సూదిని ఎక్కడ బడితే అక్కడ పడేయలేం-దాని విలువ ఎక్కువ. అది సున్నితం, అపురూపం. జాగ్రత్తగా చూసుకోవాలి కదమ్మా- అందుకే దాన్ని నా తలమీద జాగ్రత్తగా తలపాగాకు గుచ్చుకుని భద్రపరుచుకుంటాను. అయినా- ఇది చెప్పు? పరపరమని కోసి విడదీసేది గొప్పదా? లేక విడిపోయిన గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టేది గొప్పదా?" అని ప్రశ్నిస్తూ ప్రేమగా కూతురు కండ్లలోకి చూశాడు-దర్జీ.

"కలిసి కుట్టేదే నాన్నా" - అంది కూతురు మెరిసే కండ్లతో-

"సమాజంలో కూడా కొందరు-మనుషుల్ని విభజించి పైశాచికానందం పొందుతుంటారు. ఈ దేశ పౌరులమైన మనం చాలా చిన్న వాళ్ళమే కావొచ్చు-అయినా కూడా మనుషుల మధ్య సౌహార్దాన్ని పెంపొందించి కలుపుకు పోవాల్సిన వాళ్ళం. అందరం సమైక్యంగా ఉంటేనే దేశం విలువ పెరిగేది" అన్నాడు తండ్రి, సూదిని తలపాగకు గుచ్చుకుంటూ.

"మనం చిన్నవాళ్ళమే గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టే సూదీ చిన్నదే-అయితే మాత్రమేం? చేస్తున్నది గొప్పపని కదా నాన్నా!"

"అవున్రా తల్లీ బాగా చెప్పావ్! భారత్ జోడో అంటూ ఆ సేతు హిమాచలం కాలినడకన వెళు తూ జనాన్ని కలుపుకు పోయేవారూ-న్యాయయాత్ర పేరుతో అణగారిన వర్గాలకు న్యాయం కావాలని కోరుకునే వారు కావాలా? లేక మతం గుళ్లు, విగ్రహాలు, ప్రాణప్రతిష్ఠ అంటూ పరిపాలనను గాలికి వదిలేసేవారు కావాలా?"

"ఓ నాన్నా! నాకు దేశ రాజకీయాలన్నీ సులభంగా అర్థమవు తున్నాయి. రామాలయ నిర్మాణం పేరుతో అయోధ్యలో వేలవేల ఇండ్లూ, దుకాణాలు. పురాతన కట్టడాలు అన్నింటికి అన్నీ ధ్వంసం చేశారు. దౌర్జన్యంగా జనాన్ని నిరాశ్రయుల్ని చేశారు. వారిని ఆదుకోకుండా గాలికి వదిలేస్తే ఎలా? పాపం!"

"దేశ ప్రధాని తాను హిందూ దేశానికి రాజు నయ్యాననీ, తనకిక తిరుగు లేదనీ భావిస్తున్నాడు"

"ఆ... - జనం తలుచుకుంటే క్షణం పట్టదు-మట్టి కరిపించడానికి! జనమంటే తనలాగా చదువు లేని వారు, వివేకం లేని వారు అని అనుకుంటున్నాడేమో-" అంది కూతురు సీరియస్‌గా.

"అయ్య బాబోయ్ - ఏమో అనుకున్న నీకు చాలా విషయాలు తెలుసే తల్లీ".

"తెలుసు నాన్నా! పుస్తకాలు చదివి చాలా విసయాలు తెలుసుకుంటున్నా- హిందూ హిందూ అని చచ్చే ఈ కాషాయ మూకలు విషయాలు తెలుసుకోరు. 12వ శతాబ్దం దాకా దేశంలో మన వారికి 'హిందూ' అనే మాటే తెలియదట నాన్నా-ఎక్కడో చదివాను పర్షియా వాళ్లు మన దేశానికి సింధూ నది దాటి వచ్చారట. వారు సింధూ అని పలక లేక హిందూనది దాటి వచ్చాం అని చెప్పుకున్నారు. హిందూ నదికి ఆవల ఉన్న వాళ్ల హిందువులు అని అన్నారు. అప్పుడు అది మతానికి సంబంధించిన పదమే కాదు".

దేశ కాల పరిస్థితుల్ని గమనించి బాలివుడ్ గీత రచయిత హేతువాది జావేద్ అఖ్తర్ అంటారు. "ఏక్ హమారీ, ఔర్ ఏక్ ఉన్ కీ / ముల్క్ మేహై ఆవాజ్ దో (ఒకటి మాది మరొకటి వారిది/ దేశంలో గొంతులు రెండు) హం కహతే హై ఇన్సానోమే ఇన్సానోస ప్యార్ రహే/ ఓ కహతే హై హాతోమె త్రిశూల్ రహే తల్వార్ రహే (మేమంటాం మనుషుల్లో మనుషుల్లాంటి ప్రేముండాలని!/ వారంటారు చేతుల్లో త్రిశూలమో, ఖడ్గమో ఉండాలని) హం కహతేహై బేఘర్ బేదర్ లోగోంకో ఆబాదీ కరో/ ఓ కహతే హై భూలే బిస్రే మందిర్ మజ్జిద్, రామ్ సేతూకోయాద్ కరో (మేమంటాం ఇల్లూ వాకిలీ లేని దీనుల్ని ఆదుకోండని/ వారంటారు మరిచిపోయిన మందిర్ మసీదు రామసేతులను గుర్తు చేసుకోండని) కేవలం నాలుగు కవితా పంక్తుల్లో జావేద్ అఖ్తర్ దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో వివరించారు.

"అవునమ్మా నిజమే నాకు ఓ మాస్టారు గారు చెప్పారు. దేవుణ్ణి మతాన్నీ కలిసి రాజకీయం చేస్తున్న వారిని వదిలి పెట్టగూడదు. బుద్ధి చెప్పాల్సిందే. పౌరులుగా రాజ్యాంగబద్ధంగా మనం చేయాల్సింది మనం చేస్తూ ఉండాల్సిందే-"

"కత్తెర్లు ముక్కలు చేస్తుంటే మనం కలిసి కుట్టుకుంటూ ఉండాల్సిందే-అంతేకదు నాన్నా"- అంటూ పెద్దగా నవ్వింది కూతురు. ఆమె నవ్వులో నవ్వు కలిపాడు తండ్రి సూదీ దారం పైకెత్తి - ఆ తండ్రి కూతుర్ల సంభాషణని అలా ఉండనిచ్చి. మనం మరో ముఖ్యమైన విషయంలోకి వెళదాం!

సైన్సును నమ్మడం కూడా ఒక మతమే! హేతువాదం కూడా ఒక మాతమే అని అనే వారున్నారు. అలాంటి వారిని ఒప్పించాలని ప్రయత్నించడం కూడా వృథా! కాస్త ఇంగిత జ్ఞానం ఉన్న వాడికి ఇంకొన్ని విషయాలు అర్థం చేయించి ఆలోచించమని చెప్పొచ్చు. అసలు మొత్తానికి మొత్తంగా మెదడే మూసుకున్న వారిని ఏం చేయగలం? మానసిక వికలాంగులుగా పరిగణించాలి. కారణం ఏమంటే, హేతువాదానికీ, సైన్సుకు మతగ్రంథాలు లేవు. లేని ఆ పవిత్ర గ్రంథాల్లోంచి విషయాలు తీసి, ప్రవచించే వారు లేరు. తమకు తామే ఏదో ఓ మతానికి పేటెంట్ హక్కులు సాధించినట్టు -పిచ్చి వాగుడు వాగే బాబాలు, స్వాములు, ప్రవచనకారులు, లేదా ఆరెస్సెస్ వంటి సంస్థలకు పుట్టిన రాజకీయ నాయకులు ఎవరూ లేరు. మత బుల్‌డోజర్లు వేసుకుని తిరిగే యోగుల, బైరాగుల భరతం పట్టడమే సైన్సు కార్యకర్తలు, హేతువాతులు ప్రశ్నను బతికించుకుంటున్న రచయితలూ చేస్తుంటారు. మరి వీరిది కూడా ఓ మతమే - అని అనే వారికి బుద్ధీ జ్ఞానం లేదని అనుకోవాలి!

సృష్టి ఆదిలో భగవంతుడే వచ్చి హేతువాదులకు, శాస్త్రవేత్తలకు ఏవైనా గ్రంథాలు ఇచ్చి వెళ్ళాడా?- అంటే లేదు కదా? పూజలు, హారతులు, భజనలు, ప్రేయర్లు, నమాజులు, ఉపవాసాలు, ముడుపులు, మొక్కులు, ఏవంటే ఏవీలేవు కదా? ఊరికే అవీ మతాలే అని నోరు పారేసుకుంటే అయిపోతుందా? ఎలా మతాలయ్యాయో చెప్పాలి కదా? హేతువాదులైనా, వైజ్ఞానికులైనా విశ్వాసం లోంచే ముందుకు పోతారు. ఆ విశ్వాసం రుజువులతో పెరిగే ఆత్మవిశ్వాసం! ఒక అవివేకి సంప్రదాయ వాదిగా మనగలుగుతాడేమో గాని వివేకవంతుడు మనలేడు. పైగా అతను వైజ్ఞానికుడో, హేతువాదో తప్పక అవుతాడు. జవాబులు బట్టీయం వేసి పరీక్షలో మార్కులు సంపాదించిన వాడు జ్ఞానవంతుడు అవుతాడన్న నమ్మకం లేదు. విషయం అర్థం చేసుకుని, కొత్త ప్రశ్నలు లేవనెత్తే వాడే జ్ఞాని! అందువల్ల పరిజ్ఞానం వేరు వివేకం వేరు.ఏదో కొద్ది పాటి పరిజ్ఞానం సంపాదించి, దానితో మనుగడ సాగించే వాడికన్నా నిరంతర అధ్యయనంలో వివేచనతో కొత్తగా ఆలోచిస్తూ, కొత్తగా ప్రశ్నించే వాడే మనకు అవసరం! సమాజానికి అవసరం. ప్రపంచానికి అవసరం. ప్రపంచం 21వ శతాబ్దంలోకి వచ్చింది. ఇలాంటివారితోనే-తెల్లవారు జామునే లేచి, వేదాలు, ఉపనిషత్తులు, ఖురాను, బైబిల్ వల్లె వేసిన వారితో సమాజం ఇక్కడి దాకా రాలేదు- ఈ ఒక్క విషయం గమనిస్తే చాలు!

దేశ కాల పరిస్థితుల్ని గమనించి బాలివుడ్ గీత రచయిత హేతువాది జావేద్ అఖ్తర్ అంటారు. "ఏక్ హమారీ, ఔర్ ఏక్ ఉన్ కీ / ముల్క్ మేహై ఆవాజ్ దో (ఒకటి మాది మరొకటి వారిది/ దేశంలో గొంతులు రెండు) హం కహతే హై ఇన్సానోమే ఇన్సానోస ప్యార్ రహే/ ఓ కహతే హై హాతోమె త్రిశూల్ రహే తల్వార్ రహే (మేమంటాం మనుషుల్లో మనుషుల్లాంటి ప్రేముండాలని!/ వారంటారు చేతుల్లో త్రిశూలమో, ఖడ్గమో ఉండాలని) హం కహతేహై బేఘర్ బేదర్ లోగోంకో ఆబాదీ కరో/ ఓ కహతే హై భూలే బిస్రే మందిర్ మజ్జిద్, రామ్ సేతూకోయాద్ కరో (మేమంటాం ఇల్లూ వాకిలీ లేని దీనుల్ని ఆదుకోండని/ వారంటారు మరిచిపోయిన మందిర్ మసీదు రామసేతులను గుర్తు చేసుకోండని) కేవలం నాలుగు కవితా పంక్తుల్లో జావేద్ అఖ్తర్ దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో వివరించారు. ఇక మన సనాతన మనువాదులు చెప్పే విషయాలు ఎలా ఉంటాయో చూడండి. "భూమి శేషనాగుపై ఉంది. శేషనాగు సముద్రంలో ఉన్నాడు. సముద్రం భూమిపై ఉంది." ఇలాంటి తలతిక్క రాతలు చదివితే మనకు ఏ మనిపిస్తుందీ? 'ఎవడ్రా ఈ స్క్రిప్టు రాసిందీ? ఏం రాస్తున్నామన్నది చూసుకో పని లేదా? అని ఒళ్లు మండుతుందా మండదా? మతం మత్తు మందు లాంటిదని అన్నది అందుకేనేమో - మత్తెక్కితే ఏం ఉందీ? ఒళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తారు కదా?

మహాభారతం గొప్ప కావ్యం కదా? అందులో జరిగింది ధర్మయుద్ధమా? కృష్ణుడు ఏం చేశాడో ఆలోచించండి! తన సైన్యాన్ని మొత్తం దుర్యోధనుడికి ఇచ్చి, తను ఒంటరిగా అర్జునుడికి రథసారధి అయ్యాడు. అంటే ఏమిటీ? అర్జునుడితో తన సైన్యాన్ని తనే దగ్గరుండి చంపించాడన్నమాట! ఇలాంటి తలతిక్క నిర్ణయాలే తర్వాత తరాల మీద ప్రభావం చూపాయి. ఇలాంటి విషయాల్ని ఆదర్శంగా తీసుకోవడం వల్లే. దేశం బానిసత్వంలోకి పోయింది. మొఘలులు గత జన్మలో బ్రాహ్మణులని అబద్ధపు రాతలు రాసి ప్రచారం చేశారు కదా? అన్యాయంగా దేశప్రజల్ని విడదీయడం కోసం. వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం కోసం ఎన్ని తప్పుడు రాతలైనా రాస్తూపోయారు. ఈ దేశ ప్రజల్ని సంఘటిత పరుస్తూ సమైక్యంగా ఉంచే మాటలు, రాతలు ఏ మతగ్రంథంలోనైనా ఉన్నాయా? లేవన్నది గ్రహించాలి! మరి ఆ పని వేటివల్ల జరుగుతోంది? సైన్సువల్ల జరుగుతోంది. మానవ జాతి అంతా ఒకటే అని నిరూపించిన జన్యు శాస్త్రంవల్ల జరుగుతోంది. ప్రతిదాన్నీ తర్కబద్ధంగా ఆలోచించమని చెపుతున్న హేతువాదం వల్ల జరుగుతోంది. ఈ దేశ ప్రజలు-పూజారులను కాకుండా పరిపాలన మీద ధ్యాస పెట్టే విద్యావంతులైన దేశ నాయకుల్ని, నిజాయితీపరుల్ని ఎన్నుకుంటే బాగుపడతారు.

-సుప్రసిద్ధ సాహితీ వేత్త,
జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి) ■

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శుక్రవారం | మే 10, 2024 | www.navatelangana.com




## వంద రోజుల్లోనే హామీలు నెరవేరాయ్

- కాంగ్రెస్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం
- గడప గడపకూ ప్రచారం
- రఘురాంరెడ్డిని గెలిపించాలి

**నవతెలంగాణ-సత్తుపల్లి**

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే హామీలను నెరవేర్చిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మసీదు రోడ్డు, నేతాజీ రోడ్డు, రాజబాపయ్య వీధి, ప్రకాశం పంతులు రోడ్డు ప్రాంతాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి సతీమణి శ్రీలక్ష్మిని వెంట తీసుకొని పైన తెలిపిన ప్రాంతాల్లో గడప గడపకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ దేశానికి రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి గెలిపించడానికి హస్తం గుర్తుపై ఓటెయ్యాలని కరపత్రాలు పంచుకుంటూ ప్రచారం నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా సత్తుపల్లిని మరింతంగా అభివృద్ధి చేసుకొనే అవకాశం ఉందన్నారు. రఘురామిరెడ్డిని అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకొని ఢిల్లీ పంపిద్దామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, మందపాటి ముత్తారెడ్డి, తోట గణేశ్, చిన్నంశెట్టి సూరిబాబు, రామిశెట్టి సత్యనారాయణ, గోలి ఉషారాణి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ పద్మజ్యోతి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

**ముదిగొండ :** ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పమ్మి, చిరుమర్రి, కమలాపురం, వల్లభి, ముదిగొండ, పెద్దమండవ, వెంకటాపురం తదితర గ్రామాల్లో డోర్ పోస్టర్లతో, ఇంటింటికి విస్తృత ప్రచారం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు దేవరపల్లి ఆదినారాయణరెడ్డి, ఏలూరి హనుమంతరావు, వడ్డె శ్రీనివాసరావు, కోడె నాగేశ్వరరావు, మందరపు ఉపేందరరావు, ఎస్కే సొందుసాహెబ్, చిన్నపంగు శివ, రాయబారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**బోనకల్:** ఇండియా కూటమి అభ్యర్థి ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బోనకల్ గ్రామంలో గురువారం సిపిఎం సిపిఐ నాయకులు కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రామసహాయం రఘు రాంరెడ్డి ఎన్నికల గుర్తు అయిన హస్తం గుర్తుపై మీ పవిత్రమైన ఓటు వేసి గెలిపించాలని డోర్ క్యాంపియన్ నిర్వహించారు. తెల్లాకుల శ్రీనివాసరావు గూగుల్ లోతు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి రఘురామరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, బండి వెంకటేశ్వర్లు, అంతోటి వెంకటేశ్వర్లు, యార్లగడ్డ కృష్ణయ్య, గంగుల గోపి, భూక్య బాలకృష్ణ, సిపిఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ భూక్య జాలు, మాజీ వార్డు నెంబర్ ఉప్పర శ్రీను, కాంగ్రెస్ నాయకులు గాలి శ్రీను, గాలి రాముడు, కోసిరి కష్ణయ్య, గుగులోతు చందు, గోంగూర వెంకటి, యార్లగడ్డ శ్రీను, తోటపల్లి స్వామి, రావుట్ల రామాచారి తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు:** జిల్లా సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కార్నర్ మీటింగ్ వక్తలు కోరారు. గురువారం మండల పరిధిలో చెన్నూరు గ్రామంలో రఘురామ్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా.రాగమయి, కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్‌బాబు, మట్టా దయానంద్, మద్దినేని.బేబీ స్వర్ణకుమారి, సీపీఐ(ఎం) నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు మాదాల గోపాల్ రావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నుండి 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక**

కల్లూరు పట్టణ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన 50 బీఆర్ఎస్ కుటుంబాలు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, పొంగులేటి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

**రఘురాంరెడ్డిని గెలిపించాలి**

**నవతెలంగాణ-ముదిగొండ**

జిల్లా సమగ్ర అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. కురమ యాదవుల సంఘం సమావేశం ముదిగొండలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యాదవులను గొర్రెల సంఘాలుగా గుర్తించి, ఫెడరేషన్ ఏర్పాటు చేసి, ఎన్సిడిసి స్కీం ద్వారా రుణాలు మంజూరు చేసి ప్రతి గొర్రెకు బీమా సౌకర్యం కల్పించి, యాదవుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పాటుపడిందన్నారు. ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి గెలుపుకు కృషి చేయాలన్నారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ బిజెపి గెలిస్తే భారతదేశం పెను ప్రమాదంలో పడుతుందన్నారు. టీజేపీని, బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పోతురాజు పురుషోత్తం, వాకదాని కన్నయ్య, కొట్టే శ్రీనివాసరావు, మీగడ శ్రీనివాసరావు, కంచగట్టు రవి, కాంచాని రవి, కాంచాని అచ్చయ్య బట్టు రాజు, అమరబోయిన నరేష్, అమరబోయిన చంద్రయ్య, చెన్ను అంజయ్య, చిలకల రామకృష్ణ, చిర్రా లింగయ్య పాల్గొన్నారు.

**వైరాటౌన్ :** వైరా మండలం గన్నవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 100 కుటుంబాలు జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గన్నవరం ఎంపీటీసీ ఎర్రమల సౌజన్య, ఎర్రమల రవీందర్ రెడ్డి, శీలం కృష్ణారెడ్డి, శీలం వెంకటరామిరెడ్డి, కోరే కృష్ణ, కోరే సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కోరే వెంకటేశ్వర్లు, ఎస్‌కే మీరా, బలవంతం కష్ణ కండవలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, టౌన్ అధ్యక్షులు సీతారాములు, నాయకులు దాసరి దానియేలు, కట్ల రంగారావు, దొడ్డ పుల్లయ్య పమ్మి అశోక్, పాదిలి హరినాథ్, బోళ్ల గంగారావు, గుగులోతు రాము మట్టూరి కష్ణరావు, శీలం వెంకటరామిరెడ్డి, దర్జీ చెన్నారావు, కట్ల సంతోష్, కట్ల నాగరాజు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌కు రాజుపేట ఎంపీటీసీ గుడ్‌బై**

**కూసుమంచి :** మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, రాజుపేట ఎంపీటీసీ మోదుగు వీరభద్రం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవలే కందాళ ఉపేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులైనా ఎంపీపీ బానోతు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మారెడ్డి, ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా గురువారం రాజుపేట గ్రామ ఉపసర్పంచ్ ఉప్పల వీరభద్రం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, సిడిసి మాజీ చైర్మన్ జూకూరు గోపాలరావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, బజ్జూరు వెంకటరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చాట్ల పరశురాం తదితరులు పాల్గొన్నారు.



## చెరువుల పూడికతీత పనులు పరిశీలన

**నవతెలంగాణ-కొణిజర్ల**



రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్ షఫీ ఉల్లా గురువారం జిల్లా పర్యటనలో భాగంగా ఉపాధి హామీ పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. మండల పరిధిలోని చిన్నగోపతి, పెద్ద మునగాల గ్రామపంచాయితీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న చెరువుల పూడికతీత పనులను పర్యవేక్షించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్డీఓ ఆర్.సన్యాసయ్య, అదనపు డిఆర్డీఓ (ఇజిఎస్) బి.శిరిష, ఏపిడి సిహెచ్.శ్రీనివాసరావు, ఎంపిడివోలు, ఎంపిఓలు, ఇజియస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద బీజేపీని గద్దెదించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**



దేశ ప్రజలను కుల, మత, ప్రాంత ప్రాతిపదికన విభజిస్తున్న మతోన్మాద బిజెపిని గద్దె దించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. సీపీఐ, సీపీఐ(ఎం) బలపరిచిన ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో గురువారం జనరల్ బాడీ సమావేశం రంజాన్ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ పది సంవత్సరాల మోడీ పాలనలో బిజెపి అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. అబద్దాలతో, మోసాలతో రెండు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచారని, ఈసారి ఎన్నికల్లో బిజెపికి తగురీతిలో బుద్ధి చెప్పాలని ప్రజలకు తెలిపారు. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో భువనగిరిలో సిపిఎం పోటీ చేస్తున్నదని, మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ హస్తం గుర్తుపై ఓటు వేసి రఘురామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపిని గద్దె దించాలంటే కాంగ్రెస్ వల్లనే సాధ్యమవుతుంది కాబట్టి అనివార్య పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. మోడీ మరోసారి గెలిస్తే ఎన్నికలు ఉండవని, రాజ్యాంగాన్ని, చట్టాలను మారుస్తాడని తెలిపారు. మోడీ 10 ఏళ్ల పాలనలో దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, మహిళలపై జరిగిన దాడులను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ గెలిస్తే బిజెపికి మద్దతిస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు సిద్దినేని కోటయ్య, పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బుగ్గవీటి సరళ, సీపీఎం ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్ రెడ్డి, షేక్ బషీరుద్దీన్, ఖమ్మం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఐద్వా జిల్లా నాయకురాలు పెండ్యాల సుమతి, సీపీఎం నాయకులు మడిపల్లి వెంకన్న, జక్కంపూడి కృష్ణ, పగిడిపల్లి ఉపేందర్, వెన్ను రమేష్, హర్యా నాయక్, వెంకట్రావ్, రాజశేఖర్, నగేష్, రాము, మహిళా నాయకురాలు టేకుమట్ల సీతమ్మ, రాజేశ్వరి, సైదమ్మ నూర్జహాన్ పాల్గొన్నారు.

### ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి

**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

**నవతెలంగాణ -కూసుమంచి**

ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టే మతోన్మాద బిజెపి పార్టీని ఓడించాలని, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ (ఇండియా కూటమి) అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో జరిగిన పార్టీ మండల స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మోడీ గత 10 సంవత్సరాలలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి అనేక వాగ్దానాలు చేశారని, అవి నేటి వరకు అమలు చేయలేదని, ప్రభుత్వరంగసంస్థలన్నీ, ప్రయివేట్‌పరం చేస్తూ...దేశాన్ని కార్పోరేట్ శక్తుల చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. దేశంలో రోజురోజుకీ పేదరికం పెరుగుతుండగా, దేశ సంపద మొత్తం 10 మంది చేతుల్లోకే వెళుతుందని, పేదవాడిని మరింత పేదరికంలోకి నెట్టి వేయడం జరుగుతుందని, ధనవంతులు మరింత ధనవంతులుగా అవుతున్నారని, ఈ అన్నింటికి కారణం మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలే కారణమని తెలిపారు. మరోసారి దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మాత్రం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని, రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజలు మతోన్మాద బిజెపి ఓడించి ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మల్లెల సన్మతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల ఇంచార్జ్ బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మాజీ జెడ్పిటిసి ఎర్రబోయిన భారతి, మండల కమిటీ సభ్యులు, పలు గ్రామశాఖ కార్యదర్శులు, మండలంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయం మరమ్మతు పనుల పరిశీలన**

మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో (సిపిఎం కార్యాలయం) జరుగుతున్న మరమ్మతు పనులను నున్నా నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం మండల పార్టీ సభ్యులను ఆయన అభినందించారు.




# కాంగ్రెస్‌కు టీడీపీ జై

**మెజార్టీ నాయకత్వం, కార్యకర్తలు 'చేతి' వైపే..**

- బీజేపీతో పొత్తుపై రెండు గ్రూపులుగా తెలుగుదేశం
- మరోమారు టీడీపీ నేతలతో పొంగులేటి సమావేశం
- భవిష్యత్తు ఎన్నికల్లోనూ కలిసే నడవాలని నిర్ణయం

**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**



ఎన్నికలకు ఐదారు రోజుల ముందు బీజేపీ, టీడీపీపై కపట ప్రేమను ప్రదర్శిస్తోంది. టీడీపీ ఓట్లను కొల్లగొట్టేందుకు ఆ పార్టీతో ఆకస్మిక పొత్తును ముందుకు తెచ్చింది. ఈ పరిణామాలు టీడీపీలో విభేదాలకు కారణమయ్యాయి. మెజార్టీ నాయకత్వం, కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలనే అభిప్రాయంతో ఉన్నారు. అయినప్పటికీ కొందరు నాయకులు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ప్రలోభాలకు లంగి పార్టీపై అభిమానాన్ని తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తుండటాన్ని మిగిలిన నాయకత్వం ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం ఖమ్మం నియోజకవర్గ నాయకత్వంతో గురువారం ఓ ప్రయివేటు ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈనెల 1వ తేదీన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నాయకత్వాన్ని మద్దతు కోరారు. ఆ తర్వాత ఓ ఐదారు రోజుల క్రితం బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సైతం సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. ఉన్నట్టుండి మొన్నటికి మొన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ పొత్తులను సాకుగా చూపి మద్దతుకు ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో పొంగులేటి టీడీపీ నాయకత్వంతో మరోమారు సమావేశమయ్యారు.

**ఎల్లప్పుడూ కలిసే ఉందాం: మంత్రి పొంగులేటి**

కాంగ్రెస్, టీడీపీలు ఎల్లప్పుడూ కలిసే ఉండాలని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ్ముళ్ల మద్దతుతోనే తామంతా గెలిచామన్నారు. లోక్‌సభ ఎన్నికలే కాదు...ఆ తర్వాత వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఇతరత్ర ఎన్నికల్లోనూ కలిసే నడుద్దామని కోరారు. నొప్పించకుండా ఒప్పించే రీతిలో టీడీపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన సీట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీతో తన స్నేహాన్ని జీర్ణించుకోలేని కొందరు 'బట్ట కాల్చి మీదవేసే..' చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రఘురాంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీతో సమావేశానికి గైర్హాజరైన ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు ఈ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారు. ఆయనతో పాటు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గుత్తా సీతయ్య, ఖమ్మం నగర అధ్యక్షుడు వడ్డె విజయ్, జిల్లా నాయకులు మండిపూడి శ్రీనివాసరావు, నగర ప్రధాన కార్యదర్శి ప్యారీస్ వెంకన్న, పిన్ని నాగేశ్వరరావు, నాగండ్ల మురళి, కటిక నారాయణ, ట్రేడ్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు, మేకల సత్యవతి, కందిబండ నర్సింహారావు, ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, రఘునాథపాలెం మండల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డికి టీడీపీ నేతలతో కోఆర్డినేట్ చేసుకునే బాధ్యతను మంత్రి అప్పగించారు.

**టీడీపీలో గ్రూప్ విభేదాలు...**

ఓ వైపు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం బీజేపీకి మద్దతు ఇస్తూ ర్యాలీలు నిర్వహిస్తుండగా...మరోవైపు అశ్వారావుపేట, ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జీలు బీజేపీకి మద్దతును వ్యతిరేకిస్తున్నారు. మూడురోజులుగా కొనసాగుతున్న ఈ పరిణామాలు టీడీపీలో విభేదాలను బయటపెడుతున్నాయి. టీడీపీ ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేపథ్యంలో 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఎటువైపు నిలుస్తుందో చూడాలి.



### విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

**జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె.శ్రీరామ్**

**నవతెలంగాణ- ఖమ్మం**

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరిగేలా, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బృందాల అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన విషయాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధులు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో చేయాల్సిన ఏర్పాట్లపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు మాట్లాడుతూ గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో ఏలాంటి సమస్యలు లేకుండా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ప్రక్రియ సాఫీగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ టీంలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు అందించాల్సిన పోలింగ్ మెటీరియల్ బ్యాగ్‌ను చెక్ లిస్ట్‌తో సహా ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి కౌంటర్లు ఏ విధంగా ఉండాలన్న దానిపై పూర్తి అవగాహన కల్పించారు. ఆయా అధికారులు ఇచ్చిన సూచనలు విధిగా పాటించాలని స్పష్టం చేశారు. రిసెప్షన్ కౌంటర్ ఇన్చార్జి మెటీరియల్ , డాక్యుమెంట్స్‌కు సంబంధించిన అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సెక్టార్ వారిగా ఈవీఎం, పోల్ మెటీరియల్ పంపిణీ చేయాలని, రిసెప్షన్ సెంటర్లలో కౌంటర్ వారీగా తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ టీంలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, సహాయ జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు మదన్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

# అసమర్థ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



- రోడ్డు షోలో నామ, పువ్వాడ, వద్దిరాజు

**నవతెలంగాణ- ఖమ్మం**

తప్పుడు హామీలతో ప్రజల్ని మోసం చేసిన అసమర్థ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి, కారు గుర్తుపై ఓటు వేసి బ్రహ్మాండమైన మెజార్టీతో తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం ఖానాపురం హవేలీలో రోడ్డు షోలో నామ మాట్లాడారు. అన్నింటా నెంబర్ వన్ గా ఉండే తన పేరు బ్యాలెట్ పేపర్‌లో కూడా నెంబర్ వన్ అని తెలిపారు. ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ వారిని ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. తనను గెలిపిస్తే తెలంగాణా గొంతుకనై పార్లమెంట్ లో పెద్ద ఎత్తున గళం ఇప్పుతానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయకుమార్,కోటి, జ్యోతిరెడ్డి, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

### నామాను భారీ మెజార్టీతో గెలిపించాలి

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

**నవతెలంగాణ- నేలకొండపల్లి**

బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని నేలకొండపల్లి, భైరవునిపల్లి ఆరెగూడెం, రాజేశ్వరపురం, చెన్నారం, మండ్రాజుపల్లి, బోదులబండ, పైనంపల్లి, ముజ్జుగూడెం, గువ్వలగూడెం గ్రామాలలో విస్తతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి కూలీలను స్వయంగా కలిసి నామా నాగేశ్వరరావుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, పార్టీ కార్యదర్శి ఎన్నబోయిన శ్రీను, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, నెల్లూరి లీలప్రసాద్, శాఖమూరి సతీష్ పాల్గొన్నారు.

### ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**నవతెలంగాణ- ఖమ్మం**

ఏదో వస్తది, ఏదో అవుతుందని చెప్పి ఆశపడి మార్పు కోసం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే కరెంటు పోయిందని, నీళ్ల పోయాయని, పంటలు ఎండిపోయాయని, పెన్షన్, తులం బంగారం అన్నీ పోయాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పథకాలను అమలు చేయడం లేదని అన్నారు. గురువారం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను మిస్ అవుతున్నారని, ఆయన ఎక్కడ బస్సు యాత్ర చేపట్టినా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. పథకాలు, రాకపోయినా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని ప్రజలు అంటున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12-13 స్థానాల్లో గెలుస్తుందన్నారు. ఖమ్మం అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని ఉమ్మడి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా నేతలను కాదని బయట వ్యక్తిని తీసుకొచ్చి కాంగ్రెస్ ఖమ్మంలో పోటీ చేయిస్తుందన్నారు. బయట వ్యక్తికి జిల్లాతో ఏమి సంబంధం ఉందో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా వ్యక్తిని అని చెప్పుకునే కాంగ్రెస్ నేత పాలేరు నియోజకవర్గానికి, చేగొమ్మలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఖమ్మంలో గ్రానైట్ పరిశ్రమతో వేలాది మందికి ఉపాధి కల్పించారని, అనేక సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ ఎన్నికల్లో నామను గెలిపించాలని పిలుపునిచ్చారు.

**ముదిగొండ :** నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని సువర్ణాపురం, ఖానాపురం, ముదిగొండ, చిరుమర్రి తదితర గ్రామాల్లో డోరు పోస్టర్స్‌తో ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు. నామ గుర్తు కారు గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ నేతలు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పసుపులేటి వెంకట్, మాలోజి గోవిందు, తోట ధర్మారావు, అమరబోయిన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు నామ నాగేశ్వరరావు రోడ్ షో

**నవతెలంగాణ-కల్లూరు**

నామా నాగేశ్వరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఏర్పాటు చేసిన రోడ్ షోను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కార్యకర్తలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు మండలంలో గురువారం కల్లూరు బొప్పాన రామరావు, రాళ్ళబంజర, పాయపూర్, నారాయణపురం, కొర్లగూడెం, పుల్లయ్య బంజార, హనుమతండా, పెద్దకొరికొండి, తెలగారం, మార్లపాడు, వెన్నవల్లి, పోచారం గ్రామంలో నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్, పాలర్పు రామారావు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డి

**నవతెలంగాణ-తల్లాడ**

బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు ఐలూరు వెంకట కోటారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

**ఖమ్మం :** 57వ డివిజన్‌లోని రెహమాత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల యుగంధర్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## 'మైనారిటీల మద్దతు కాంగ్రెస్‌కే'

**నవతెలంగాణ-ఖమ్మం**

తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ ముస్లింల పక్షపాతి అని, ఈసారి ఎన్నికల్లో తమ మద్దతు అంతా కాంగ్రెస్ పార్టీకే అని ముస్లిం మైనారిటీలు ప్రకటించారు. గురువారం తుమ్మలగడ్డ మజీద్ వెనక వీదిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మైనార్టీ జిల్లా నాయకులు ఎస్‌కే. మియా భాయ్ ఆధ్వర్యంలో లోక్‌సభ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి అక్కడికి వెళ్లి అందరిని ఆప్యాయంగా పలకరించారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. మియా భాయ్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, యువకులు రఘురాంరెడ్డిని కలిసి భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

## చర్చి ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో పునీత చిన్నతే తే రోజమ్మ చర్చి ప్రారంభోత్సవ వేడుకలో గురువారం సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రభువు ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దిరిశాల ప్రమీల, పీఏసీఎస్ అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏలూరు లక్ష్మి, మాజీ వైఎస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, నాయకులు దాసురావు, శివారెడ్డి, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 'బీసీల మద్దతు కాంగ్రెస్ పార్టీకే'

**నవతెలంగాణ-ఖమ్మం**

బీసీల మద్దతు కాంగ్రెస్ పార్టీకే జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఈ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గడిచిన పది సంవత్సరాలు కేసీఆర్ మాయమాటలతో దళితులను, గిరిజనులను, బీసీలను, ఉద్యోగులను, తెలంగాణ ఉద్యమకారుల్ని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే జరగబోయే జనాభా లెక్కల్లో కులాలు వారిగా లెక్కలు తీస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీకి సంపూర్ణమైనటువంటి మద్దతు ప్రకటించినట్టుగా వారు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నలమాస సుగుణ, ఖమ్మం నగర అధ్యక్షులు గద్దె రామ్మోహన్, వెంకటరామయ్య ప్రధాన కార్యదర్శి కేతనబోయి నాగేశ్వరరావు ,తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చుల పద్మచారి, జిల్లా నాయకులు మోడేపల్లి వెంకటాచారి, పులుసు అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## 12న నెల నెల వైద్య ఉచిత శిబిరం

- ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపు

**నవతెలంగాణ-నేలకొండపల్లి**

ఈనెల 12వ తేదీన ఆదివారం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్‌రావు (ఎన్‌జీఆర్) సేవా కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే నెల నెల వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా కమిటీ కన్వీనర్ ఎటుకూరి రామారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ సీ.భారవి ఎంబిబిఎస్, ఎండి, డిఎం, జీర్ణకోశ వ్యాధి నిపుణులు, డాక్టర్ కొల్లి అనుదీప్ ఎండి (జనరల్ మెడిసిన్) డాక్టర్ హస్నద్ బాబా ఎంబిబిఎస్ రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ వారిచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని రావాలన్నారు. బీపీ, షుగర్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని, ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 9490098225, 903 0897480, 994 9592544, 9110364581 లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కేవీ.రామిరెడ్డి, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.





## మతతత్వ బీజేపీని ఓడించాలి

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్

**నవతెలంగాణ-ఖమ్మం**

మతోన్మాద బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగాన్ని ప్రసాదించి బహుజనులకు రిజర్వేషన్లు, హక్కులను కల్పించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలకు, బహుజనులకు హక్కుల్లేకుండా చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. మనువాద పార్టీ బీజేపీకి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు కృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడాన్ని ఖండించారు. ఈ విలేఖరుల సమావేశంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, మహా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్తపాక నర్సింహారావు, మాదిగ జెఏసీ రాష్ట్ర నాయకులు మోదుగు జోగారావు, తెలంగాణ దళిత బహుజన సమితి రాష్ట్ర కన్వీనర్ గజ్జెల్లి మల్లిఖార్జున్, మాదిగ విద్యార్థి ఓయూ జెఏసి ప్రెసిడెంట్ జోగు గణేష్, కాంగ్రెస్ మధిర నాయకులు పాల్గొన్నారు.

# మతం పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీ

- మూడోవ సారి అధికారంలోకి వస్తే దేశంలో అశాంతే
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్

**నవతెలంగాణ-ఖమ్మం**

భారత దేశంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తే మతాల మధ్య చిచ్చు పెట్టి మతోన్మాదం పెరిగి దేశ అంతా అల్లకల్లోలం కావడం ఖాయమని, మూడోవ సారి అధికారంలోకి వస్తే దేశంలో ఆశాంతి వచ్చి అవకాశం ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని పీఆర్టీయు కార్యాలయం రోడ్‌లో సీపీఐ(ఎం) బలపరిచిన ఖమ్మం



కాంగ్రెస్ అభ్యర్థి రఘురామ్ విజయాన్ని కాంక్షిస్తూ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే ఖమ్మం జిల్లా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారము మతాలు మధ్య రాజకీయ చిచ్చు పెట్టి దేశంలో అశాంతి ఉండే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ రెండు కవలు పిల్లలు అని, ఆర్ఎస్ఎస్ ఆదేశాలు మేరకు మైనార్టీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ దేశంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి ఏమి తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో బీజేపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హిందువులు పేరుతో మత రాజకీయాలు చేస్తూ హిందువులపై అదనపు ఆర్థిక భారాలు మోపడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రతి ఎన్నికల సమయంలో భావోద్వేగాలను రెచ్చగొట్టే పనిలో బీజేపీ నేతలు ఉన్నారని విమర్శించారు. ఒక పక్క నూతన ఆర్థిక విధానాలతో దేశంలో సంక్షోభం ఏర్పడిందని, మరోవైపు ప్రజలు ఉద్యమాల్లోకి రాకుండా మతాన్ని ముందుకు తెచ్చి దేశ ప్రజలతో ఆటలు ఆడుతున్నారని తెలిపారు. రాబోయే కాలంలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింతగా తీసుకుని వెళ్ళాలని కోరారు. ఖమ్మం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులు జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని పార్లమెంటుకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు డీ. నాగరాజు, రామారావు, పీ.నాగేశ్వరరావు, ఎస్కే. షఫీ, మల్లికార్జున్‌రెడ్డి, ఎస్కే.చిన్న హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే ఉపాధి

- పని ప్రదేశంలో ఎమ్మెల్యే ప్రచారం

**నవతెలంగాణ-కారేపల్లి**

కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం పేదల ఉపాధికి తీసుకవచ్చిన ఉపాధీ హామీ చట్టం కొనసాగాలంటే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంకిస్తూ గురువారం సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలంలోని విశ్వనాధపల్లి, కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. విశ్వనాధపల్లి, కారేపల్లి సమీపంలో చెరువుల వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్ళిన ఎమ్మెల్యే ఉపాధీ కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలతో కలిసి గడ్డపారపట్టి, తట్టతో మట్టిని ఎత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ నిధులు తగ్గిస్తున్నారన్నారు. పేదలకు ఆరు గ్యారంటీలు అమలుకు కట్టుబడి అమలు చేస్తున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికలలో ఓటుతో బలం ఇవ్వాలని కోరారు. శ్రమ విలువ తెలిసిన వాడినని శ్రమికులకు అండగా ఉంటానన్నారు. రైతులకు రైతు భరోసా పైకం బ్యాంకు ఖాతాలలో వేసిందని, రైతుల రుణమాఫీ పార్లమెంట్ ఎన్నికల అనంతరం చేయనుందన్నారు.

**బీజేపీతో యువశక్తి నిర్వీర్యం**

మేకిన్ ఇండియా, నల్లడబ్బు వెనకకు తెచ్చి పేదలకు ఆకౌంట్లలో రూ.15 లక్షల జమచేస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ దేశంలోని యువశక్తిని నిర్వీర్యం చేశారన్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం విమర్శించారు. వైరా ఎమ్మెల్యేతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఆయన కూలీలనుద్దేశించి మాట్లాడుతూ దేశంలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక విదేశాలకు వలస వెళు_న్నారన్నారు.పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమీ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి ఓటు వేయటంతో మోడీ పాలనకు బై చెప్పుదామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, మురళి, టీడీపీ నాయకులు బొగ్గారపు ముఖర్జీ, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాఫ్, బానోత్ దేవ్లానాయక్, మల్లెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## మధిరలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

**నవతెలంగాణ-మధిర**

ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మధిరలోని తొమ్మిదవ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ పాలనలో దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, యువతి, యువకులు మేధావులు ఆలోచించి కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యంబాబు, సీతారామరెడ్డి పాల్గొన్నారు.

















## కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

**నవతెలంగాణ-వైరాటౌన్**

మండలంలోని గన్నవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 100 కుటుంబాలు జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గన్నవరం ఎంపీటీసీ ఎర్రమల సౌజన్య ఎర్రమల రవీందర్‌రెడ్డి, శీలం కృష్ణారెడ్డి, శీలం వెంకటరామిరెడ్డి, కోరే కృష్ణ, కోరే సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కోరే వెంకటేశ్వర్లు, ఎస్‌కే. మీరా, బలవంతం కృష్ణ కండవలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సోనియా గాంధీ రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. మతతత్వ బిజెపిని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన పార్టీ కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, టౌన్ అధ్యక్షులు సీతారాములు, నాయకులు దాసరి దానియేలు, కట్ల రంగారావు, దొడ్డ పుల్లయ్య, పమ్మి అశోక్, పొదిలి హరినాథ్, బోళ్ల గంగారావు, గుగులోతు రాము, మట్టూరి కృష్ణరావు, శీలం వెంకటరామిరెడ్డి, దర్శి చెన్నారావు, కట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నామ గెలుపునకు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

**నవతెలంగాణ-కారేపల్లి**



బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు కోసం బీఆర్ఎస్ శ్రేణులు కారేపల్లి మండలంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. గురువారం విశ్వనాధపల్లి, దుబ్బతండా, మేకలతండా గ్రామాల్లో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎంపీ నామ చేసిన అభివృద్ధి, అమలు చేయని కాంగ్రెస్ గ్యారంటీలపై కరపత్రాలు పంచుతూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణ, జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్‌లు మాట్లాడుతూ నామ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా సమస్యలపై పట్టున్న నేత నామ అని, ఆయన గెలుపు జిల్లా అభివృద్ధికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, నాయకులు అంగోత్ మత్రు, భూక్యా కోటేశ్వరరావు, గుగులోత్ కుమార్, అంగోత్ శ్రీకాంత్ తదితరుల పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సీపీఐ

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల వద్ద మున్నేరులో పడి మృతి చెందిన పిల్లల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. గురువారం ఈతకు వెళ్లి మృతి చెందిన లోకేష్, హరీష్, గణేష్ మృతదేహాలను సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎస్‌కే. జానిమియా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి మృతుల కుటుంబాలను ఓదార్చారు. లోకేష్, హరీష్‌ల తల్లిదండ్రులు ఆముదాల చిరంజీవి, లక్ష్మి సిపిఐ నేతలను చూసి బోరున విలపించారు. చిరంజీవి ఆటో డ్రైవర్గా ఏఐటీయూసీలో చురుకైన కార్యకర్తగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ చిరంజీవి కుటుంబం రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబమని, అలాగే గణేష్ తల్లి బానోత్ కళావతి భర్త మృతి చెందిన కాయ కష్టం చేస్తూ కుమారున్ని చదివించుకుంటుందని అతనిపై ఆశలు పెంచుకుందని, ఈ రెండు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలు, బంధువుల రోదనలతో ఆసుపత్రి మారుమ్రోగింది.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-వైరాటౌన్**

గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి అద్వర్యంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యామ్ బాబు ఆర్థిక సహాయంతో వైరాకు చెందిన గుండె సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న రాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిఎంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు, ఆర్సీ లగడపాటి ప్రభాకరరావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

# భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | మే 10, 2024 | www.navatelangana.com


## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

- 14 నెంబర్ బస్తీలో విషాదఛాయలు

**నవతెలంగాణ-ఇల్లందు**



ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటనలో మున్సిపాలిటీ పరిధిలోని 14 నెంబర్ బస్తీకి చెందిన ముల్లపాటి శ్రీనివాస్ (52) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి మండల పరిధిలోని పోలంపల్లి బొగ్గు బావి సమీపంలో గత 20 సంవత్సరాలుగా మృతుడు ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ రాకపోవడంతో బుధవారం ఇటికల తయారీ సంబంధించిన పనుల కోసం తానే స్వయంగా ట్రాక్టర్ నడిపాడు. ట్రాక్టర్ కల్వర్టుకు తగిలి బోల్తా పడడంతో ట్రాక్టర్ నడుపుతున్న శ్రీనివాస్‌కు తలపై బలమైన గాయం అయ్యింది. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ ప్రభుత్వ హాస్పిటల్లో మృతి చెందాడు. ట్రాక్టర్ వెనుక భాగంలో కూర్చున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కూలి రవికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం హాస్పటల్‌కు తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య రాణి, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండి, అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉన్న శ్రీనివాస్ మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కలచివేశాయి. సంఘటన జరగడం దురదృష్టకరమని వారి స్నేహితులు రాజేష్ లోధ్, శ్రీధర్ లోదులు అన్నారు. పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రాజారాం తెలిపారు.

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పృథ్వీతేజ్

**నవతెలంగాణ-దమ్మపేట**



ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ కుమారుడు నామా పృథ్వీ తేజ్ స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మల్కారం, దిబ్బగూడెం, రాచురిపల్లి, తాల్లమడలో ఉపాధి హామీ చట్టంలో పని చేసే వారి వద్దకు వెళ్ళి కాంగ్రెస్ మోసం చేసిన విధానాన్ని వివరించి, ఈ సారి మోసపోకుండా బ్యాలెట్‌లో 1వ నెంబర్‌లో గల నామ నాగేశ్వరరావు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....కేసీఆర్ ఇచ్చిన 2వేల పెన్షన్, లక్ష కల్యాణ లక్ష్మి, మాత్రమే వస్తున్నాయని, కాంగ్రెస్ వారు ఇస్తానన్నవి ఏమీ రావట్లేవని, మీకు అండగా ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో రావు జోగేశ్వరరావు, గారపాటి సూర్యనారాయణ, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గెల పూజ, అంకత ఉమ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు రుప్ సింగ్, రాజు, కునుసోత్ చిట్టి బాబు, రావూరి వీరయ్య, దన్ రాజ్, బాచి శ్రీను, యార్లగడ్డ శ్రీను, గోవిందు, తిరువీధుల ఆనంద్, పోలయ్య, ప్రసాద్, బాబు రావు, నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుక మాలోత్ కవితను గెలిపించండి

**నవతెలంగాణ-మణుగూరు**



సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను నుంచి ఉపశమనం పొందాలంటే ప్రశ్నించే గొంతుక మాలోత్ కవిత గెలిపించాలని ఏరియా టీబీజీకేఎస్ ఇన్‌చార్జి నాయకులు నాగెల్లి వెంకట్ కార్మికులకు పిలుపు ఇచ్చారు. గురువారం ప్రకృతికి విరుద్ధంగా భూగర్భ గనిలోకి వెళ్లి ప్రాణాలను ఫణంగా పెట్టి బొగ్గు తీస్తున్న కార్మికులకు సైనికుల మాదిరిగానే ఆదాయపు పన్ను రద్దు చేయాలన్న కార్మికులకు ఆదాయపు పన్ను నుంచి ఉపశమనం పొందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో మాలోత్ కవిత గెలవాలని కోరారు. కార్మిక వాడల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వరరావు, పద్దం శ్రీనివాస్, యర్రపు వినయ్ కుమార్, రమేష్, సమర్పన్, రేవంత్, వి.రవి శ్రీహరి, రాజేష్, ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన తహసీల్దార్

**నవతెలంగాణ-పినపాక**



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను తహశీల్దార్ టి.సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వృద్దులు, గర్భిణీలు, వికలాంగులు, మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని పోలింగ్ కేంద్రాల నిర్వాహక సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బందికి తాగు నీరు, భోజన వసతి, మూత్ర శాలలు, విద్యుత్ సౌకర్యంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కే.బాలకృష్ణ, కార్యదర్శి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి కారుని తనిఖీ చేసిన ఆర్డీఓ

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీ బృందాలు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్టు భద్రాచలం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దామోదర్ రావు తెలిపారు. అందులో భాగంగా గురువారం కూనవరం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులో ఎఫ్ఎస్‌టీ బృందాలు వాహనాలను తనిఖీలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్‌ని తనిఖీ చేసినట్టు తెలిపారు. చెక్ పోస్టులలో విధులు నిర్వహిస్తున్న వివిధ బృందాలు ప్రత్యేకమైన నిఘాతో ప్రతి వాహనాన్ని పరిశీలించడం జరుగుతుందని ఎన్నికల నియమా నిబంధనలను తప్పకుండా పాటించి వారి ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేల్పుల శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

### మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు

- చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం
- సరిహద్దు రాష్ట్రాల పోలీస్ స్టేషన్‌లో పటిష్టమైన ఏర్పాట్లు
- నవతెలంగాణతో ఎస్పీ రోహిత్ రాజు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

రానున్న లోక్ సభ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు నిర్వహించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, సామాన్య ప్రజలను చైతన్యం చేసినట్టు, సరిహద్దు పోలీస్ స్టేషన్‌లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం, మహబూబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రెండు నియోజకవర్గాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నాయని తెలిపారు. ఆయా నియోజక వర్గాల పరిధిలో సుమారు 971 పోలీస్ స్టేషన్లో పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు. సుమారు 146 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఇప్పటికే పలు దఫాలుగా తనిఖీలు నిర్వహించామని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో 135 నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. రాజకీయంగా సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు జిల్లాలో 11 ఉన్నాయని, వీటి పరిధిలో కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు.



మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గం పరిధిలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జిల్లాకు 6 సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ కంపెనీల బలగాలు చేరుకున్నాయని, వాటిని ఆయా పోలింగ్ కేంద్రాల కు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లా సరిహద్దుగా ఉన్న బీజాపూర్, చత్తీస్గఢ్ బార్డర్ సరిహద్దుల్లో క్రిటికల్ ఫోర్స్ వినియోగించడం జరుగుతుందని తెలిపారు. వీరితోపాటు జిల్లా స్పెషల్ పార్టీ ఫోర్సులు కూడా వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

### నాలుగు గంటల వరకే పోలింగ్...

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ప్రజలు వారి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ పలు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించుకునే విధంగా అనుమతులు ఇచ్చినప్పటికీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో గతంలో ఉన్న విధంగానే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలను చైతన్యవంతం చేసినట్టు తెలిపారు. ఇప్పటికే 133 ఆదివాసీ గుత్తికోయల గుంపులను పరిశీలించడం జరిగిందని, వారికి ఓటు హక్కు గురించి అవగాహన కల్పించామని, సుమారు 5000 మంది వరకు ఆయా ప్రాంతాలలో ఉన్నట్టు వివరించారు.

### ఇంటర్ చెక్ పోస్టులలో తనిఖీలు...

జిల్లా సరిహద్దులో 12 ఇంటర్ చెక్‌పోస్టులు ఉన్నాయని, వాటిపరిధిలో నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అశ్వరావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం తదితర చెక్‌పోస్టుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, ఇల్లందు, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టుల్లో కూడా పోలీసులు నిఘా పెంచారని తెలిపారు.

### మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు...

జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్పెషల్ పార్టీలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పలు దఫాలుగా కూంబింగ్ నిర్వహించామన్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే 2 డిమైనింగ్ బాంబులను బాంబ్‌స్క్వాడ్ నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. వీటితోపాటు ఆర్ఓపీ పార్టీలు బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృంతగా తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభావిత ప్రాంతాలైన ప్రాంతాలలో సుమారు రెండు దఫాలుగా వందల కిలోమీటర్లు మేర ఆర్ఓపి చేయడం తనిఖీలు చేశామని, మరోసారి చేయనున్నట్లు వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో 8 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, వాటిని పటిష్ఠం చేసినట్టు తెలిపారు. గతంలో జరిగిన ఎన్నికలు, వాటి పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

### విస్తృతంగా తనిఖీలు....

ఈ నెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, గంజాయి, డబ్బును సీజ్ చేసినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుండి రూ.3కోట్ల 60లక్షలు సీజ్ చేశామని, అక్రమంగా తరలిస్తున్న 850 కేజీల గాంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. అక్రమంగా అమ్మకాలు చేస్తున్న మద్యం సీజ్ చేశామని వివరించారు. ప్రజలు నిర్భయంగా...నిర్ణీత సమయంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వారి అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## రఘురామరెడ్డికే పూర్తి మద్దతు : టీడీపీ

- ఫలించిన పర్వతనేని చొరవ

**నవతెలంగాణ-దమ్మపేట**

ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం ఇండియా కూటమి బలపరిచిన రామసహాయం రఘురామరెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని మండల తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. గురువారం దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సమావేశం టీడీపీ సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ మండల కన్వీనర్‌గా ఉన్న ఎండి వలీ పాషా మాకు ఎటువంటి సమాచారం ఇవ్వట్లేదని బీజేపీ మద్దతు ఇచ్చే విషయంలో తాము పూర్తిగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదేశాల అనుసారం మండల కాంగ్రెస్ నాయకులు పర్వతనేని వరప్రసాదరావు గడ్డిపాటి సత్యం నివాసానికి వచ్చి కూలంకుషంగా రాజకీయ చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగా అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తాము పూర్తిగా సహకరించాము అదేవిధంగా ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయానికి తమ పూర్తిమద్దతు తెలియజేయడమే కాకుండా తాము కార్క్షేత్రంలోకి ప్రవేశించి ఖచ్చితంగా సీపీఐ(ఎం), సీపీఐ, టీజేఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసికట్టుగా పనిచేసే ఇండియా కూటమి అభ్యర్థికి అత్యధిక మెజార్టీ తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి వీరభద్రం, ఎలవర్తి కిషోర్, ఎన్నికలపాటి కృష్ణయ్య, వెనకలపాటి హరినాయుడు, గడ్డిబాటి పెద్దబాబు, అల్లాడి అప్పారావు, మల్లేశ్వరరావు, కాట్రగడ్డ ప్రసాద్, కాట్రగడ్డ నిరంజన్ రావు తదితరులు ఉన్నారు.

## అన్నం గంజవుతోంది బాబోయ్...

- మిట్ట గూడెం గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలలో విద్యార్థుల అవస్థలు
- అన్నం తినలేక పోతున్నాం అంటున్న విద్యార్థులు
- కొత్త బియ్యం సరఫరా వల్లే అన్నం ముద్ద అవుతుంది అంటున్న వైనం



ప్రభుత్వ సంక్షేమ గిరిజన డిగ్రీ గురుకుల కళాశాల

**నవతెలంగాణ-అశ్వాపురం**



మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలలో గత కొంతకాలంగా అన్నం గంజవుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త బియ్యం సరఫరా కారణంగా అన్నం ముద్దగా మారి తినలేనంతగా మెత్తగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. మెత్తగా ఉన్న అన్నం తినడం వల్ల కొందరు విద్యార్థులకు విరోచనాలతో పాటు కడుపులో నొప్పి వస్తుందని వారు చెప్పున్నారు. అదేవిధంగా రోజువారి కూరల్లో కూడా నాణ్యత లేకుండా పోతుందని దాంతో భోజనం చేయడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు. భోజనం నాణ్యతగా లేదని సంబంధిత ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని, పైగా బియ్యాన్ని మేమేమైన కొంటున్నామా, లేక పండిస్తున్నామా ప్రభుత్వం వేటిని సరఫరా చేస్తే అవే వండి పెడుతున్నామని సమాధానం చెబుతున్నారని విద్యార్థులు అంటున్నారు. అంతేకాకుండా ప్రశ్నించే విద్యార్థులను టార్గెట్ చేస్తూ ప్రతి చిన్న విషయానికి టీసీ ఇచ్చి పంపిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మిట్ట గూడెం ప్రభుత్వ సంక్షేమ గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేసి విద్యార్థులకు భోజన వసతిని సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

### మెత్తగా అయిన అన్నం తినలేక పోతున్నాము :

**డిగ్రీ విద్యార్థి విద్యాసాగర్**



గత కొంతకాలంగా కళాశాలలో పెడుతున్న అన్నం మెత్తగా అవుతుంది. ముద్దగా అయిన అన్నం తినలేక పోతున్నాము. కొత్త బియ్యం సరఫరా మానేసి పాత బియ్యాన్ని అందించాలి.

### విద్యార్థుల ఇబ్బందులను అధికారులు గుర్తించాలి :

**విద్యార్థి అక్బర్ పాషా**



మిట్ట గూడెం సంక్షేమ గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలలోని విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించాలి. నాణ్యమైన బియ్యంతో భోజనం తయారు చేసేలా చర్యలు చేపట్టాలి. ముద్దైన బియ్యంతో అన్నం వండితే తినలేక పోతున్నాము.

## పీఎంహెచ్ హాస్టల్ వర్కర్ల 15 నెలల వేతనాలు చెల్లించాలి

- మంత్రి తుమ్మలకి సీఐటీయూ వినతి

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పోస్టుమట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 15 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, అందుకు అవసరమైన బడ్జెట్ విడుదల చేయించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం పర్యటనకు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్ మాట్లాడుతూ... గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకి వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. ఇప్పటికే అనేకసార్లు ఐటీడీఏ అధికారులను, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌ని కలిసి వినతి పత్రాలు అందజేసినప్పటికీ వేతనాల చెల్లింపులో అధికారులు సరైన రీతులో స్పందించడం లేదని మంత్రికి వివరించారు. 15 నెలల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమస్యను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి తెలియజేసి సాధ్యమైనంత తొందరగా వేతనాలకు బడ్జెట్ విడుదల చేయించి, వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయించాలని సీఐటీయూ మంత్రిని కోరింది. తప్పనిసరిగా జీవో నెంబర్ 60 అమలకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరావుని కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, జిల్లా కోశాధికారి జి.పద్మ, గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీని ఒంటరి చేద్దాం...

- ఇండియా కూటమికి మద్దతు ఇద్దాం
- ఖమ్మం పార్లమెంట్ స్థానంలో రఘురామిరెడ్డిని గెలిపిద్దాం
- విలేకర్ల సమావేశంలో సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

దేశంలో బీజేపీని ఒంటరి చేద్దామని, ఇండియా కూటమికి మద్దతు యిద్దామని, ఖమ్మం పార్లమెంట్ స్థానంలో రఘురామిరెడ్డిని అత్యధిక మెజారీటితో గెలిపిద్దామని, మోడీ సర్కారు రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నామని, జిల్లాలో నేటి నుంచి 11 వరకు ప్రజల్లో ప్రచారం చేయానున్నట్లు, నియోజకవర్గ మండల కేంద్రాల్లో క్యాంపెయిన్‌లు, కనీస మద్దతు ధరల చట్టం... రుణమాఫీ చేయకపోవడంపై రైతులకు వివరిస్తామని విలేకర్ల సమావేశంలో సంయుక్త కొసాన్ మోర్చా నాయకులు స్పష్టం చేశారు. గురువారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్యా, గుమ్మడి నర్సయ్య, ఏపూరి బ్రహ్మం, కందగట్ల సురేందర్, గౌని నాగేశ్వర రావు సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు నొక్కి చెప్పారు. రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో గ్రామాల్లోకి బీజేపీ అభ్యర్థులను ప్రచారానికి రానివ్వని పరిస్థితి నెలకొందన్నారు. మోడీ, అమిత్, బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారమంతా దంబాచారమేనని స్పష్టం చేశారు. ఢిల్లీ చారిత్రాత్మక పోరాటం సందర్భంగా రైతాంగానికి రాతపూర్వకంగా మోడీ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఎంఎస్ స్వామినాథ్ చేసిన సిఫారసులను బుట్టదాఖలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీని ఒంటరి చేద్దాం..వ్యతిరేకిద్దాం..శిక్షిద్దాం..దేశాన్ని రక్షించుకుందాం నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామనీ, అందులో భాగంగానే మంగళవారం నుంచి 11వ తేదీ వరకు ప్రజల్లోకి వెళ్తామనీ, నియోజకవర్గ మండల కేంద్రాల్లో ప్రచారం చేస్తామని వారు ప్రకటించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. పదేండ్ల కాలంలో 4.25 లక్షల మంది రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు.

ఆత్మహత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకున్నదని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న హామీ ఏమైందని మోడీని ప్రశ్నించారు. రైతులను మోసం చేసిన బీజేపీకి చెందిన అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారయణ, ముద్దా భిక్షం, నరేంద్ర కుమార్, రేపాకుల శ్రీను, జాటోత్ కృష్ణ, రాము, బుర్రా వెంకన్న, ధర్మా, భూక్య కిసన్, బానోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పై విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యంపై ఖండన

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ

**నవతెలంగాణ-కొత్తగూడెం**



రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతుల సంక్షోభానికి కారణమైన (టెట్) ఉపాధ్యాయ అర్హత పరీక్ష వివాదం పరిష్కారం పట్ల విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదంటూ ఏప్రియల్ 8న ఎన్‌సీటీఈ పంపిన వివరణ లేఖను వెల్లడించలేదని విమర్శించారు. ఉపాధ్యాయు లందరూ టెట్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా చేసిన విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మేరకు టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కిషోర్ సింగ్, ఎస్.కృష్ణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 8న వచ్చిన వివరణ లేఖను వెల్లడించకుండా రహస్యంగా ఉంచి ఉపాధ్యాయులందరినీ మానసిక ఆందోళనకు గురి చేయడంతో పాటు దరఖాస్తు చేయడం ద్వారా లక్షల రూపాయలు వృధా చేయించారని వారు ఆరోపించారు. తక్షణమే కమీషనర్‌ను ఆ బాధ్యతల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్‌సీటీఈ నుండి మరి కొన్ని అంశాలపై వివరణ తీసుకుని ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యా వాలంటీర్ల నియామకం చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, పాఠశాలలలో సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు.

## రఘురామిరెడ్డి గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం

**నవతెలంగాణ-చంద్రుగొండ**

సేవాదళ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి గెలుపు కోరుతూ గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సేవాదళ్ ఇన్‌చార్జి కోదుమూరి దయాకర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేశబోయిన నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అంతటి రామకృష్ణ, నియోజకవర్గ సేవాదళ్ బి బ్లాక్ అధ్యక్షుడు లక్ష్మణరావు, సేవాదళ్ మండల అధ్యక్షుడు బుంగ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి సురేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చాపలమడుగు ప్రసాద్, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు రద్దు చేస్తామని సీఎం ఆరోపించడం అవాస్తవం

- విలేకరుల సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్

**నవతెలంగాణ-ఇల్లందు**

గత కొన్ని రోజులుగా రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై బురద జల్లడాన్ని ఖండిస్తున్నట్టు బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ నేతగా పోరాటం చేసిన తనను అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనకుండా మాజీ సీఎం కేసీఆర్ అవమానాల గురిచేసారన్నారు. అవమానాలు భరించలేక బీజేపీలో చేరినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు టీడీపీ, ఎమ్మార్పీఎస్ మద్దతిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్ గోపి, పట్టణ అధ్యక్షులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుపై దాడులు

**నవతెలంగాణ - అశ్వారావుపేట**

ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణ, విక్రయాలపై అప్రమత్తమైన అధికారులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని కొత్త మామిళ్ళవారిగూడెం, నారాయణపురం సూర్యం శుక్రవారం ఎన్నికల విభాగం ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఎల్. కృష్ణ నేతృత్వంలో ఎక్సైజ్ అధికారులు దాడుల నిర్వహించారు. దాడుల్లో రూ.30 వేల విలువ గల 80 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరరావు తెలిపారు..

**సరిహద్దులో దాడులు**

రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ అధికారులతో కలిసి అశ్వారావుపేట ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం లో నాటు సారా తయారీకి వినియోగించే 20 వేల విలువ గల 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దాడుల్లో అశ్వారావుపేట ఎక్సైజ్ అధికారి రాజేశ్వరరావు, చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డిపార్ట్మెంట్ ఎస్సై లక్ష్మణరావు, పాల్గొన్నారు.

## రామసహాయం రఘురామిరెడ్డిని గెలిపించాలి

**నవతెలంగాణ-సత్తుపల్లి**

పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, హస్తం గుర్తుపై ఓటు వేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ అన్నారు. గురువారం కాకర్లపల్లి గ్రామంలో సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం విస్తృతంగా చేశారు. ఈ సందర్భంగా మాదిరి రమేష్ మాట్లాడుతూ బీజేపీని ఓడించాలని, కమ్యూనిస్టులు బలపరిచిన కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలిక పోగు సర్వేశ్వరరావు, వేపులపాటి కుమార్ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మారేశ్వరరావు, రమేష్, పువాళ్ల ఉమా,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ఉరుములు మెరుపులతో వర్షం

- ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

**నవతెలంగాణ-పాల్వంచ రూరల్**

పాల్వంచ వ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలు ఊరట చెందారు. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గత నాలుగు రోజులుగా సాయంత్రం పూట చల్లటి వాతావరణంతో వర్షం పడే సూచనలు కనిపించినా.. వరునుడు చిరు జల్లులకే పరిమితమవడం మరింత ఉక్కపోతకు గురిచేసింది. సుమారు గంటపాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటివరకు ఎండతాపంతో విలవిలాడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షంతో పారవష్య అనుభూతి పొందారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న ధాన్యం ఎఫ్‌సీఐకి తరలడంతో.. నష్టాన్ని నివారించినట్లయింది. వ్యవసాయపరంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వ్యవసాయ అధికారి శంభో శంకర్ తెలిపారు.

## అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ప్రచారం

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

అశ్వారావు పేటలోని గుర్రాల చెరువు రోడ్డు, ప్రశాంతి నగర్, శిరిడీ సాయి నగర్ లో బీఆర్ఎస్ గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జల్లిపల్లి శ్రీరామమూర్తి నేతృత్వంలో జెడ్పీటీసీ పూర్వ సభ్యులు అంకత మల్లికార్జున్ రావు, ఊట్లపల్లి మాజీ సర్పంచ్ సాధు జ్యోత్స్న బాయి, టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, మండల నాయకులు తాడేపల్లి రవి, మోటూరి మోహన్, తాళం సూరి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

**నవతెలంగాణ-పాలవంచ రూరల్**

కేపీ జగన్నాథపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) దేవాలయంలో గురువారాన్ని పురస్కరించుకొని ఆలయ కార్యనిర్వహణాధికారి సుదర్శన్ ఆదేశాల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా సువర్ణ పుష్పార్చన జరిపారు. అమ్మవారికి హారతి, నివేదన, మంత్రపుష్పం, తదితర పూజలు అర్చకులచే నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, ఆలయ సిబ్బంది, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 17 గొర్రెలు మృతి

**నవతెలంగాణ- పాల్వంచ రూరల్**



పిడుగుపాటుకు 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సంఘటన మండల పరిధి బిక్కు తండా అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మున్సిపల్ పరిధి వెంగళరావు కాలనీకి చెందిన వేల్పుల పెద్దిరాజు మేతకు తన గొర్రెలను మండల పరిధి బిక్కు తండా ప్రాంతానికి తీసుకెళ్లాడు. గురువారం చోటు చేసుకున్న ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షానికి తోడు పిడుగుపాటు చోటుచేసుకుంది. అనూహ్యంగా గొర్రెలపై పిడుగు పడడంతో అక్కడికక్కడే 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. తనకు న్యాయం చేయాలని అధికార యంత్రాంగాన్ని కోరాడు.

## షార్ట్ సర్క్యూట్ తో సిలిండర్ల వాహనం దగ్ధం

**నవతెలంగాణ-టేకులపల్లి**



మండలంలో షార్ట్ సర్క్యూట్‌తో సిలిండర్ల వాహనం దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. వాహనం డ్రైవర్ కథనం ప్రకారం. ఇల్లందు పట్టణంలోని లక్ష్మీ గ్యాస్ గోడౌన్ నుండి టేకులపల్లి మండలంలోని బిల్లుడు తండా గ్రామపంచాయతీ పరిధిలో గల రామకృష్ణాపురం సమీపంలో సిలిండర్ల వాహనం డ్రైవ్ చేస్తుండగా ఇంజన్లో ఒక్కసారిగా మంటలు రావడంలో అప్రమత్తమై వెంటనే కిందికి దిగి, ట్రాలీ వాహనంలో ఉన్న సిలిండర్లను దింపుతుండగా, మంటలు చెలరేగి నాలుగు సిలిండర్లు పేలివాహనం కాలిపోయినట్లు తెలిపారు. నాలుగు సిలిండర్లు, 23 వేల రూపాయల నగదు కాలిపోయినట్లు వాపోయారు. ఇల్లందు ఫైర్ స్టేషన్ నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు అదుపు చేసిందన్నారు.

## చెక్ పోస్ట్‌ల వద్ద రికార్డులు పగడ్బందీగా నిర్వహించాలి

- పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్ కుమార్ గోపాల్

**నవతెలంగాణ-పినపాక**

పినపాక మండలం బయ్యారం క్రాస్ రోడ్ వద్ద గల ఎస్ఎస్టి చెక్ పోస్ట్ ను మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్ కుమార్ గోపాల్ (ఐఆర్ఎస్) గురువారం సందర్శించారు. చెక్పోస్ట్ వద్ద ఎస్ఎస్టి అధికారి కొమరం లక్ష్మణ్ రావ్‌ను అడిగి పలు విషయాలు తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్ పోస్ట్ ల వద్ద రికార్డులు పగడ్బందీగా నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అధిక మొత్తంలో నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కెప్టెన్ నాగార్జున, సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్పీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అబ్జర్వర్

**నవతెలంగాణ -దుమ్ముగూడెం**




ఈనెల 13న జరగనున్న నాల్గవ విడత పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని నర్సాపురం, డబ్ల్యూఎల్ రేగుబల్లి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ రచిత్ రాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం ప్రధాన ద్వారంలో స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన సీతా కుటీర ప్రదేశంతో పాటు నార చీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీవో దామోదర్ రావు, తహసీల్దార్ పి.చంద్రశేఖర్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, పర్ణశాల ఆలయ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఒండ్రు మట్టి ఎరువుతో సమానం : ఎంపీడీవో

- మల్లారం పంచాయతీలో అభివృద్ధి పనుల పరిశీలన
- పోలింగ్ బూత్ లలో సౌకర్యాలు మెరుగుపరచాలి

**నవతెలంగాణ- పాల్వంచ రూరల్**



చెరువు ఒండ్రు మట్టి ఎరువుతో సమానం, రైతులు ఈ మట్టిని పొలాలకు తోలుకోవాలని అధిక దిగుబడి పొందాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. గురువారం మారుమూల ఏజెన్సీ మల్లారం గ్రామపంచాయతీలో జరుగుతున్న చెరువు పూడిక తీత పనిని పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. చెరువు మట్టి చాలా బలమైనది, సారవంతమైనదని దీనిని మెట్ట పొలాలకు వేయడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని రైతులకు తెలియజేశారు. ట్రాక్టర్లు రైతులు సొంతగా తెచ్చుకున్నట్లైతే కూలీల కు ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ట్రాక్టర్లలో మట్టి నింపడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నర్సరీని నిశితంగా పరిశీలించారు. అనంతరం రేగులగూడెం, ఉల్వనూరు, మందరికల పాడు, కారెగట్టు, సత్యనారాయణపురం, పాయకారి యానంబైలు పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పోరండ్ల రంగా, టిపి సుజాత, గ్రామపంచాయతీ కార్యదర్శులు రణధీర్, పరశురాం, రాజు, నవీన్, నరేష్, సతీష్, బాబా, రవళి తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ(ఎం) పోరాట ఫలితమే

# భద్రాచలం అభివృద్ధి





- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- బీజేపీని ఓడించేందుకే కాంగ్రెస్‌కు మద్దతు
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- పొత్తు ధర్మాన్ని పాటించడం మా ధర్మం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
- పోతినేని సుదర్శన్ రావు
- ఐదు పంచాయతీలు తెచ్చేందుకు
- కృషి చేస్తాం : తెల్లం
- ఇండియా కూటమిదే విజయం :
- అన్నవరపు కనకయ్య
- మంత్రికి సమస్యలు ఎక్కుపెట్టిన 'మచ్చా'

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాద్ పార్లమెంటు పరిధిలో రెండు లక్షల మెజార్టీతో ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయం ఖాయమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావులు స్పష్టం చేశారు. గురువారం భద్రాచలం కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలం, పినపాక నియోజకవర్గాల సీపీఐ(ఎం) ఎన్నికల సభ కార్యకర్తలకు ఉత్సాహాన్ని ఇచ్చే రీతిలో సాగింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కాంగ్రెస్, కమ్యూనిస్టుల స్నేహం కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. భద్రాచలం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మొత్తం కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల పోరాట ఫలితమేనని గుర్తు చేశారు.

ఫాసిస్టు బీజేపీని ఓడించేందుకే రాష్ట్రంలో 16 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతునిస్తుందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బోడ వెంకట్ స్పష్టం చేశారు.

పొత్తు ధర్మాన్ని తూచా తప్పకుండా పాటించటం సీపీఐ(ఎం) కార్యకర్తలకు ఉన్న మొదటి లక్షణమని, గతంలో అది అనేకసార్లు రుజువైందని పోతినేని అన్నారు.

**బలరాం నాయక్‌తో కలిసి 5 పంచాయతీలను తిరిగి తెచ్చేందుకు కృషి చేస్తా.. : తెల్లం వెంకట్రావు**

మొదటి నుండి తమది కమ్యూనిస్టుల కుటుంబమని 2014లో సున్నం రాజయ్యని గెలిపించేందుకు తన సీటు సైతం త్యాగం చేసి సీపీఐ(ఎం) కార్యకర్తలాగా పనిచేసి, గెలిపించానని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలలో సీపీఐ(ఎం) సహకారంతో బలరాం నాయక్ గెలిచిన వెంటనే ఆయనతో కలిసి ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిస్టులతో కలిసి పని చేస్తే రెట్టింపు ఉత్సాహం కలుగుతుందని ఈ ఎన్నికలలో సీపీఐ(ఎం) సహకారంతో కాంగ్రెస్ భారీ మెజార్టీ ఖాయమని తెల్లం వెంకటరావు ధీమా వ్యక్తం చేశారు.

**కూటమికి భారీ విజయం ఖాయం.. : అన్నవరపు కనకయ్య**

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమికి భారీ మెజార్టీ రావడం ఖాయమని సీపీఐ(ఎం) జిల్లా అన్నవరపు కనకయ్య ధీమా వ్యక్తం చేశారు. మహబూబాద్ ఖమ్మం రెండు పార్లమెంటు స్థానాలలో ఇండియా కూటమి గెలుపు తథ్యమని, భారీ మెజార్టీ సాధించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టు కార్యకర్తలు మరొక మూడు రోజులు కష్టపడి పని చేయాలని కోరారు. బీజేపీ మత రాజకీయాలకు కాలం చెల్లిందని కేంద్రంలో రానున్నది లౌకిక ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

**మంత్రి సమక్షంలో నియోజకవర్గ సమస్యలను ఎక్కుపెట్టిన "మచ్చా"**

బలరాం నాయక్ ఎన్నికల సభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర సమక్షంలో భద్రాచలం, పినపాక నియోజకవర్గం తరపున కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేయాలని కోరారు. పగలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని భద్రాచలం పట్టణంలో కరకట్ట పునర్నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. భద్రాచలం పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు అందించేలాగా కృషి చేయాలని, అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రధాన సమస్యలను సభ దృష్టికి మచ్చ తీసుకొచ్చారు.

భద్రాచలం, పినపాక సీపీఐ(ఎం) ముఖ్య కార్యకర్తలు పాల్గొన్న ఈ సభలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య మాట్లాడుతూ.. కార్యకర్తను ఉద్దేశించి రానున్న ఎన్నికలలో కలిసి పనిచేసే బలరాం నాయకుని గెలిపించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల సహకారంతో కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మచారి, సీనియర్ నాయకులు ఎలమంచిలి రవికుమార్, జిఎస్ శంకర్రావు, సీపీఐ(ఎం) నాయకులు నిమ్మల వెంకన్న, బత్తుల వెంకటేశ్వర్లు, గుడిశాల రాములు, ఎలమంచిలి వంశీకృష్ణ, చంద్రయ్య, కొరసా చిలకమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూర రవిశంకర్, నల్లపు దుర్గాప్రసాద్, బుడగం శ్రీనివాస్, చింతిర్యాల రవికుమార్, లతోపాటు రెండు నియోజకవర్గాల సిపిఎం ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పించింది కాంగ్రెస్ పార్టీనే

- నాగా సీతారాములు

**నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి**

వ్యవసాయ కూలీలకు వంద రోజులు ఉపాధి కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చి కూలీలకు ఆర్థిక భరోసా కల్పించిందని పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ నాగా సీతారాములు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో ఉపాధి హామీ చట్టం కూలీలు పనిచేస్తున్న ప్రాంతానికి స్థానిక కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ నాయకులతో కలిసి ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యధిక గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలుచేస్తుందని అన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఆర్ఆర్ ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చంద్రగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరబాబు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు అజ్మీర్ మోహన్, శ్రీను, నాగయ్య పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

భద్రాచలంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయన భద్రాచలం జ్ఞాన మందిరం గుట్టపై నుండి రామాలయం వ్యూ పాయింట్‌ను తిలకించారు. దీనిలో భాగంగా ఆయన రామాలయ అధికారులతో మాట్లాడుతూ.. రామాలయ ఆలయ అభివృద్ధికి ఎన్ని ఇండ్లు డెవలప్మెంట్ లో భాగంగా తొలగించవలసి వస్తుందో లేదా.. వీలైనంత త్వరగా నివేదిక అందించాలని, అలాగే రామయ్య మాడవీధులు అభివృద్ధి కూడా మా ప్రభుత్వ హయాంలో కచ్చితంగా చేసి చూపెడతామని అన్నారు. రామాలయ కల్యాణం ప్రాంగణమైన మిథిలా ప్రాంగణంలో స్టేడియం వద్ద సోలార్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీనియర్ నాయకులు రసూల్, యశోద రాంబాబు, తోటకూరి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల రాకతో ఓటు వేస్తామన్న గిరిజనులు

- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన అధికారులు

**నవతెలంగాణ-కొత్తగూడెం**



ఆదివాసీ గిరిజనులమైన తమ సమస్యలు ప్రభుత్వం ఏండ్ల తరబడి పరిష్కరించడం లేదని, తమకు ఉపాధి కల్పించని కారణంగా మేము ఓటును బహిష్కరిస్తామని బ్యానర్లు కట్టిన సంఘటన జిల్లాలో సంచలనం రేపిందని వారు అన్నారు. దీంతో గురువారం చుంచుపల్లి మండలంలోని గరిమెళ్లపాడు ఆదివాసీ గిరిజన ప్రాంతానికి అధికారులు రావడంతో వారికి తమ గోడు విన్నవించుకున్నారు. అనంతరం ఓటు వేస్తామని గిరిజనులు తెలిపారు. ఆదివాసీ గిరిజన సమస్య అధికారులకు తెలియజేసేందుకే ఓటును బహిష్కరిస్తున్నామని బ్యానర్లు కట్టామన్నారు. అంతే తప్ప రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తాము కాదనటం లేదని అన్నారు. ముందుగా సమస్యలు అధికారులకు తెలియచేశారు. అనంతరం గిరిజనులకు అర్థమయ్యే విధంగా కొత్తగూడెం ఆర్డీవో మధు, డీఎస్పీ రెహమాన్, సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడారు. దీంతో గిరిజనులు ఈసారైనా తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని అధికారులను కోరారు. గరిమెళ్ళపాడు నర్సరీలో ఉపాధి కల్పించాలని, ఐటీడీఏలో ఉన్న భూములు తమ తాతల, తండ్రులవని, భూమి లేకపోయినా కనీసం ఉపాధి దొరికితే చాలని అన్నారు. గతంలో మేము చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి తమకు రావాల్సిన బకాయిలను గతంలో ఉన్న ఐటీడీఏ పీవో దివ్య అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు నివేదికలు ఇచ్చినప్పటికీ తమకు రావాల్సిన కోట్ల రూపాయల కూలీ డబ్బుల బకాయిలను ఇప్పించే నాయకుడు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలమైన తాము వేసుకున్న గుడిసెలకు ఇంటి నెంబర్లు కేటాయించాలని, ఈ ప్రజా ప్రభుత్వంలో తమను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూనంనేని సమక్షంలో 130 కుటుంబాలు సీపీఐలో చేరిక

- ప్రజాక్షేత్రంలో ఉండే పార్టీ సీపీఐ
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

**నవతెలంగాణ-కొత్తగూడెం**



కొత్తగూడెం సీపీఐలో పలు కుటుంబాలు చేరాయి. చేరిన వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీకి చెందిన లగడపాటి రమేష్ చంద్, తేలిక పుల్లయ్య, గంపల రవీందర్, సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మూడ్ భీమ్లా, కొర్ర శ్రీను, బాబూలాల్, కొత్తగూడెం మున్సిపాలిటీ 28, 30వ వార్డులకు చెందిన దాసరి శ్రీను, జె శ్రీనివాస్, తాడూరి రుక్మిణి, కోరి దేవి, సాగరపు వెంకటలక్ష్మి నేతృత్వంలో మూడు ప్రాంతాలకు చెందిన 130 కుటుంబాలు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సమక్షంలో చేరారు. వీరికి పార్టీకండువా కప్పి ప్రాథమిక సభ్యత్వాన్ని నాయకులు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవలందించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని, సీపీఐ సేవలను గుర్తించి ఇటీవల వందలాదిమంది వివిధ పార్టీల నుంచి సీపీఐలో చేరారని, వారి నమ్మకానికి అనుగుణంగా సమస్యల పరిష్కారంకోసం కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, జక్కుల రాములు, పిడుగు శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, పల్లపోతు సాయికుమార్, తాళ్ల వెంకటేశ్వర్ రావు, యూసఫ్, బానోత్ గోవిందు, పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**నవతెలంగాణ-పినపాక**

వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఈ.బయ్యారం గ్రామ పంచాయతీ బోటిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. వడదెబ్బతో భూమిరెడ్డి గురవారెడ్డి గురువారం సాయంతం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి కుమార్తె , కుమారుడు ఉన్నారు. గురువారెడ్డి మృతి తో బోటిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

## దుమ్ముగూడెంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**నవతెలంగాణ- దుమ్ముగూడెం**

పార్లమెంటు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని దుమ్ముగూడెం పోలీసులు పిలుపునిచ్చారు. గురువారం దుమ్ముగూడెం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి లక్ష్మీనగరం ప్రధాన కూడలి వరకు నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రదర్శనలో ఎస్సైలు కేశవ్, గణేష్ లు మాట్లాడారు.

## కాంగ్రెస్ విస్తృత ప్రచారం

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

పోలింగ్ గడువు దగ్గర పడటంతో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం ఉధృతం చేసారు. సీపీఐ(ఎం), సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్లమెంట్ ఖమ్మం నియోజక వర్గం అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేపట్టారు. పట్టణంలో పలు వీధుల్లో హస్తం గుర్తును చూపుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ రాంబాబు, చిరంజీవి, రామక్రిష్ణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

## కిన్నెరసానిని సందర్శించిన ఎలక్షన్ అబ్జర్వర్ రితిక్ రాజు

**నవతెలంగాణ-పాల్వంచ రూరల్**

పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ రితిక్ రాజు (ఐఏఎస్) గురువారం కిన్నెరసానిని సందర్శించారు. పర్యటనలో భాగంగా కిన్నెరసాని అభయారణ్య డీర్ పార్కును తిలకించారు. కిన్నెర బంధాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి బోటు షికారు చేశారు. అభయారణ్య రేంజ్ అధికారి సిహెచ్ శ్రీనివాస్ కిన్నెరసాని విశిష్టతను రితిక్ రాజుకు వివరించారు. లైజనింగ్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, మైనింగ్ ఏడి దినేష్, గ్రామీణ ఎస్సై శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హచ్చా లున్నారు.

## ఎన్నికల హామీలపై కాంగ్రెస్ పార్టీని నిలదీయండి

- అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

**నవతెలంగాణ-చంద్రుగొండ**



ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీని గ్రామాల్లో అడుగడుగునా నిలదీయాలని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం తిప్పనపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం పథకం ఎక్కడికిపోయిందని ప్రశ్నించాడు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదన్నాడు. రైతుబంధు పథకాన్ని గత ప్రభుత్వం ఎలా రైతులకు ఇచ్చింది. మీరెలా ఇస్తున్నారో ప్రజలకు తెలిసిపోయిందని ఎద్దేవా చేశాడు. మహిళలకు రూ.2500లు నెలనెలా ఇస్తామని చెప్పారని, అవి ఎక్కడిపోయాయని ప్రశ్నించాడు. పింఛన్లు రూ.4000 ఇస్తామని చెప్పారు. కానీ నెలకు పాత పెన్షనే పడుతుందని ఇది ఎన్నికల హామీలపై నిలదీయాలన్నారు. నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లే అని అన్నాడు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ నరకుళ్ల సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు లింగయ్య, మేడా మొహన్రావు, చిన్నం రామక్రిష్ణ, కళ్లేం వెంకటేశ్వర్లు, అంచ క్రిష్ణ, సయ్యద్ గఫార్మియా, అంచ సత్యనారాయణ పాల్గొన్నారు.

# నేడే అక్షయ తృతీయ మహోత్సవం

- విశ్వాసాల నేపథ్యమే..

**నవతెలంగాణ-పాల్వంచ**

అక్షింతలు అంటే ఏమాత్రం విరగని పగుళ్లు లేని గట్టిగా ఉన్న బియ్యం అని అర్థం. అది వరి లేదా గోధుమ వంటి ధాన్యాలు కావచ్చు. అటువంటి వాటితో తయారు చేసిన ఆహారాన్ని లక్షతన్నం లేదా లక్షత హారం అని పిలుస్తారు. అక్షయ తృతీయ శుభదినంగా పేరుగాంచడానికి గల కారణాలు విశిష్టమైనవి అక్షర తృతీయ పర్వదినం జరుపుకునే పండుగ రోజున చేసే ప్రతి ఫలితాన్ని ఇస్తుంది. చేసే ప్రతీ దానం ఎంతో పుణ్యాన్ని ఇస్తుంది. వైశాఖ శుద్ధ తదియ నాడు ఆచరించే ఏ వ్రతమూన జపం, హెూమమైన దానాలు అయినా తగిన ఫలితాన్ని ఇస్తాయి. ఈ ఫలితాలు అక్షయమైనటువంటివి కనుకనే ఈరోజు చేసే ధానధర్మాలకు తగిన పుణ్యం లభిస్తుందని నమ్మకం. మిగితా రోజుల కన్నా అక్షయ తృతీయ నాడు జరిపే దానం ఇచ్చే పుణ్యఫలం మనుషులకు ఎంతో మేలు చేకూరుస్తుందని భావిస్తారు. అన్నదానం చేయడం వల్ల దేవతలకు అన్నం పెట్టినంత పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. దానం కోసమే కాక ఇంటి ఉపయోగాల కోసం అక్షయ తృతీయ నాడు కందిపప్పు, బియ్యం, గోధుమలు కొనడం సుముచితం. అక్షయ అంటే నాశనం లేనిది, నిలిచిపోయేదని అర్థాలు ఉన్నాయి. అందుకని ఈ రోజున కొనుగోలు చేసే వారి ఇళ్లలో వాటికి కరువు ఇండదనే భావం. ఇమిడి ఉండి అలాగే మంచి పనులకు శ్రీకారం చుట్టాల్సిన సమయం ఇది. ఏ శుభకార్యం తలపెట్టిన ఆశించిన ఫలితాలు లభిస్తాయి. తలపెట్టిన కార్యక్రమం ఇలాంటి అడ్డంకులు లేకుండా పూర్తవుతుందని నమ్ముతారు. అక్షయ తృతీయ నాడు గృహనిర్మాణం కోసం ఇంటి స్థలం కొనడం మంచిదే. అలాగే ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన అనుకున్న సమయానికి పూర్తి శుభకార్యాలన్ని ఆరింభించవచ్చు. అంతేకాదు పిల్లల్ని పాఠశాలల్లో చేర్చడానికి అనువైన దినం పుణ్యస్థలాల సందర్శన, శుభకరమైన ఫలితాన్ని ఇస్తుందని ప్రగాఢ విశ్వాసం. ప్రజలకు అక్షయ తృతీయనాడు శ్రీ నరసింహస్వామి ప్రహ్లాదుడిని అనుగ్రహించిన రోజు అని పురాణాలు చెబుతుంటాయని నమ్ముతారు. పూజలు చేయడం తో పాటు గోదానం, భూదానం, సువర్ణదానం వస్త్రదానం చేసేవారికి సంతోషాలు చేకూరుతాయని పండితులు చెబుతున్నారు. ఏ పని చేసినా త్రికరణశుద్ధితో చేయాలి.

శ్రీ లక్ష్మీదేవిని పూజించడం పట్ల ఆసక్తి కనబరుస్తారు. భక్తులు బంగారమే కాదు వెండి వస్తువులు ఏవైనా కొనడం వల్ల సుఖ సౌభాగ్యాలు లభిస్తాయని మరో నమ్మకం. కనుక అక్షయ తృతీయనాడు బంగారం, వెండి బట్టలు ఇతర ఉపయోగకరమైన వస్తు సామగ్రి కొనుగోలు చేయడం వల్ల మేలు జరుగుతుందని ప్రజలు బలంగా నమ్ముతారు. ఈ శుభదినాన బంగారం కొంటే అష్టైశ్వర్యాలు అందించే శ్రీ లక్ష్మీదేవత ఇంట కొలువు తీరుతుందని మహిళలు ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాక ఈ రోజున ఏదైనా కొటే మూడింతలు రెట్టింపు అవుతుందని నమ్మకం. ఈ విశ్వాసాలే మహిళల బంగారం కొనడంపై ఆసక్తికి మూలం. ఈ విశ్వాసాల నేపథ్యమే అక్షయ తృతీయ ఘనంగా విభిన్న రాశులకు చెందిన వారు ఆయా దేవతలను దేవుళ్లను నిష్ఠతో పూజిస్తారు. ధన కనక వస్తు తదితర కొనుగోలుతో అక్షయ తృతీయ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.

నవతెలంగాణ
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | మే 10, 2024 | www.navatelangana.com

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పకడ్బంధీగా చర్యలు చేపట్టాలి

- ఎన్నికల అబ్జర్వర్ రచిత్ రాజ్

**నవతెలంగాణ-బూర్గంపాడు**



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఎస్ఎస్ఈ చెక్పోస్టుల వద్ద అకౌంటింగ్ బృందాలు, వీడియో సర్వేయింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తతో ఉండి పకడ్బంధీగా చర్యలు చేపట్టాలని ఎన్నికల అబ్జర్వర్ రచిత్ రాజ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ వద్ద ఎస్ఎస్ఈ చెకోపోస్టును సందర్శించారు. ఎన్నికల అబ్జర్వర్ రచిత్ రాజ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఏఎస్పీ పంకజ్ పరితోష్, ఆర్డీవో దామోదర్రెడ్డిలు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన చెక్ పోస్ట్ వద్ద రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు, మణుగూరు తహశీల్దార్లు ముజాహిద్, రాఘవరెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, మణుగూరు డీఎస్పీ రవీంధర్రెడ్డి, పాల్వంచ సీఐ వినయ్ కుమార్, ఎస్సైలు సుమన్, నాగభిక్షం, ఈవో కంది మహేష్, ఆర్ఐలు నర్సింహారావు, ముత్తయ్యలు పాల్గొన్నారు.

## దేవుడు, మతం పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టడం సిగ్గుచేటు

- బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీఏలను ఓడించండి
- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పిలుపు

**నవతెలంగాణ-ఇల్లందు**

సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు తెస్తామని హామీలిచ్చిన నరేంద్ర మోడీ వాటి గురించి మాట్లాడకుండా దేవుడు, మతం పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీఏ శక్తులను ఓడించాలని పిలుపునిస్తూ ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను పార్టీ ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ పాల్గొని మాట్లాడరు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, పట్టణ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, కునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ వాటర్ సప్లై నూతన కమిటీ ఎన్నిక

సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక స్థానిక చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో ఎన్నుకున్నారు. ఎండి ఫయాజ్ వేముల గురునాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు తెలిపారు. అధ్యక్షులుగా దుర్గ మహేష్, ఉపాధ్యక్షులుగా రాపర్తి రాజు, కార్యదర్శిగా కేశ బోయిన సదా, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, భవారియ, కోశాధికారిగా రాకేష్, అయిదుగురు కార్యవర్గ సభ్యులుగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి సమక్షంలో ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ నాయకులు కూనూరి వీరన్న, రాజేష్, సంజీవ్, నందు, పెద్ది శామ్, తోకల రవి తదితరులు పాల్గొన్నారు.

## పనులను వేగవంతం చేయండి

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

అటవీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఎఫ్‌డీఓ కె.దామోదర్ రెడ్డి స్థానిక అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అడవుల ఆక్రమణలు, పోడు నియంత్రణపై నిఘాను పటిష్టం చేయాలని చెప్పారు. మండలంలోని వినాయకపురం, కావడిగుండ్ల, అశ్వారావుపేట ఫారెస్ట్ సెక్షన్లలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌ను, పనులను తనిఖీ చేశారు. ప్లాంటేషన్ నిర్వాహణపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట రేంజర్ మురళీ, ఫారెస్టర్ సంపత్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## ఆర్థిక వితరణ

**నవతెలంగాణ-మణుగూరు**

మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థికంగా సహాయం చేశారు. ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా మణుగూరు మండలం, విప్పల సింగారం గ్రామపంచాయతీ, చెరువు ముందు సింగారం ప్రాంతానికి చెందిన పాల్వంచ వెంకన్న (58) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. వీరిది అతి నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయం తెలిసి స్పందించి ట్రస్ట్ ద్వారా పాల్వంచ వెంకన్న కుటుంబ సభ్యులకు రూ.3 వేలు దహన సంస్కారాల కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగి మల్లికార్జున్ యాదవ్, గ్రామ పెద్దలు సొడెం రవి, ఉన్నం శ్రవణ్, తేనిక బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాలోత్ కవితను గెలిపించండి

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న మాలోత్ కవిత కారు గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భద్రాచలం పట్టణంలోని పలు వార్డులలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమన్వయ కమిటీ సభ్యులు ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ వాదం చిరస్థాయిగా ఉండాలంటే పార్లమెంట్లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నరసింహారావు, రాఘవులు, ఇమామ్ కాసిం, శ్రావణి, నరసింహులు, ప్రదీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం

**నవతెలంగాణ-టేకులపల్లి**

మోడీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడి ఇండియా కుటుమిని గెలిపిద్దాం అని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రామ్ చందర్ అన్నారు. గురువారం మండలంలోని పార్టీ గ్రామ శాఖలలో మహబూబాబాద్ పార్లమెంట్ బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. సీపీఐ(ఎం), సీపీఐ, టీజేఎస్ బలపరిచిన ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలన్నారు.

## బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం

**టేకులపల్లి :** మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ గురువారం మండల కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వరుస సంఖ్య 4లో గల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతి గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బండ్ల రజినీ, నియోజకవర్గ మైనారిటీ నాయకులు అఫ్రోజ్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యా నాయక్, మాజీ మండలాధ్యక్షులు బండ్ల శ్రీనివాస్, నాయకులు నర్సింగ్ లక్షయ్య, మూడ్ సంజయ్, రావూరి సతీష్, ధర్మ రజియా, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమిని గెలిపించండి

**నవతెలంగాణ - జూలూరుపాడు**

ప్రజాస్వామ్యం సెక్యులరిజం పరిరక్షణకు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు కోరారు. సీపీఐ బలపరచిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయం కాంక్షిస్తూ సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం సీనియర్ నాయకులు ఎల్లంకి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు మతాల మధ్య చిచ్చులు పెట్టేందుకు ప్రయత్నించింది తప్పితే దేశ అభివృద్ధికి పాటుపడలేదని అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ సంపదను కార్పోరేట్ సంస్థలకు అప్పచెప్పి అంబానీ ఆదాని లాంటి కుబేరులకు ఊడిగము చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్ పరం చేసి వారిని మరింత ధనవంతులుగా చేయటంలో నరేంద్ర మోడీ కృషి చేశారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, మేడ భూషయ్య, సిరిపురవు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింత స్వరాజ్ రావుని పరామర్శించిన సీపీఐ నాయకులు

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత స్వరాజ్ రావుని సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, షేక్ నాగుల్ మీరా పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు.

## క్రీడాకారులకు రూ.50 వేల నగదు అందజేత

**నవతెలంగాణ-బూర్గంపాడు**



భద్రాద్రి జిల్లా నుంచి క్రికెట్ రంగంలో రాణిస్తున్న క్రీడాకారులు గురువిద్వాస్, రిషికేష్లకు ఐటీసీ పీఎస్‌పీడీ టీఎన్టీయూసీ అధ్యక్షులు కనకమేడల హరి ప్రసాద్ గురువారం రూ.50వేలు నగదు బహుమతి అందజేశారు. ఐటీసీ జిమ్ ట్రైనర్ నాగరాజు కుమారులు గురువిద్వాన్, రిషికేష్లు క్రికెట్ రంగంలో అద్భుతంగా రాణిస్తుండటంతో క్రీడారంగంలో మరింత ఎదగడానికి ఐటీసీ ఉద్యోగుల నుంచి తమవంతు సాయంగా ప్రతినెలా ఈసీఎస్ పద్ధతిలో కొంత మొత్తాన్ని క్రీడా కారులకు అందిస్తుండటం హర్షణీయమన్నారు. ఈ యువ క్రీడాకారులు మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఉద్యోగులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీ మంజూరైనా ప్రారంభం కాని వైనం

- ఒక విద్యా సంవత్సరం వృథా
- ఈ ఏడాదైనా విద్యా సంవత్సరం అయ్యేనా?
- ప్రచారం చేపట్టిన అధ్యాపక బృందం

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని సామెత లా ఉంది అశ్వారావుపేట నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట పరిస్థితి. నియోజక వర్గం కేంద్రం ఏర్పడి 15 సంవత్సరాలు పూర్తి అయినా నియోజక వర్గం కేంద్రం రూపు దిద్దుకోలేకపోవడం విచారకరం. ఈ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇంటర్ విద్యార్థులు దూరం వెళ్ళి విద్యనభ్యసించడం వ్యయంతో కూడుకుని ఉంది. బాలికలు అయితే ఇంటర్ తోటే విద్యకు బై బై చెప్తున్నారు. ఎట్టకేలకు



గత ప్రభుత్వంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషితో డిగ్రీ కాలేజీ మంజూరు అయినప్పటికీ గతేడాది ఆగస్టులో ఉత్తర్వులు వచ్చాయి. అప్పటి డిగ్రీ ప్రవేశాలు గడువు ముగియడంతో గతేడాది విద్యా సంవత్సరం వృథా అయింది. మరి ఈ సంవత్సరం మే 6వ తేదీ నుండే దోస్త్ (డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ) డిగ్రీ ప్రవేశాలు నోటిఫికేషన్ అమల్లోకి వచ్చింది. దీంతో అధ్యాపక బృందం సైతం క్యాంపెయిన్ ప్రారంభించారు. అశ్వారావుపేట నియోజక వర్గం వ్యాప్తంగా అన్నపురెడ్డి పల్లి, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో ప్రభుత్వం, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు నుండి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత పొంది విద్యార్థులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. బాలికలకు గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ సౌకర్యం ఉంది. కానీ బాలురుకు ఈ సౌకర్యం లేకపోవడంతో బాలురు చేరికలు అంతగా ప్రభావితం ఉండకపోవచ్చు. డిగ్రీ కళాశాలకు అనుబంధంగా బాలురు కోసం పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఒకటి వెంటనే ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతం ప్రజానీకం కోరుతున్నారు. అప్పుడే కాలేజీలో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ముక్తేవి గిరీష్ విస్తృత ప్రచారం

**నవతెలంగాణ-పాల్వంచ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు ముక్తేవి గిరీష్ ఆధ్వర్యంలో పాల్వంచలోని పలు డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్నటువంటి విద్యార్థులను కలిసి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన రామసహాయం రఘురామ్ రెడ్డికి ఓటు వేయాలని విద్యార్థులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జనరల్ సెక్రెటరీ మందడి మనోహర్ యాదవ్, జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, సోమిశెట్టి భార్గవ్ సాయి, కొత్తపెల్లి సాయికృష్ణ, వేములపల్లి సాయి ప్రదీప్, ఏనుగుల క్రాంతి, సంప్రీత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక నామ

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయం లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని పని చేయాలని ఆయన తనయుడు నామా పృథ్వీ తేజ్ సూచించారు. పార్లమెంట్‌లో 'తెలంగాణ గొంతుక నామ' మాత్రమేనని, ఖమ్మం అభివృద్ధికి నిధులు తీసుకొచ్చే సత్తా ఆయనకే ఉందని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంపై సమీక్షించారు. అపార రాజకీయ అనుభవం ఉన్న 'నామ'తోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, రావు జోగేశ్వరరావు, వగ్గెల పూజ, భూక్యా ప్రసాదరావు, చిన్నం శెట్టి వెంకట నరసింహం, యూఎస్ ప్రకాశరావు, కాసాని చంద్రమోహన్ తాడేపల్లి కవి, మందపాటి మోహన్ రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, జె.శ్రీరామూర్తి రఘురామ్, లీలా ప్రసాద్ చందా వెంకట నర్సయ్య, చిప్పనపల్లి శ్రీను, తాళం సూరి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతగా వ్యవహరించాలి

- ఎస్పీ రోహిత్ రాజు

**నవతెలంగాణ-కొత్తగూడెం**



పోలీస్ అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా భాధ్యతగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఎన్నికలలో భాగంగా మే 13వ తేదీన జరగనున్న పోలింగ్ సందర్భంగా ఇవిఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఎస్పీ మాట్లాడారు. ముఖ్యంగా రూట్ మొబైల్స్ ఇన్‌చార్జి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ విధుల పట్ల అధికారులకు, సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, డిఎస్పీలు రెహమాన్, చంద్ర భాను, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, సీఐలు, ఎస్సైలతో పాటు రూట్ మొబైల్స్ ఇన్‌చార్జి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యం..

- సీపీఐ(ఎం) నేత భూక్యా వీరభద్రం

**నవతెలంగాణ-వైరాటౌన్**



బీజేపీని గద్దెదించడమే ఇండియా కూటమి లక్ష్యం అని సీపీఐ(ఎం) నేత భూక్యా వీరభద్రం అన్నారు. గురువారం మండలం పరిధిలోని లక్ష్మీపురం, సిరిపురం, పూసలపాడు, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం, ఖానాపురం, గన్నవరం, కొండకొడిమ, రెబ్బవరం తదితర గ్రామాల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా వీరభద్రం, సీపీఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరావుతో కలిసి విస్తృతంగా పర్యటించి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. దేశాన్ని సర్వనాశనం చేసిన బీజేపీని గద్ద దించడమే లక్ష్యంగా ఇండియా కూటమి కృషి చేస్తుందని, కూటమికి మద్దతుగా ప్రజలు ఓట్లేసి కాంగ్రెస్ అభ్యర్థి రామసాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీ నాయకులు, విప్పలమడక మాజీ సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, కొల్ల వెంకటేశ్వరరావు, దేవభక్తిని అర్జున్‌రావు, వీరభద్రం, నల్లమల్ల కోటేశ్వరరావు, బొమ్మిడాల ముత్తయ్య, బాణాల శ్రీనివాసరావు, బాణాల కృష్ణమాచారి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ జానీమియా, ఎంపీటీసీ సభ్యురాలు మాగంటి సుందరమ్మ, మాగంటి తిరుమలరావు, శీలం వెంకటరెడ్డి, శీలం విష్ణువర్ధన్‌రెడ్డి, జగ్రిపోతుల పుష్పరాజ్యం, తుము సుధాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ గెలిస్తే.. రాజ్యాంగం రద్దు

- ఇండియా కూటమిని గెలిపించాలి
- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా

**నవతెలంగాణ-ఖమ్మం**




పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రమాదం ఉందని సిపిఐ (యంయల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. గురువారం ఖమ్మంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నూనవత్ వీరునాయక్, రమేష్ రాజా మాట్లాడుతూ బీజేపీ 400 సీట్లు గెలిపించాలని అడుగుతుందని, 2, 3 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారని చెప్పారు. ఓటమి భయంతో మోదీ అసహనంతో మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఆయనపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశాన్ని మతరాజ్యంగా మార్చేందుకు మోదీ, బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్ర జేస్తోందని విమర్శించారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, ప్రజల హక్కులను కాపాడేందుకు ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో 17 సీట్లలో ఇండియా కూటమి (కాంగ్రెస్) ను బలపరుస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు శ్రీను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### పంట పొలాలలో మట్టి నమూనాలు సేకరణ

**నవతెలంగాణ-కూసుమంచి**

మండలంలోని ఈశ్వరమాదారం గ్రామంలో రైతులకు మట్టి నమూనా సేకరణ విధానంపై అవగాహన కార్యక్రమం, క్షేత్ర ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి మాట్లాడుతూ... ఈ వేసవికాలం మట్టి నమూనా సేకరణకు అనుకూలమైనదని, మట్టి నమూనాను చెట్ల కింద కానీ గట్ల దగ్గర కానీ సేకరించకూడదని, క్వార్టరింగ్ పద్ధతిలో మట్టి నమూనా ఏ విధంగా సేకరించాలి, దాని ఉపయోగాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకన్‌గూడెం ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

### ధైర్యశాలి సంగ బత్తుల వెంకటరెడ్డి

**సంస్మరణ సభలో సీపీఐ నేతలు**

**నవతెలంగాణ-కూసుమంచి**

ఎన్ని కష్టాలు వచ్చినా ఎర్రజెండాని వదలని ధైర్య శాలి సంగబత్తుల వెంకటరెడ్డి అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు అన్నారు. గురువారం మండలంలోని గైగోళ్ళపల్లి గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు సంగబత్తుల వెంకటరెడ్డి సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండెపొంగు మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వెంకటరెడ్డి చిత్రపటానికి సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పూలమాలలేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడారు. తన చిరుప్రాయంలో 12 సంవత్సరాల వయసులో కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షతుడు అయిన నాటినుండి 97 సంవత్సరాల కాలంలో మరణించేంత వరకు కూడా సిపిఐని వదలకుండా పోరాడిన ధైర్యశాలి ధీరుడు సంగబత్తుల వెంకటరెడ్డి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మహమ్మద్ మౌలానాలి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, అజ్మీర రామ్మూర్తి, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, కర్నాటి భాను ప్రసాద్, మెడకంటి వెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కోరట్ల పాపులు, సంగ బత్తుల వెంకటరెడ్డి కురుమారులు వినోధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి సీపీఐ మండల కార్యదర్శి భూక్య నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### డీఆర్డీఏ నూతన కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో డీఆర్డీఏ ఉద్యోగులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ హెడ్ క్వార్టర్స్ 80 మంది ఉద్యోగులతో ఉన్న డీఆర్‌డీఏ, ఐకెపి-సెర్ప్, ఈజీఎస్ అవుట్ సోర్సింగ్ తదితర అన్నిరకాల క్యాడర్లతో నూతన ఆడ్ హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మామునూరి రాజేశ్వరరావు ( రాజేష్), ప్రధాన కార్యదర్శిగా జంగం లక్ష్మణ్‌రావు, కోశాధికారిగా నోముల పద్మ, ఉపాధ్యక్షులుగా ఎస్. రేవతి, జె.విజేత, కే.కిరణ్ రాయ్, సహాయ కార్యదర్శులుగా నెల్లూరు అనూప్, ఎం.సతీష్, కే.శ్రీనివాస్, న్యాయ సలహాదారులుగా బానోత్ దర్గయ్య, లింగాల జ్యోతి ప్రసన్న, గౌరవ సలహాదారులుగా దొడ్డ శ్రీనివాస్, జీవీ. రంగారావు, మహిళా ప్రతినిధులుగా వీ.పద్మావతి, ఆర్.సుస్మిత, ఎండి.ముజీబున్నిసా, బానోత్ స్రవంతి, ప్రచార కార్యదర్శులుగా ం.శ్రీనివాస్, వీ.నవీన్ కుమార్, జే.సరస్వతి, బీ.గోపిలాల్, కార్య నిర్వాహక సభ్యులుగా బీ.పవన్, జె.వెంకటనారాయణ, టీ.మాధవరావు తదితరులు ఎన్నుకున్నారు.

### నా గెలుపు ముదిరాజుల అభివృద్ధికి మలుపు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ, ఎంపీ వద్దిరాజు

**నవతెలంగాణ-ఖమ్మం**



తనను గెలిపించి, పార్లమెంట్‌కు పంపిస్తే ముదిరాజుల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం ఖమ్మంలోని కోణార్క్ హొటల్‌లో కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత ఆధ్వర్యంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ముదిరాజులతో బీసీ సోదరులతో మంచి అనుబంధం ఉందని చెప్పారు. తాను గెలిచిన తర్వాత వారి సమస్యలపై పార్లమెంట్ లో ప్రస్తావిస్తానని చెప్పారు. కేసీఆర్ బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, జిల్లాకు చెందిన బీసీ వద్దిరాజు రవిచంద్రను రెండోసారి రాజ్యసభకు పంపించిన ఘనత కేసీఆర్ ది అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ కిషోర్ బాబు, పిట్టల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణకు కాంగ్రెస్ అవసరం'

**నవతెలంగాణ-ఖమ్మం**

మన దేశం, మన రాజ్యాంగం, మన ప్రజాస్వామ్యం పరిరక్షణకు, ప్రజాపాలనకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరం ఎంతో ఉందని జమియత్ ఉలేమా ఏ హింద్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మి, ముఫ్తి జలాలుద్దీన్, ప్రముఖ విద్యావేత్త న్యాయ నిపుణులు మహమ్మద్ అసద్ అన్నారు. గురువారం ఖమ్మంలోని ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక అవినీతి, అక్రమాలు ప్రతి సందర్భంగా మతోన్మాద చర్యలు, విభజన, విచ్ఛిన్నతర కుట్రలు, కుతంత్రాలు గత పది ఏళ్ల నుండి అమలు చేస్తున్న బిజెపికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని, ప్రస్తుతం ఈనెల 13న జరగనున్న లోక్ సభ పోలింగ్‌లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జమియత్ ఉలేమా ఏ హింద్ జిల్లా ఉపాధ్యక్షులు మౌలానా ముజాహిద్, మౌలానా అబ్దుల్ సత్తార్ ఖాస్మీ, మౌలానా అబ్దుల్ ఘని, ముఫ్తి అబ్దుల్ రౌఫ్, హాఫీజ్ జమీల్ అహ్మద్, హాఫీజ్ జక్కీ ఉల్లా, మౌలానా అబ్దుల్ అలీమ్ అతర్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

### నాన్నను ఆశీర్వదించి గెలిపించండి

**నామ తనయులు పృథ్వీతేజ, భవ్యతేజ**

**నవతెలంగాణ-ముదిగొండ**

ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తన తండ్రి నామ నాగేశ్వరరావును మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని నామ తనయులు పృథ్వితేజ, భవ్యతేజ ఓటర్లను కోరారు. మండల కేంద్రమైన ముదిగొండలో గురువారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు నామ నాగేశ్వరావు అన్నారు. పదేండ్ల కాలంలో నామ నాగేశ్వరావు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మూడోసారి పార్లమెంటుకు పంపిస్తే జిల్లాకు రావలసిన నిధులపై కొట్లాడుతారన్నారని చెప్పారు. తొలుత నామ తనియులకు ముదిగొండలో బీఆర్ఎస్ నేతలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రహదారి పక్కన ఉన్న బజ్జీలు కొట్టు వద్ద వారు బజ్జీలు వేస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎర్ర వెంకన్న, ఎస్కే.ఖాజా, బంక మల్లయ్య, కోటి అనంత రాములు, తోట ధర్మారావు, నామ తమ్ముడు కుమారుడు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**నవతెలంగాణ-వైరాటౌన్**

మండల పరిధిలోని పాలడుగు గ్రామానికి చెందిన యూత్ సభ్యులు సోషల్ మీడియాలో చేయి చేయి కలిపి పేదవారికి సహాయం చేద్దాం అనే వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సుమారు 5000 రూపాయలు విరాళాలు సేకరించి గురువారం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా విరాళాలు సేకరించి పేదలకు సహాయం చేసిన వారిని గ్రామస్తులు అభినందించారు. సహాయం పొందిన వారు గ్రూపు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలడుగు గ్రామ యూత్, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

ఈనెల 13వ తేదీన జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎర్రుపాలెం మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపా ధ్యక్షుడు, రాజుపాలెం ఎంపీటీసీ దోమందుల సామేలు ఆధ్వర్యంలో గురువారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ తెలుగుదేశం నాయకుడు గూడూరు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయక పోవడంతో మండల తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటు అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ఆదేశాల మేరకు బీజేపీకి మద్దతు ఇచ్చి తెలుగుదేశం పార్టీ ఓట్లు కమలంకు వేసే విధంగా తీర్మానం చేశారు. ఈ స మావేశంలో ప్రతి కార్యకర్త తమ అభిప్రాయాలను తెలియజేశారు. అనంత రం తెలుగుదేశం నాయకులు బీజేపీ మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల అయ్యేవరకు కలిసి పని చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గురజాల సత్యనారాయణ, అయ్యవారిగూడెం సర్పంచ్ గోసు రామారావు, బండారు అప్పారావు, వంకాయలపాటి జగన్, ఎర్రమ ల కిషోర్ రెడ్డి, చాట్ల బాబురావు, వరికుటి రవి, శీలం నాగిరెడ్డి, వాసిరెడ్డి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

### పెప్పర్ స్ప్రే చల్లి బంగారు గాజులు చోరీ

**నవతెలంగాణ-తల్లాడ**

మండల కేంద్రమైన తల్లాడ నేరెళ్ల సర్వయ్య కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న నేరెళ్ల రాధ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి అగంతకుడు మూడు బంగారు గాజులను చోరీ చేసినట్లు నేరెళ్ల సుధాకర్ గురువారం తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం ప్రకారం బుధవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో అగంతకుడు ఇంట్లోకి చొరబడి పెప్పర్ స్ప్రే జల్లి చేతికి ఉన్న మూడు బంగారు గాజులను దొంగిలించాడని, వాటి విలువ 1,5000 ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఎస్సై బీ.కొండలరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ



## బదిలీ అయిన టీచర్లను ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలి

- యూఎస్‌పీసీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత అక్టోబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మల్టీజోన్-2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరింది. యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యు పోచయ్య అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, పి నాగిరెడ్డి, టి లింగారెడ్డి, జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావు, ఎస్ హరికిషన్, వి శ్రీను నాయక్, బి కొండయ్య, వై విజయకుమార్, టి లక్ష్మారెడ్డి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ విషయంలో ఉపాధ్యాయులకు స్పష్టతనివ్వడంలో విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శులను కలిసి విద్యాశాఖ కమిషనర్‌పై ఫిర్యాదు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఎన్‌సీటీఈ అధికారులతో ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటు చేయించి టెట్‌పై స్పష్టత ఇప్పించటానికి కృషిచేసిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించామని పేర్కొన్నారు. బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలనీ, ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలనీ, మోడల్ స్కూళ్లను విద్యాశాఖ పరిధిలోకి తీసుకుని 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని సూచించారు. గురుకులాలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేనాటికే పాఠశాలల్లో విద్యావాలంటీర్లను, పారిశుధ్య కార్మికులను నియమించాలనీ, ఉచిత విద్యుత్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలను కల్పించాలనీ, అన్ని నియోజకవర్గాల్లో ఒకే విధమైన పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

- ప్రేమికురాలితో మనస్పర్థలు
- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్

ప్రేమికురాలితో మనస్పర్థలు రావడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ ప్రాంతానికి చెందిన ఇమేజ్ పాటేల్ (28) రాజేంద్రనగర్‌లోని పరమారెడ్డి హిల్స్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి అత్తాపూర్ ప్రాంతానికి చెందిన యువతితో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. కాగా, ఇటీవల ఇమేజ్ వేరే అమ్మాయితో మాట్లాడున్నాడని ప్రేమికురాలు అతనిపై అనుమానం వ్యక్తం చేసింది. ఈ విషయమై ఫోన్‌లో వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన యువకుడు.. తాను ఉరేసుకుని చనిపోతానని ప్రేమికురాలికి చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే ఆమె తన స్నేహితుడైన కృష్ణకాంత్‌కు జరిగిన విషయం చెప్పి ఇమేజ్ ఇంటికి వెళ్లి చూడాలని చెప్పింది. కృష్ణకాంత్ వెంటనే వెళ్లి చూడగా అప్పటికే ఇమేజ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణకాంత్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మున్నేరులో ముగ్గురు బాలురు మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మున్నేరులో పడి ముగ్గురు చిన్నారులు ప్రాణం కోల్పోయారు. ఈ విషాద ఘటన ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల సమీపంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం మమత రోడ్డులోని రామచంద్రయ్య నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ఆముదాల చిరంజీవి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మున్నేరులో చేపలు పట్టేందుకు చిరంజీవి తన ఇద్దరు కుమారులు లోకేశ్(14), హరీశ్(12), వారి ఇంటి పక్కనే ఉండే బానోత్ గణేశ్ (14)తో కలిసి వెళ్లారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి కోసం గుదిమళ్ల-దంసలాపురం గ్రామాల మధ్య మున్నేరుపై వంతెన నిర్మాణ పనులు జరుగుతు న్నాయి. వంతెన పిల్లర్ల కోసం మున్నేరులో గుంతలు తవ్వారు. ఆ గుంతలో చేపలు పట్టేందుకు నలుగురూ దిగారు. చిరంజీవి ఓ వైపున ఉండి చేపలు పడుతుండగా, మరోవైపు అవతలి ఒడ్డున ముగ్గురు బాలురులు ఈతకొడుతున్నారు. పిల్లర్ కోసం తవ్విన గుంత లోతుగా ఉండటాన్ని గమనించని చిన్నారులు అందులో మునిగిపోయారు. చిరంజీవితో పాటు, కొంత దూరంలో చేపల వేటకు వచ్చిన స్థానికులు వెంటనే గల్లంతయిన వారి కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అందరూ కలిసి గాలింపు చేపట్టగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక, స్థానిక పోలీసులు సందర్శించారు. మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లోకేశ్ భద్రాచలంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేశాడు. హరీశ్ ఖమ్మం రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేశాడు. బానోత్ గణేశ్ స్వగ్రామం రఘునాథపాలెం మండలం రాంక్యాతండా. గణేష్ కుటుంబం కొంత కాలంగా ఖమ్మం మమత రోడ్డులోని రామచంద్రయ్యనగర్‌లో గుడిసె వేసుకొని నివాసం ఉంటోంది. గణేశ్ చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి కళావతి రోడ్డుపక్కనే రాగి జావ విక్రయిస్తూ కుమారుడిని చదివించేది. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదం జరగడం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

## మోడీ కుర్చీ కదులుతున్నది

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని ప్రశ్నించారు. దీనికి కౌంటర్‌గానే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. మోడీ వ్యాఖ్య ఎన్నికల ఫలితాలకు నిజమైన సూచిక అని పేర్కొన్నారు. మోదీజీ కుర్చీ వణుకుతున్నట్టు ఇది చూపిస్తున్నదని ఖర్గే ఎక్స్‌లో వివరించారు. ప్రధాని సాధారణంగా ఇద్దరు వ్యాపారవేత్తల గురించి రహస్యంగా మాట్లాడతారనీ, బుధవారం నాటి ర్యాలీలో వారి పేర్లను అతను బహిరంగంగా పెట్టటం ఇదే మొదటిసారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. వారు (అంబానీ, అదానీ) డబ్బులిస్తారన్న వాదన మీకు వ్యక్తిగత అనుభవమా? అని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీలను పంపి వారిని వీలైనంత త్వరగా విచారించాలనీ, ఇందులో భయపడొద్దని చెప్పారు. అదానీ, అంబానీలకు మోడీ ఇచ్చిన డబ్బును భారత్‌లోని పేదలకు తాము ఇస్తామని స్పష్టం చ ఏశారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రెటరీ జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోడీ తన ఎన్నికల ఓటమిని చూసి కంగారుపడి ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు పారిశ్రామికవేత్తల వద్ద నల్లధనం మూటలు ఉంటే అదానీ, అంబానీలకు చెందిన గుత్తేదారులపై సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ఆయన ప్రశ్నించారు.

ఇతర ప్రతిపక్ష నేతలు కూడా మోడీ ఆరోపణలపై విమర్శలు గుప్పించారు. నల్లధనాన్ని అరికట్టటంలో నోట్ల రద్దు విఫలమైందనటానికి ప్రధాని వ్యాఖ్యలే నిదర్శనమని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల(ఈబీ) ద్వారా బీజేపీకి విరాళాలు ఇచ్చిన వారిలో అదానీ కంపెనీల ప్రస్తావన లేదని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ సాకేత్ గోఖలే ఆరోపించారు.

# ఎన్డీఏ కూటమికి 200 సీట్లు దాటవు

- టీమిండియాదీ అదే పరిస్థితి
- ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర
- బీఆర్ఎస్ 16 గెలిస్తే తెలంగాణ ప్రయోజనాలకు భరోసా : మాజీమంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికైనా, టీమిండియాకైనా 200 సీట్లు దాటవనీ, ఏ కూటమికి మెజార్టీ సీట్లు రావని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేతజగదీశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే పార్టీ అనీ, బీజేపీ, కాంగ్రెస్‌లకు ఇతర రాష్ట్రాల ప్రయోజనాల ముందు తెలంగాణ ప్రయోజనాలు పట్టవని విమర్శించారు. రాష్ట్రానికి అటు, ఇటు ఉన్న రాష్ట్రాల్లో తమ ప్రాబల్యం కోసం తెలంగాణ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిన సందర్భాలున్నాయని ఉదహరించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 16 సీట్లు బీఆర్ఎస్ గెలిస్తే ... ఇక తెలంగాణ ప్రయోజనాలకు ఢోకా ఉండదని చెప్పారు.

ఇప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ బలంగా ఉందనీ, కేసీఆర్ బలమైన నేతగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలకు పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి నేతలను తీసుకుని టికెట్లు ఇచ్చారని చెప్పారు. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ డెలివరీ చేసుకునే స్థాయికి వైద్యరంగాన్ని తీసుకెళ్లారనీ, గురుకులాలతో పేదలకు మెరుగైన విద్యనందించారని గుర్తు చేశారు. అలాగే వ్యవసాయ, దాని అనుబంధ రంగాలను అభివృద్ధి చేసి ఆకలికేకల తెలంగాణను అన్నపూర్ణ తెలంగాణగా మార్చారని చెప్పారు. అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అధికంగా ఆశలు చూపించి, అధికారంలోకి వచ్చిన మొదటిరోజు నుంచి మోసం చేయడం మొదలు పెట్టిందని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ మోసాలను గ్రహించి పార్లమెంటులో బీఆర్ఎస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని జగదీష్ రెడ్డి ఆరోపించారు.రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు కేంద్రంలో ఉన్న బీజేపీ సహకరించలేదని తెలిపారు.కాళేశ్వరం నివేదికను కేంద్రం లీక్ చేసి సహకరించిందని ఉదహరించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర విషయాలను ముందుకు తెచ్చి తాగునీరు, విద్యుత్ సమస్యలను చర్చకు రాకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. మైనార్టీలకు రిజర్వేషన్ల తొలగింపును సమర్ధించేంది లేదని స్పష్టం చేశారు. యస్ఎల్‌బీసీని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ తొమ్మిదేండ్ల పాలన లో ఎందుకు పూర్తి చేయలేదని పోయిందని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే...కాంగ్రెస్ అలవి కాని హామీలను ఇచ్చి మోసం చేసిందే కాకుండా... ఆ నెపాన్ని కేంద్రంపై నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తున్నదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రజలకు ఉపయోగపడని చెత్త మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

### రేవంత్ రెడ్డిని ఎందుకు వదిలేశారు?

**- మోడీకి సూటి ప్రశ్న**

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి డబ్బుల సంచులు మోస్తున్నారని ఆరోపిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ తదితర దర్యాప్తు సంస్థలు ఎందుకు మిన్నకుండిపోయాయో ప్రధాని వివరణ ఇవ్వాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇద్దరూ ఒక్కటయ్యారనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

## ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలి

- సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలి : పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



నవతెలంగాణ-చండూరు

మతోన్మాద బీజేపీ కేంద్రంలో అధికారంలోకొచ్చాక ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం నల్లగొండ జిల్లా చండూరు మున్సిపల్ పట్టణంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పూటకో పార్టీ మార్చే నాయకులను ఓడించాలన్నారు. మునుగోడు నియోజకవర్గ వెనుకబాటుకు కారణం గత పాలకులే అని చెప్పారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలు, సాగు, తాగునీరు కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో ఇండ్ల స్థలాల కోసం, కార్మికుల కోసం, గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడింది సీపీఐ(ఎం) అని గుర్తు చేశారు. అందువల్ల సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు.

భారత రాజ్యాంగాన్ని మార్చి, ఆ స్థానంలో మనుధర్మాన్ని తిసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశపెట్టడం కోసం బీజేపీ కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని మార్చడమే ధ్యేయంగా బీజేపీ పని చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ రద్దు, జ్యోతిష్యశాస్త్ర అమలు, విద్యా కాషాయీకరణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, వారిని లొంగదీసుకోవడం, మేధావులను జైళ్లలో పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చట్టసభల్లో కమ్యూనిస్టుల బలం పెరగాల్సి ఉందని, ఇక్కడి నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, నాయకులు జెర్రిపోతుల ధనుంజయగౌడ్, బొట్టు శివకుమార్, చిట్టిమల్ల లింగయ్య, ఎండి సలీం, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, కొల్లు రవి, సైదులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణకు గొంతెత్తి నినదించాలి

- అమలు కాని రాజ్యాంగ పీఠికలోని అంశాలు : రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్




నవతెలంగాణ-మిర్యాలగూడ

రాజ్యాంగ పీఠికలో ఉన్న అంశాలు ఏ ఒక్కటి కూడా ప్రస్తుతం అమలు కావడం లేదని.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ రక్షణ కోసం ప్రజలు గొంతెత్తి నినదించాల్సిన అవసరం ఉందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఐఎంఏ హాల్ రామచంద్రగూడలో జనవిజ్ఞాన వేదిక నాయకులు డా.ముమ్వా రామారావు అధ్యక్షతన'పదేండ్ల కేంద్ర పాలనలో ప్రజాజీవితం.. దేశ భవిష్యత్' అనే అంశంపై టీపీజే ఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ మౌలికసూత్రాలకు లోబడి పరిపాలించాల్సిన పాలకులు.. వాటిని విస్మరిస్తున్న విషయాన్ని ప్రజలు గమనించా లని కోరారు. డాక్టర్ ముమ్వా రామారావు మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగమే ఐకాన్ అని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉండాలని అన్నారు. మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, టీపీజాక్ నాయకులు రవీందర్ మాట్లాడుతూ.. దేశంలో పేదరికం, నిరుద్యోగ నిర్మూలన, ఆదాయ సమానతలకు చర్యలు తీసుకోవాల్సిన పాలకులు అసమానతలు పెంచే కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ రాజు, బీసం రామయ్య, వేనేపల్లి పాండు రంగారావు, జ్వాల వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నాయకులు డబ్బికార్ మల్లేశ్, రావినాయక్, జనవిజ్ఞాన వేదిక నాయకులు కొండల్‌రెడ్డి, సుదర్శన్, మౌసమ్ హుస్సేన్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

# రివర్స్ గేమ్

(మొదటిపేజీ తరువాయి)

దేశం. రెండోదేమో 'పేదల దేశం' అని చెప్పారు. దేశంలో ఇద్దరు బిలియనీర్లు ఉన్నారని, వారి ఆస్తులు అనేక రెట్లు పెరిగిపోయాయని భారత్ జోడో యాత్ర సందర్భంగా కూడా రాహుల్ చెప్పారు.

తదుపరి ప్రభుత్వాన్ని ఎన్నుకోబోయే ముందు అదానీ, అంబానీల గురించి ప్రజలు తీవ్రంగా ఆలోచించాల్సి ఉంటుందని మోడీ సరిగానే చెప్పారు. మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు బడా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దేశించినవేనని ఈ సంవత్సరం ప్రారంభంలో ఇండియా టుడే పత్రిక నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్‌లో 52 శాతం మంది అభిప్రాయపడ్డారు.

### వారి సంపద పెరిగిపోతోంది

గత పది సంవత్సరాల కాలంలో అదానీ, అంబానీల సంపద గణనీయంగా పెరిగింది. కోవిడ్ కాలం సైతం ఇందుకు మినహాయింపు కాదు. ఆ సమయంలో ఆర్థిక వృద్ధి స్తంభించిపోయింది. లక్షలాది మంది ప్రజలు జీవనోపాధి కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అంబానీ ఆసియాలోనే సంపన్నుడు. అదానీది రెండో స్థానం. ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన పదిహేను మంది జాబితాలో వీరిద్దరి పేర్లూ ఉన్నాయి. మరోవైపు కుటుంబాల్లో పొదుపు తగ్గిపోతోంది. వాస్తవ వేతనాలు పడిపోతున్నాయి. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది.

### అదానీ గ్రూపుపై చర్యలేవి?

వాటాల విలువను పెంచుకునేందుకు స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు అనేక అవకతవకలకు పాల్పడిందంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ వెల్లడించి పదిహేను నెలలు గడిచాయి. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై సెబీ దర్యాప్తు జరిపింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. హిండెన్‌బర్గ్ తర్వాత పలువురు ఫైనాన్షియల్ జర్నలిస్టులు కూడా అదానీ గ్రూపు అక్రమాలు, అవకతవకలను బయటపెట్టారు. అవకతవకలు జరిగాయని సెబీ నిర్ధారించినప్పటికీ ఇప్పటి వరకూ ఆ గ్రూపుపై పెద్దగా చర్యలేవీ తీసుకోలేదు.



### మహువా, రాహుల్ ఉదంతాలలో...

తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రాను లోక్‌సభ నుండి బహిష్కరించినప్పుడు ప్రతిపక్షాలు మండిపడ్డాయి. పార్లమెంటులో ఓ ప్రశ్నను లేవనెత్తినందుకే మోడీ ప్రభుత్వం ఆమెను లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపణలు వచ్చాయి. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మొయిత్రా సభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిని ఇష్టపడని మోడీ సర్కారు ఆమెను సభ నుండి బయటికి పంపింది. మొయిత్రా అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నేటి వరకూ సమాధానం చెప్పలేదు. అదానీ గ్రూపుపై ఆరోపణలు చేసినందునే తనపై అనర్హత వేటు వేశారని, ఆ గ్రూపునకు వ్యతిరేకంగా ప్రసంగాలు చేసినందుకు తనపై పరువునష్టం కేసు వేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా చెప్పారు.

### కార్పొరేట్ ప్రయోజనాల కోసం...

ఈ ఉదంతాలను గమనిస్తే అంబానీ, అదానీలకు కొమ్ము కాస్తోంది ఎవరో అర్థమవుతుంది. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం అహరహం శ్రమిస్తున్న మోడీ ప్రభుత్వం, ఎన్నికల వేళ ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై రుద్దేందుకు ప్రయత్నిస్తోంది. వాస్తవాలు ప్రజలందరికీ తెలిసినవే అయినప్పటికీ నవ్విపోదురు గాక...అన్న చందంగా వ్యవహరిస్తోంది.

అదానీ, అంబానీలకు ఇంత ప్రాచుర్యం ఎందుకు లభిస్తోంది? ఎందుకంటే మోడీ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు కార్పొరేట్ ప్రయోజనాల కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నారని పరిశీలకులు గుర్తు చేశారు. వివాదాస్పద వ్యవసాయ చట్టాలు, విమానాశ్రయాల ప్రయివేటీకరణ, మైనింగ్ నిబంధనల్లో మార్పులు వంటివి ఇందులో భాగమే.

## రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం

- కపిలవాయి దిలీప్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేస్తున్నదని టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ విమర్శించారు. మోడీ సర్కారు రాష్ట్రాల హక్కులను హరిస్తూ...వాటిని నిర్వీర్యం చేస్తున్నదని వాపోయారు. పంచాయతీరాజ్ చట్టంలోని గైడ్‌లైన్స్‌ను కేంద్రం పాటించడం లేదన్నారు.గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ మంత్రి పుష్పలీల, డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామపంచాయతీ నిధులపై కేంద్రం అజమాయిషీ చేస్తున్నదని విమర్శిం చారు.బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాలకు హక్కులు ఉండబో వన్నారు.దేశంలో బీజేపీకి రెండువందల సీట్లకు మించి రావన్నారు. మోడీ గ్రాఫ్ వంద శాతం పడిపోయిందని పుష్పలీల ఎద్దేవా చేశారు. ఓడిపోతా మన్న ఫ్రస్టేషన్‌లోనే మోడీ, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

## ప్రజ్వల్ కోసం మోడీ ప్రచారం దుర్మార్గం

- ఏఐసీసీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రేపిస్టు ప్రజ్వల్ రేవణ్ణ కోసం ప్రధాని మోడీ ప్రచారం చేయడం దుర్మార్గమని ఏఐసీసీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ అన్నారు. వేల మంది మహిళలను బలత్కారం చేశారనీ,వారి వీడియోలను చిత్రీకరించారని గుర్తు చేశారు.మహిళా క్రీడాకారులను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ కుటుంబానికి లోక్‌సభ సీటును బీజేపీ ఇచ్చిందని విమర్శిం చారు.ఈ విషయమైన మహిళలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జాతీయ అధికార ప్రతినిధి సుజాతపాల్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావుతో కలిసి అల్కాలంబ విలేకర్లతో మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఈసందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.బీజేపీ, ఆర్ఎస్ఎస్ మహిళలను వంటింటికే పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా రిజర్వేషన్లు ఎత్తివేయాలని బీజేపీ పన్నాగం పన్నుతున్నదని తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా కోసం మహాలక్ష్మి రూ.500కు గ్యాస్,ఆరు గ్యారంటీ స్కీములు అమలు చేస్తున్నాయన్నారు.కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు.మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు.అదానీ,అంబానీలకు మోడీ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు.దేశంలో ప్రజాస్వామ్యం ఉండాలన్నా...మహిళలకు రక్షణ కావాలన్నా...కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## కేటీఆర్ స్టేజిపైకి ఉల్లిగడ్డలు, టమాటాలు

- ఓ వర్గం దాడి
- బైంసాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య కొనసాగిన కేటీఆర్ ప్రసంగం

నవతెలంగాణ- బైంసా

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బైంసాలో గురువారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచార కార్యక్రమంలో ఓ వర్గానికి చెందిన వారు దాడి చేశారు. కేటీఆర్ రోడ్ షో స్థలానికి చేరుకోకముందే స్టేజి వద్దకు పెద్ద మొత్తంలో వారు చేరుకున్నారు. కేటీఆర్ రాగానే ఫ్లెక్సీలు ప్రదర్శించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. శ్రీరాముని జోలికొస్తే ఊరుకునేది లేదు.. ఖబర్దార్ అంటూ నినదించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ కేటీఆర్ ప్రసంగిస్తుండగానే ఉల్లిగడ్డలు, టమాటాలు విసిరారు. ఒక దశలో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే కేటీఆర్ ప్రసంగాన్ని కొనసాగించారు. కేటీఆర్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దాడికి పాల్పడుతుంటే పోలీసులు అసలు ఉన్నారా ప్రశ్నించారు.

## శ్యాం పిట్రోడా రాజీనామా ఓ డ్రామా

- అవి ఆయన మాటలు కాదు కాంగ్రెస్‌వే : ఎంపీ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ముఖ్య నేత శ్యాం పిట్రోడా రాజీనామా ఓ డ్రామా అనీ, నష్టనివారణ చర్యల్లో భాగమేనని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఈశాన్య భారత్ ప్రజలను చైనీయులతో, ఉత్తర భారత్ ప్రజలను శ్వేతజాతీయులతో, దక్షిణ భారతీయులను ఆఫ్రికన్లతో పోల్చుతూ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదనీ, అవి కాంగ్రెస్ పార్టీవేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలనీ, ఆయన్ను దేశబహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పిట్రోడా రాజీవ్‌గాంధీ కుటుంబానికి దగ్గరివాడనీ, రాహుల్‌గాంధీకి వ్యక్తిగత సలహాదారుడని చెప్పారు. దేశ వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే నాయకులకు కాంగ్రెస్ టికెట్లు ఇవ్వడం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మోడీ వికసిత్ భారత్ నినాదాన్ని ఇస్తుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం విభజిత్ భారత్ నినాదాలిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కంటే నెహ్రూ పాత్ర ఎక్కువ ఉందని శ్యాం పిట్రోడా మాట్లాడితే కాంగ్రెస్ ఎందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొత్తగా చేరారనీ, ఆయన ఆ పార్టీ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాహుల్ గాంధీ కి పాకిస్తాన్ మద్దతు తెలుపుతున్నదని ఆరోపించారు. దేశం పాక్, భారత్‌గా విడిపోవడానికి కాంగ్రెస్ విధానాలే కారణమన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి బిగ్ షాక్

- మాల్‌ను సీజ్ చేస్తామని ప్రకటన
- హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్టీసీ ఉన్నతాధికారులు



నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ఆర్టీసీ డిపో పక్కన గల స్థలంలో నిర్మించిన మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మాల్‌ను సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. గురువారం టీఎస్ ఆర్టీసీ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో మాల్ వద్ద నిర్వాహకులకు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాల్ నిర్మించిన విషయం తెలిసిందే. అయితే, లీజు డబ్బులు చెల్లించాలని నెల రోజుల కిందటే లీజుదారుడు విశ్వజిత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్‌కు ఆర్టీసీ అధికారులు నోటీసులు అందజేశారు. అయినా స్పందించకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్టీసీ అధికారులు.. మాల్‌ను సీజ్ చేస్తామని దుకాణదారులను హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు మాల్‌ను సీజ్ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఆర్టీసీ సంస్థకు లీజుదారుడు రూ.3 కోట్లా 14లక్షల బకాయి ఉన్నట్టు తెలిపారు. బకాయిలు చెల్లించడానికి దుకాణ యజమానుల విజ్ఞప్తి మేరకు గురువారం సాయంత్రం వరకు గడువు ఇస్తూ నోటీసు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాల్ సీజ్ అంశం చర్చనీయాంశమైంది. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్టీసీ ప్రత్యేక అధికారులలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం.శంకర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు, డిపో సూపర్‌వైజర్ తదితరులున్నారు.




# ఆల్ లోకల్... నేచురల్...

**జొమావి ఖియాంగ్టే...** మిజోరాంకు చెందిన ఈమె విదేశాల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో పని చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిదండ్రులను దగ్గరుండి చూసుకోవాలనే ఉద్దేశంతో స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఏం చేయాలో ఆలోచిస్తుండగా స్థానికంగా పండే పండ్లు ఆమెలో కొత్త ఆలోచనను రేకెత్తించాయి. భర్త వ్యాపార అనుభవంతో ఫామ్-టు-బాటిల్ స్టార్టప్ ప్రారంభించి ఈశాన్య ప్రాంతపు రుచులతో క్రాఫ్ట్ సోడాలను అందిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



మోర్గాన్ స్టాన్లీతో పాటు అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ సెక్టార్‌లో పదిహేనేండ్లు పని చేసిన తర్వాత జోమావి 2016లో తన సొంత రాష్ట్రమైన మిజోరాంకు తిరిగి వచ్చారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న తన తల్లిదండ్రులకు దగ్గరగా వుండాలని ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయమే తర్వాత కాలంలో ఆమె జీవితాన్ని మార్చివేసింది. కాలేజీ రోజుల్లో పరిచయమైన తన అమెరికన్ భర్త ఫెలిపే రోడ్రిగ్జ్‌తో కలిసి సారాయిని అనే షోడా తయారీ సంస్థను స్థాపించారు.

### కోవిడ్‌తో దెబ్బతిన్నది

యూనిలీవర్ వంటి బహుళజాతి కంపెనీలతో కలిసి పని చేసిన రోడ్రిగ్జ్‌కు వ్యాపారంలో విశేషమైన అనుభవం ఉంది. 'క్రాఫ్ట్ బ్రూవరీస్ దేశంలో ప్రజాదరణ పొందుతున్న సమయం అది. మేమిద్దరం కలిసి ఈశాన్య ప్రాంతంలో మొదటి క్రాఫ్ట్ బ్రూవరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. మా బ్రాండ్‌ను లోకల్ బీర్ అని పిలిచాం' అని జోమావి చెప్పారు. ప్రభుత్వం మారే వరకు సుమారు మూడేండ్ల పాటు బ్రూవరీ లాభదాయకంగా నడిపారు. ఆ తర్వాత వారి లైసెన్స్ పునరుద్ధరించబడలేదు. దాంతో ఐజ్వాల్‌లోని ఉత్పత్తి కేంద్రం మూసివేయబడింది. అస్సాం, మేఘాలయతో పాటు కొంతకాలం భూటాన్‌లో స్థానిక బీర్‌ను తయారు చేయడం కొనసాగించారు. అయితే కోవిడ్ -19 మహమ్మారి రూపంలో మరొక పెద్ద దెబ్బ వచ్చింది. వ్యాపారం పూర్తిగా మూతపడింది.

### సహజమైన సోడాలు

ఆ జంట తమ వ్యాపార కలల నుండి కొంత విరామం తీసుకొని కొత్త ఆలోచనకు పునాది వేశారు. ఈశాన్య వ్యవసాయ ఉత్పత్తులతో సహజ సోడాల తయారి ఆలోచనతో ముందుకు వచ్చారు. దీని ఫలితంగా డిసెంబర్ 2021లో Tui Bon Natural పేరుతో లోకల్ ఆల్ నేచురల్ కంపెనీ లాంచ్ చేయబడింది. ఆల్కహాల్ లేని పానీయాలు ఇవి. ప్రస్తుతం ఇది దేశీయ, స్థానికంగా లభించే పోమెలో, రోసెల్లె, ఆరెంజ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్లతో క్రాఫ్ట్ సోడాలను తయారు చేస్తూ ఈశాన్య భారత ప్రజలకు ప్రత్యేకమైన రుచులను అందిస్తుంది. మిజోరంలో టుయ్ బాన్ అంటే 'చాలా రుచికరమైనది' అని అర్థం.

### మార్కెటింగ్ తెలియదు

లోకల్ ఆల్ నేచురల్ అనే ఆలోచన భిన్నమైనదని జోమావి నమ్ముతున్నారు. ఎందుకంటే ఇది బహుళ ప్రయోజనాలు అందిస్తున్నది. 'ఆహార ఉత్పత్తి, మార్కెటింగ్ మధ్య భారీ అంతరం ఉందని మేము గ్రహించాం. రైతులు చాలా ఉత్పత్తి చేస్తున్నారు, కానీ సరైన ఫుడ్ ప్రాసెసింగ్ అందుబాటులో లేదు. వారి ఉత్పత్తులను ఎలా మార్కెట్ చేయాలో తెలియదు. ఆ సమయంలోనే పానీయాల మార్కెట్ పుంజుకుంది. స్థానికంగా లభించే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొని వాటిని పానీయాలుగా మార్చాలని మేము భావించాము' అని జొమావి చెప్పారు. మిజోరాంలోని అడవిలో సిట్రస్ పండ్లతో పాటు నాణ్యమైన అల్లం పుష్కలంగా పెరుగుతుంది. 'మేము ఈ సహజ రుచులతో ప్రీమియం క్రాఫ్ట్ సోడాను ఉత్పత్తి చేయాలనుకుంటున్నాం. అయితే వాటి కోసం ప్లాస్టిక్‌ని ఉపయోగించకుండా గాజు సీసాలలో విక్రయించాలనుకుంటున్నాం' అని ఆమె జతచేస్తుంది. ప్రారంభంలో వీరు నారింజ, అల్లం, పోమెలోతో పాటు ఒక రకమైన ద్రాక్ష పండ్లను ఎంచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. క్రాఫ్ట్ సోడాలు పూర్తిగా ప్రిజర్వేటివ్ లేదా షుగర్ ఫ్రీ కాదు. అయితే జింజర్ ఆలేలో చక్కెర తక్కువగా ఉంటుందని జోమావి అంటున్నారు.









### వివిధ మార్కెట్లను పరిశీలిస్తూ...

ఆమె సోడాలు, పానీయాల మార్కెట్ పోటీగా ఉందని గ్రహించింది. 'వాస్తవానికి మందారంతో కలిపిన మా పోమెలో సోడా జిన్‌తో చాలా రుచిగా ఉంటుంది' అని ఆమె అంటున్నారు. వారు మొదట చిన్న బ్యాచ్‌లలో స్థానిక మార్కెట్లో ఉత్పత్తిని పరీక్షించడం ప్రారంభించారు. 'మా విధానం ఎక్కువగా కమ్యూనిటీ ఆధారితమైనది. మేము సామూహిక ఉత్పత్తి మార్గంలో వెళ్లాలనుకోవడం లేదు. కానీ ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలను అర్థం చేసుకోవాలి. దీనికోసం సంగీతకారులతో సొంత ఈవెంట్‌లు నిర్వహిస్తున్నాం. మా ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నాం. ఈ విధంగా మేము కొత్త ప్రతిభను తెరపైకి తీసుకువస్తాం. మా ఉత్పత్తులకు మార్కెట్ ఏర్పాటు చేసుకుంటున్నాం' అని జోమావి వివరించారు.

### దేశవ్యాప్త వాణిజ్యంలోకి

తక్కువ వ్యవధిలో వీరి బ్రాండ్ ఈశాన్య ప్రాంతంలో ప్రజాదరణ పొందింది. ఇటీవల బెంగుళూరులో కూడా దీన్ని ప్రారంభించారు. 'మేము అక్కడ కొన్ని కార్యక్రమాలను నిర్వహించాం. మంచి స్పందన వచ్చింది. త్వరలో దేశవ్యాప్త వాణిజ్యంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజల అభిరుచులలో తేడాను కూడా అర్థం చేసుకున్నాం. ఢిల్లీలో అల్లం ఆలేను ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. బెంగళూరులో సిట్రస్ రుచులను ఇష్టపడతారు. ఇది మార్కెట్లను బాగా అర్థం చేసుకోవడానికి మాకు సహాయపడుతుంది' అని ఆమె చెప్పారు. ఈ ఉత్పత్తులు అమెజాన్‌లో కూడా అందుబాటులో ఉన్నాయి. ■

### రైతులకు అండగా...

ఐజ్వాల్‌లోని వారి యూనిట్‌లో ఆరుగురితో కూడిన బృందం ఉత్పత్తి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. దాదాపు 30 మంది ఉద్యోగులు ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొంటున్నారు. 'బహుళ సవాళ్ల కారణంగా ఇక్కడ ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. మౌలిక సదుపాయాల కొరత, భూభాగం, డెలివరీ సమస్యలు, నైపుణ్యం కలిగిన కార్మికుల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఉదాహరణకు ఒక యంత్రం చెడిపోతే దాన్ని రిపేర్ చేయడానికి నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణుడిని పొందడానికి ఎక్కువ సమయం పడుతుంది' అని జొమావి చెప్పారు. పోటీ విపరీతంగా ఉన్నప్పటికీ ఈశాన్య రుచులతో సోడాలకు ఆల్ లోకల్ ఆల్ నేచురల్ ప్రత్యేకతతో విజయవంతమైందని ఆమె నమ్ముతున్నారు. 'ఈ పానీయంలో అధిక నాణ్యత గల పదార్థాలను ఉపయోగిస్తూ రైతులకు అండగా నిలబడుతున్నాం. మీరు తాగే ప్రతి సీసాలో ఒక కథ ఉంటుంది. వాటిని సేకరించిన పొలాల్లో మీరు ఆ కథలను కనుగొనవచ్చు' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

---

## ఇండియా జీతేగా..

(మొదటిపేజి తరువాయి)

మార్చేస్తారని, ఇప్పటికే మతోన్మాద ఎజెండాతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. పార్లమెంటు, జ్యుడీషియరీ, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు తాము ఫిర్యాదు చేస్తే కనీసం ఎక్నాలడ్జ్‌మెంట్ ఇచ్చే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ రాజకీయ ఏజెన్సీలుగా మారిపోయాయని, పదేండ్ల బీజేపీ పాలనలో దేశంలో పేదల జీవనం కష్టంగా మారిందని, దీనిపై ఎన్నికల ప్రచారంలో మోడీ మాట్లాడటం లేదని అన్నారు. నల్లధనం లేకుండా చేస్తానని చెప్పిన ప్రధాని ఇప్పుడు అదానీ, అంబానీ కాంగ్రెస్‌కు నల్లడబ్బు ఇస్తున్నారని చెబుతున్నారని, దేశంలో ఇంకా నల్లడబ్బు ఉందని మోడీనే ఒప్పుకున్నారని పేర్కొన్నారు. మరి అంత డబ్బు చేతులు మారుతుంటే ఈడీ ఏమిచేస్తుందో మోడీ చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో ఉన్న పోర్టులు, మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులన్నీ అదానీ, అంబానీలకు ఇచ్చారని, రూ.17 వేల కోట్ల ఆస్తి ఉన్న అదానీ.. మోడీ అండతో ఇప్పుడు ప్రపంచ కుబేరుడుగా మారాడని, అదే అదానీపై మోడీ విమర్శలు చేస్తున్నారని, ఓటమి భయానికి ఇంతకంటే పెద్ద నిదర్శనం ఇంకేమి కావాలని అన్నారు. ఉత్తర భారతదేశంలో ఇండియా వేదిక పార్టీలకు సీట్లు పెరుగుతున్నాయని, బీజేపీకి తగ్గుతున్నాయని తెలిపారు. ఏపీలో టీడీపీ లాంటి ప్రాంతీయ పార్టీల అండతోనే బీజేపీకి ఒకటీ అరా సీట్లు వస్తాయని, నేరుగా బీజేపీ గెలిచే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికే కర్నాటక, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో బీజేపీకి సీట్లు తగ్గుతాయని తేలిపోయిందన్నారు. మోడీ అవినీతిని కూడా చట్టబద్ధం చేశారనటానికి ఎన్నికల బాండ్లే నిదర్శమని తెలిపారు. నష్టాల్లో ఉన్న కంపెనీలు ఎక్కువ ఎన్నికల బాండ్లు కొని బీజేపీకి ఇచ్చాయని, అన్నివేల కోట్లు వాటికి ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. విదేశీ నల్లధనమా, డ్రగ్స్ మాఫియా, ఆయుధ స్మగ్లరు ఇచ్చారో మోడీ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. అదే సమయంలో కంపెనీలపై ఈడీ దాడులు చేయడం, ఆ కంపెనీలు ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి వందల కోట్లు ఇవ్వడం జరిగిపోయాయని, ఈ పద్ధతుల్లో మోడీ అవినీతిని చట్టబద్ధం చేశారని పేర్కొన్నారు. కుంభకోణాలు, మైనార్టీలపై దాడులూ పెరిగాయని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు అంటున్నారని, మణిపూర్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లోనూ డబుల్ ఇంజన్ సర్కార్లు మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు, బుల్డోజర్‌తో కూల్చివేతలకు పాల్పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఆర్థిక, సామాజిక, విద్యా విషయకంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు కల్పించిందని, వాటిని రద్దు చేస్తామంటే వారి హక్కులను నాశనం చేయడం, వారి మనుగడను ప్రశ్నార్థకం చేయడమేనని తెలిపారు. ప్రస్తుతం దేశ ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, దీన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలోనూ ప్రజల్లో వచ్చిన తిరుగుబాటు వల్లే నాయకులు ఐక్యం కావాల్సి వచ్చిందని వివరించారు. ఏపీలో బీజేపీతో కలవడం వల్ల చంద్రబాబుకు లాభం కంటే నష్టమే ఎక్కువని అన్నారు.

## దేశాన్ని వీడుతున్న సంపన్నులు

(మొదటిపేజి తరువాయి)

2015లో దేశంలో 2,36,000 హెచ్ఎన్ఐలు ఉన్నారు. ఈ సంఖ్య 2022 నాటికి 7,96,000కి పెరిగింది. ఇంకా, 2027 నాటికి ఈ సంఖ్య 16,50,000కి చేరుతుందని అంతర్జాతీయ ఏజెన్సీలు అంచనాలు వేస్తున్నాయి. సంపన్న వర్గంలోకి కొత్తగా ప్రవేశించిన వారి సంఖ్య.. విదేశాలకు వలస వచ్చిన వారి కంటే ఎక్కువగా ఉందని గణాంకాలు చూపిస్తున్నాయి.

యూఎస్, యూఏఈ, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, యూకేలు సంపన్న భారతీయులకు అత్యంత ప్రసిద్ధ గమ్యస్థానాలు ఉన్నాయి. సహజంగానే, ధనవంతులు భారత్ నుంచి వలస వచ్చినప్పుడు.. వారి సంపద కూడా వారితో పాటు తరలిపోతున్నది. ఇది ఆదాయ ఉత్పత్తి, సంపద సృష్టి, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేస్తుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. హెచ్ఎన్ఐలు భారత్ నుంచి మాత్రమే కాకుండా ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి ఇతర దేశాలకు తరలిపోతున్నారని వారు చెప్తున్నారు. 2023లో ఇంగ్లాండ్(3200 మంది), రష్యా(3000), బ్రెజిల్(1200) దేశాల నుంచి కూడా ఇలాంటి వలసలు ఉన్నాయి. మొత్తానికి భారత్‌లో రెండు రకాల ధనవంతులున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఒకరు దేశంలోనే ఉంటూ మరింత ధనవంతులు అవుతుంటే, ఇంకొకరు మరింత సంపన్నులు కావటానికి దేశాన్ని వీడుతున్నారని చెప్తున్నారు.

## దలాల్ స్ట్రీట్‌లో 'ఎన్డీఏ'పై భయాలు

**ముంబయి :** దలాల్ స్ట్రీట్‌లో ఎన్నికల భయాలు మొదలయ్యాయి. ఎన్నికల ఫలితాలు ఊహించిన విధంగా ఉండకపోవచ్చనే అంచనాలు ఇన్వెస్టర్లను అమ్మకాలకు దిగేలా చేశాయి. గురువారం సెషన్‌లో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అమ్మకాల ఒత్తిడితో లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. బీఎస్ఇ సెన్సెక్స్ 1062 పాయింట్లు లేదా 1.45 శాతం పతనమై 72,404.17కు క్షీణించింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 345 పాయింట్లు లేదా 1.55 శాతం కోల్పోయి 21,957 వద్ద ముగిసింది. సూచీలు రోజంతా నష్టాల్లోనే కొనసాగాయి.

సార్వత్రిక ఎన్నికల్లో మూడు దశల్లో పోలింగ్ పూర్తయిన వేళ పోలింగ్ సరళిపై మదుపరుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల ముందు ఉన్న ఉత్సాహం వారిలో సన్నగిల్లింది. ముందుగా ఊహించినట్లు ఫలితం ఉండకపోవచ్చన్న అంచనాలు మార్కెట్ల పతనానికి దారి తీశాయి. "ఎన్డీఏ ప్రధాని అభ్యర్థిగా మళ్లీ నరేంద్ర మోడీని ప్రకటించినప్పటికీ.. మెజారిటీపై అనుమానాలు నెలకొన్నాయి. బిజెపి ఊహించిన దానికంటే బలహీనమైన మెజారిటీని పొందుతుందనే భయమే మార్కెట్లలో అస్థిరత పెరుగుదలకు కారణమని చెప్పవచ్చు" అని ఐఎఫ్ఎ గ్లోబల్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అభిషేక్ గోయెంకా రాయిటర్స్‌తో తెలిపారు. సమీప భవిష్యత్‌లో మార్కెట్‌ను అంచనా వేయడానికి కొలమానంగా భావించే వోలటాలిటీ ఇండెక్స్ ఇండియా (విఐఎక్స్) పెరిగి 18 శాతానికి చేరడంతో ఇన్వెస్టర్లలో మరింత ఆందోళన చోటు చేసుకుందని నిపుణులు పేర్కొన్నారు. 2023 మార్చి త్రైమాసికంలో కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా ఉండటం కూడా ప్రతికూలతను పెంచాయి.

ముఖ్యంగా ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ సంస్థాగత మదుపరుల అమ్మకాలు సూచీలను ఒత్తిడికి గురి చేశాయి. దలాల్ స్ట్రీట్‌లో ఒక్క పూటలో రూ.7.3 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.400 లక్షల కోట్ల నుంచి రూ.393.73 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్-30లో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ షేర్లు మినహా మిగిలిన అన్ని స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎల్అండ్‌టి, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, ఏషియన్ పేయింట్స్, బిపిసిఎల్, కోల్ ఇండియా, ఒఎన్‌జిసి, అదానీ ఎంటర్‌ప్రైజెస్ తదితర షేర్లు భారీ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీలో ఆటో మినహా అన్ని రంగాలు క్షీణించాయి. ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు 3.2 శాతం నష్టపోయాయి. మెటల్ 2.9 శాతం, ఎఫ్ఎంసిజి 2.5 శాతం దిగజారాయి. ఫార్మా, రియాల్టీ సూచీలు 2శాతం చొప్పున పతనమయ్యాయి.

## 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ?

(మొదటిపేజి తరువాయి)

నగర్, సత్రంవీధి, కురుమవాడ, శివకృష్ణ టాకీస్ ఏరియా, నెహ్రూపార్క్, స్టేషన్ రోడ్ మీదుగా మధ్యాహ్నం 1గంటకు సీపీఐ(ఎం) కార్యాలయానికి చేరుకుంది. అనంతరం సాయంత్రం 4గంటలకు తిరిగి ప్రచారాన్ని ఏసీరెడ్డి నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నుంచి ప్రారంభించి.. తహసీల్దార్ కార్యాలయం, పాత ఆంధ్రాబ్యాంకు, లేబర్ అడ్డా, గిర్నిగడ్డ, పాత గోదాములు, లక్ష్మీబాయి కుంట వరకు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్, తమ్మినేని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వారికి ప్రజలు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన లక్ష్మీబాయి కుంటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో తమ్మినేని మాట్లాడారు.

మూడోసారి మోడీ గెలిస్తే దేశంలో ఎన్నికలనేవే ఉండవని అన్నారు. బీజేపీ.. భారత రాజ్యాంగానికి ప్రమాదకరమని, ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. పదేండ్ల బీజేపీ పాలనలో ప్రజలపై అధిక భారాలు మోపుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీలేదని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీ అవినీతికి పాల్పడిందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేసి, దేశంలో మోడీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2017లో మోడీ.. పార్లమెంట్ సాక్షిగా రైతుల పంటకు కనీస మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా రైతులను మోసం చేశారని అన్నారు. పైగా నల్ల చట్టాలను అమలు చేస్తూ రైతులను కాల్చిచంపిన వాళ్ళు ఓట్లను ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా, ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను సైతం భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న వారిని తొలగించారని అన్నారు. పదేండ్ల బీజేపీ పాలన శంపిలేనంటూ మూడోసారి గెలిస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని ప్రధాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రిజర్వేషన్లను సమీక్షిస్తామన్న బీజేపీ ప్రభుత్వం.. తిరిగి అధికారంలోకి వస్తే వాటిని రద్దుచేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని చెప్పిన మోడీ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. బీజేపీ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న గొంతుకలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులపై రాజ్యాంగ సంస్థలైన ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీ లాంటి వాటితో దాడులు చేయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని విమర్శించారు. అందుకే దేశంలో మోడీ పాలనకు చరమగీతం పాడేందుకు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. రమ, బుర్రి ప్రసాద్, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, ఎండీ షబానా, పార్టీ సీనియర్ నాయకులు బోట్ల శ్రీనివాస్, పట్టణ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## దొంగ ఓట్లు వేస్తూ దొరికారు

(మొదటిపేజి తరువాయి)

ఎన్నికల చిహ్నమైన కమలం గుర్తుపై బటన్ నొక్కాలని అతను అక్కడికి వచ్చిన ఓటర్లకు చెప్పాడు. ఈవీఎంను చేతిలో పట్టుకొని నాట్యం చేస్తున్న దృశ్యం కూడా వీడియోలో ఉంది. సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్ కావడంతో రాష్ట్రంలో దుమారం రేగింది. కాగా సంత్రామ్‌పూర్‌లోని గోథిబ్‌లో ఇరవై ఐదు పోలింగ్ కేంద్రాల్లో కూడా ఇద్దరు వ్యక్తులు బోగస్ ఓట్లు వేశారని కాంగ్రెస్ ఎన్నికల ఏజెంట్లు ఫిర్యాదు చేశారు. భభోర్, మాగన్‌లు తనపై దాడి చేసి బెదిరించా రని కాంగ్రెస్ ఏజెంట్ తెలిపారు. దొంగ ఓట్ల ఘటన నేపథ్యంలో నలుగురు పోలింగ్ అధికారులకు ఈసీ నోటీసులు జారీ చేసింది.

## రేపు సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్

(మొదటిపేజి తరువాయి)

పేర్కొన్నారు. ఈ నెల 11 సాయంత్రం 5 గంటల నుంచి 13 సాయంత్రం 5 గంటల వరకు 48 గంటల పాటు, జూన్ 4న ఓట్ల లెక్కింపు మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు మద్యం అమ్మకాలు నిలిపేయాలని ఆయన ఆదేశించారు. బైపోల్, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సైతం నిషేధం వర్తిస్తుందని ఎన్నికల సంఘం ఈ సందర్భంగా పేర్కొంది. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్టు పేర్కొంది. ఈసీ ఆదేశం మేరకు పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మూడు రోజుల పాటు రాష్ట్రంలోని 17 పార్లమెంట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో అమ్మకాలు నిలిపేస్తున్నామని పేర్కొంటూ ఆబ్కారీ శాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మద్యం దుకాణాలతో పాటు డిపోలు, తయారీ, విక్రయాలు నిలిపి వేస్తున్నట్టు పేర్కొంది.

## తెలంగాణలో 10 మావే

(మొదటిపేజి తరువాయి)

మధ్య.. కుటుంబ అభివృద్ధి, దేశాభివృద్ధి మధ్య నడుస్తున్న ఎన్నికలని అన్నారు. ఈ ఎన్నికలు రాహుల్ పిల్ల చేష్టల్లాంటి గ్యారంటీలు, మోడీ కచ్చితమైన గ్యారంటీల మధ్య జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే జరిగిన మూడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 200 స్థానాలకు మించి గెలుస్తుందని జోస్యం చెప్పారు. మొత్తం 400 సీట్లు పక్కా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణలో డబుల్ డిజిట్ స్థానాల్లో గెలిస్తే దేశంలో 400 స్థానాల్లో గెలిచినట్టేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన హామీలు అమలు కాలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వరి, గోధుమలకు రూ.500 బోనస్ అమలు చేయలేదని విమర్శించారు. కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు ఇస్తామని ఇవ్వ లేదన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను ముస్లింలకు పంచిందని ఆరోపించారు. బీజేపీ గెలిస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచుతామని స్పష్టం చేశారు. ముగ్గురు ఒక్కటేనని ఏబీసీ అంటే అసదుద్దీన్, బీఆర్ఎస్, కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. టెక్స్‌టైల్ రంగంలో మోడీ 8 లక్షల మందికి ఉపాధి కల్పిం చారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, గంగిడి మనోహర్ రెడ్డి, తాడూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, నాయకులు పడాల శ్రీనివాస్, పడుమటి జగన్మోహన్‌రెడ్డి, పిట్టల అశోక్, బొల్ల సుదర్శన్ పాల్గొన్నారు.

## వచ్చేది కాంగ్రెస్ సర్కారే..

(మొదటిపేజి తరువాయి)

పెట్టుబడిదారులకు పంచిందనీ, తాము అధికారంలోకి రాగానే ఆ సొమ్మును పేదలకు పంచుతామని వివరించారు. పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము గొప్ప పథకాన్ని రూపొం దించామనీ, అధికారంలోకి రాగానే పేదల జాబితా తయారు చేస్తామని చెప్పారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న అన్ని అంశాలనూ అమలు చేస్తామని భరోసానిచ్చారు. మోడీ తన దివాళాకోరు విధానాలతో దేశంలో నిరుద్యోగుల సంఖ్యను పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణనివ్వటం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పిస్తామని హామీనిచ్చారు.

విషం చిమ్ముతున్న బీజేపీ నేతలు : సీఎం రేవంత్

ఇటీవల రాష్ట్రానికి విచ్చేసిన ఓ బీజేపీ నాయకురాలు మాట్లాడుతూ 15 సెకన్ల సమయం ఇస్తే మైనార్టీలను తుద ముట్టిస్తామంటూ వ్యాఖ్యలు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన విశ్వ నగరంలో ఆ పార్టీ నేతలు ఈ రకంగా విషం చిమ్ముతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం అన్ని పండుగలు చేస్తున్నాం. హిందుత్వం గురించి బీజేపీ వాళ్లు మనకు నేర్పాలా..? జనాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకునేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన ఆ బీజేపీ మహిళా నేతపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి, అరెస్టు చేయాలి...' అని రేవంత్ డిమాండ్ చేశారు. ఆమె మాటలను సమర్థించకపోతే వెంటనే ఆమెను పార్టీ నుంచి బహిష్కరించాలని ఆ పార్టీ



నేతలను ఆయన కోరారు. శ్రీరాముని కళ్యాణం, హనుమంతుడి జయంతి తదితర ఉత్సవాలు, పండుగలను మనం చేసుకోవటం లేదా..? ఇప్పుడే వాటిని చేస్తున్నట్టు బీజేపీ చెబుతున్నదని ఎద్దేవా చేశారు. 'దేవుడు గుడిలో ఉండాలి...భక్తి గుండెల్లో ఉండాలి' అని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. 'పేద ప్రజల కోసం రాహుల్ గాంధీ తన జీవితాన్నే అంకితం చేశారని తెలిపారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాల్లో ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు మనకు జీవన్మరణ సమస్య అని హెచ్చరించారు. బీజేపీ ఏలుబడిలో ప్రమాదంలో పడిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బడుగు, బలహీనవర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లపై మోడీ కండ్లు పడ్డాయన్నారు. అందువల్ల వాటిని కాపాడుకోవాలంటే ఇండియా కూటమిని బలపరచాలని పిలుపునిచ్చారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, లాయర్లు, డాక్టర్లు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కూలీలు, విద్యార్థులు... ఇలా అన్ని వర్గాల ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు.

## కులం- మతం ఆధారంగా ఓటేయొద్దు

**వారిద్దరూ టూరిస్టులు.. ఇక్కడ ఉండరు**

- తెలంగాణ కోసం తెగించి కొట్లాడేది బీఆర్ఎస్సే..
- మోడీ చేసిన అభివృద్ధి ఏమీ లేదు : బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్



**నవతెలంగాణ- కంటోన్మెంట్**

"కులం, మతం ఆధారంగా ఓటెయొద్దు.. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పొలిటికల్ టూరిస్ట్‌లు.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాత్రమే లోకల్.. ఉప్పల్‌లోనే ఉంటాడు.. కాబట్టి రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ యూత్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.

మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిది తాండూర్.. ఆమె చేవెళ్ల సీటు అడిగితే బలవంతంగా రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరి సీటు కట్టబెట్టారని తెలిపారు. అలాగే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ స్థానికుడు కాదని, హుజురాబాద్ అని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాత్రమే లోకల్ అని తెలిపారు. కావునా రాగిడి లక్ష్మారెడ్డిని, బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్నను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకే గ్యారంటీ లేదు కాబట్టి ఆ పార్టీ నేతలు చెప్పే మాటలకు ఏం గ్యారంటీ ఉంటుందని ప్రశ్నించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్టు హామీల అమలు గురించి రేవంత్ రెడ్డి నెలలు, తారీఖులు మారుస్తున్నారని విమర్శించారు. రేవంత్ పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్న ఇండస్ట్రీలు తరలిపోతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. యాదాద్రిలాంటి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించామని గుర్తు చేశారు. యువత అంతా ఓటింగ్‌లో పాల్గొని నచ్చిన నాయకుడికి ఓటేయాలని సూచించారు.

పదేండ్ల కింద మోడీ ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధర తగ్గినా దేశంలో పెట్రోల్ ధరలు తగ్గించలేదన్నారు. పదేండ్లలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి ప్రజల నుంచి రూ.30 లక్షల కోట్లు వసూలు చేశారని వివరించారు. అందులో నుంచి రూ.14.5 లక్షల కోట్లతో అంబానీ, అదానీల రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. ఇది నిజం కాదని బీజేపీ నేతలు చెబితే తాను రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎన్నికల్లో తెలంగాణ కోసం తెగించి కొట్లాడే బీఆర్ఎస్‌కే మద్దతివ్వాలన్నారు. ఓటు వేసిన అనంతరం వీవీ ప్యాట్ స్లిప్పులను కూడా చూసుకోవాలని సూచించారు. ఈ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సబ్బండ వర్ణాలకు అవస్థలు తప్పవు

**కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు అంతా కృషి చేద్దాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

- మోడీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ : ఎంపీ రేణుకా చౌదరి
- కాంగ్రెస్ అభ్యర్థి రాఘురామ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఖమ్మం మిర్చియార్డులో కార్మికులు, వ్యాపారులతో సమ్మేళనం

**నవతెలంగాణ- ఖమ్మం**

లోక్‌సభ ఎన్నికల్లో పొరపాటున మోడీ మళ్ళీ అధికారంలోకి వస్తే.. దేశంలో ఇవే చివరి ఎన్నికలు అవుతాయని, రాజ్యాంగాన్ని ఎత్తివేసి ఆయన నియంతలా వ్యవహరిస్తారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం ఖమ్మంలోని మిర్చి మార్కెట్ సమీపంలోని ఆదిలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ ప్రాంగణంలో దిగుమతి శాఖ అధ్యక్షులు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్మిక, వ్యాపారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించడమే పరిరక్షణ మార్గం అని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి దిక్సూచిలా ఉన్న భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకొస్తారని విమర్శించారు. అందరికీ ఇండ్లు, అర్హులకు ఉద్యోగాలు, రైతులకు మూడింతల మద్దతు ధర అంటూ మోడీ అధికారంలోకి వచ్చి ఇవేమీ ఆచరణలో పెట్టలేదని తెలిపారు. బీసీ కులగణన చేపట్టి, అన్ని తరగతుల వారికి పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌కు వామపక్షాలు పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నాయని, రాష్ట్రంలోనే ఖమ్మం ఎంపీ స్థానంలో అత్యధిక మెజారిటీ సాధిస్తుందని తెలిపారు.

రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, అరాచకపాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రజలు చూస్తూ ఊరుకోవద్దని, ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామ్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై పెనుభారం మోపిందని విమర్శించారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని, ప్రజాసేవ చేసుకుంటానని తెలిపారు.

తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మోడీ నల్లధనం తీసుకొస్తానని తేలేదని, రెండు కోట్ల ఉద్యోగాలని ఉన్నవి పీకారని అన్నారు. ఈ దేశానికి ప్రధాని మోడీ మహమ్మారిలా తయారయ్యారని, వామపక్షాలతో కలిసి నిలువరిద్దామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పనైపోయిందని, దానికి ఓటు వేస్తే మురిగిపోయినట్లేనని అన్నారు. రఘురామ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, సీపీఐ రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మానుకొండ రాధా కిషోర్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, తుశాకుల లింగయ్య, భూక్యా శ్రీనివాసరావు, టీపీసీసీ నేత మద్ది శ్రీనివాసరెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, కార్పొరేటర్లు యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, బండారు యాకయ్య, బండారు వీరబాబు, వజినేపల్లి శ్రీనివాసరావు, ఎస్‌కే సైదులు, పత్తిపాక నాగ సులోచన, షేక్ హిమామ్, మద్ది సత్యం కైలాసప వేణు తదితరులు పాల్గొన్నారు.

## మా సమస్యలు పరిష్కరిస్తేనే ఓట్లేస్తాం..

- లేకుంటే బహిష్కరిస్తాం.. భద్రాద్రి జిల్లా పెద్ద వెంకటాపురం గ్రామస్తుల తీర్మానం



**నవతెలంగాణ- ఆళ్ళపల్లి**

"మా గ్రామ సమస్యలు పట్టించుకోని నాయకులకు ఓట్లెందుకు వేయాలి.. సమస్యలను పరిష్కరిస్తేనే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేస్తాం.. లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తాం" అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామస్తులు తీర్మానించారు. తమ గ్రామ ప్రధాన సమస్యలు తీర్చాకే ఓట్లడగటానికి రావాలని, అంతవరకు రావొద్దని గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 500 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. గతంలో గెలిచిన నాయకులు తమ సమస్యలు పట్టించుకోకుండా మొఖం చాటేస్తున్నారని, అబద్ధపు హామీలిచ్చి, మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గతంలో అనేక పర్యాయాలు ఎన్నికల సమయం లో మోసపోయామని, అందుకే ఈసారి ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

మండల కేంద్రం నుంచి గ్రామానికి రహదారి సౌకర్యం, త్రీఫేస్ కరెంట్, తాగునీటి సౌకర్యం, సింగారం, బూసరాయి గ్రామాలకు వెళ్లడానికి బీటీ రోడ్లు, గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు, అంగన్వాడీ నూతన భవనం వెంటనే నిర్మించాలని కోరారు. వీటిని పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. పోడు భూములకు ఫారెస్ట్ అధికారుల నుంచి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర, పటేల్‌లు వజ్జ సురేందర్, కొమరం నాగరాజు, మాజీ సర్పంచ్ వజ్జ నరసింహారావు, హరికృష్ణ, కల్యాణ్, వజ్జ సత్యం, వజ్జ వసంతరావు, శేఖర్, కె.లక్ష్మి, వి.పద్మ, భుజంగరావు, రాంబాబు, దేవకుమారి, సుజాత, రాజేష్, ఉమా, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


















































Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886